# క్రాంతి

లోపలి పేజీల్లో...


| | | |
|---|---|---|
| పోరాడే రైతాంగం | - | 6 |
| పారిస్ కమ్యూన్ | - | 13 |
| ఇంద్రవెల్లి కి 40 ఏళ్ళు | - | 16 |
| మయన్మార్ | - | 20 |
| విశాఖ ఉక్కు పోరాటం | - | 22 |
| మౌలిక వైరుధ్యాలు | - | 28 |
| యన్‌సిటి ఆఫ్ ఢిల్లీ బిల్లు | - | 31 |
| ఫిలిప్పైన్స్ 52వ వార్షికోత్సవం | - | 41 |



సి.పి.ఐ. (మావోయిస్టు) ఎ.పి., తెలంగాణ, ఎ.ఒ.బి. కమిటీల అధికార పత్రిక

సంపుటి: 46 సంచిక: 1 జనవరి-ఏప్రిల్, 2021 వెల: పది రూపాయలు


## బీజాపూర్ జిల్లా, జీరగూడెం గ్రామం వద్ద ఫాసిస్టు "సమాధాన్-ప్రహార్' సైనిక అభియాన్‌కు

# ప్రజా గెరిల్లాల ప్రతిదాడి!

**28 మంది పోలీసులు చనిపోగా, ఒకరు బంధీగా దొరికారు. 31 మంది గాయపడ్డారు.**

ఏప్రిల్ 3, 2021న ఫాసిస్టు మోడీ, అమిత్‌షాల పోలీసులు 2000 మందితో బస్తర్ ఐజి సుందర్‌రాజు నాయకత్వంలో సుక్మా-బీజాపూర్ జిల్లాలలో గ్రామాల మీద 'సమాధాన్-ప్రహార్' పేరుతో భారీ స్థాయి దాడికి వచ్చారు. పిఎల్‌జిఎని నిర్మూలించే దుష్ట పథకంతో వచ్చారు. 2020 ఆగస్టులో ఢిల్లీలో అమిత్‌షా నాయకత్వంలో జరిగిన పోలీసు అధికారుల సమావేశంలోనే ఈ భారీ దాడులకు పథకం నిర్ణయించారు. తరువాత రాయ్‌పూర్ కేంద్రంగా పని చేస్తున్న నరహంతక విజయకుమార్ నాయకత్వంలో అక్టోబర్‌లో తెలంగాణ-వెంకటాపూరంలో 5 రాష్ట్రాల పోలీసుఅధికారులతో క్షేత్రస్థాయి సైనికదాడికి పథకం పన్నారు. బస్తర్ సుందరరాజుకు బస్తర్ సైనిక కమాండుకు బాధ్యత ఇచ్చారు. ఈ దాడులకు ప్రత్యేక అధికారిగా కేంద్రం నుండి అశోక్ జునేజా (డిజిపి)ను నియమించారు.

2020న నవంబర్ నుండి ప్రారంభమైన ఈ దాడులలో సిపిఐ మావోయిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు సామాన్య ప్రజానీకం 150 మందికి పైగా హత్యలు చేసారు. వేలాది మంది ప్రజలను జైల్లో పెట్టారు. మహిళలపై అత్యాచారం చేసి చంపడం, అరెస్టు చేసి చిత్ర హింసలకు గురి చేయడం, ప్రజల ఆస్థులను నాశనం చేయడం, సంపదను లూటీ చేయడం వంటివి చేసారు. ఒకవైపున ఈ విధంగా హింసాకాండను కొనసాగిస్తూ మరో ప్రక్కన అభివృద్ధి పేరుతో పోలీసుల రక్షణలో రోడ్ల నిర్మాణం చేపడుతూ దీనినే అభివృద్ధి అని చెబుతున్నారు. సంక్షేమం కోసం జనతన సర్కార్లు సూల్స్, హాస్పటల్స్ నడుపుతుంటే ప్రభుత్వం వాటిని ధ్వంసం చేస్తూ మావోయిస్టులు అభివృద్ధి నిరోధకులని దృష్ప్రచారం చేస్తున్నారు. పోలీసు క్యాంపులకు, ప్రభుత్వ విధ్వంస కాండకు వ్యతిరేకంగా ప్రజలు దండకారణ్య వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నారు. "స్కూల్స్, హాస్పటల్స్ కావాలని, పోలీసు క్యాంపులు వద్దని" డిమాండ్ చేస్తున్నారు.

సామ్రాజ్యవాద అనుకూల, ప్రజా వ్యతిరేక ఫాసిస్టు మోడీ ప్రభుత్వ పోలీసు బలగాలు 2021, ఏప్రిల్ 3న జీరగూడెం దాడికి

వచ్చినప్పుడు పిఎల్‌జిఎ బలగాలు వారిపై ప్రతిదాడి చేసాయి. ఈ సాహసోపేతమైన ప్రతిదాడిలో, వేల సంఖ్యలో వచ్చిన కిరాయి పోలీసు బలగాల మీద పిఎల్‌జిఎ చేసిన ప్రతిఘటనలో 28 మంది పోలీసులు చనిపోయారు. ఒకరు బంధీగా దొరికారు. 30 మందికి పైగా గాయపడగా, మిగిలిన వారు పారిపోయారు. దీనికి ముందే జీరగూడెం గ్రామస్థుడు మాడవి సుక్కాలును పట్టుకొని చిత్రహింసలు పెట్టి, వారితో పట్టుకుని పోయారు.

ఈ దాడిలో 4గురు పిఎల్‌జిఎ యోధులు వీరోచితంగా పోరాడి అమరులయ్యారు. 1. కామ్రేడ్ ఓడి సన్ని 2. కామ్రేడ్ పద్దమ్ లక్మా 3. కామ్రేడ్ కోవాసి బద్రు 4. కామ్రేడ్ నూపో సురేష్. కామ్రేడ్ సన్నీ మృతదేహాన్ని పోలీసులు పట్టుకుపోయారు. మిగిలిన ముగ్గురిని విప్లవ ప్రజల మధ్యన విప్లవ సాంప్రదాయాలతో, విప్లవ జోహార్లు చెబుతూ అంతిమ సంస్కరణ జరిపారు.

“నిజానికి పోలీసులు మాకు శత్రువులు కాదు. పాలకవర్గాలు తెచ్చిపెట్టిన అన్యాయమైన యుద్ధంలో బలి పశువులు కావద్దని వారికి విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ ఘటనలో చనిపోయిన పోలీసుల కుటుంబాలకు సంతాపం తెలియజేస్తున్నాం. ఈ దాడిలో పిఎల్‌జిఎ 14 ఆయుధాలను, 2000 పైగా తూటాలను, మరి కొంత యుద్ధ సామాగ్రిని పోలీసుల నుండి స్వాధీనం చేసుకున్నది” అని డికె ఎస్‌జెడ్‌సి ఒక ప్రకటనలో తెలియజేసింది.

సామ్రాజ్యవాదుల, దళారీ బూర్జువాల నమ్మిన బంటు నరేంద్రమోడీ దేశంలోని ప్రభుత్వ సంస్థలకు, వ్యవస్థలకు సామ్రాజ్యవాద కంపెనీలకు, అంబానీ, అదానీల వంటి దళారీ కంపెనీలకు అప్పజెబుదామని, పెట్టుబడిదారుల ద్వారానే అభివృద్ధి జరుగుతుందని పార్లమెంటులోనే ప్రకటించాడు. వనరుల దోపిడికి, సంపద తరలింపుకు మావోయిస్టు పార్టీ ఆటంకంగా ఉండటంతో, మావోయిస్టులు లేని భారత్‌ను నిర్మాణం చేస్తామని ప్రకటిస్తున్నాడు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై సైనిక దాడులు చేస్తున్నాడు. 2022 లోగా మావోయిస్టు పార్టీని నిర్మూలిస్తామనే లక్ష్యాన్ని ప్రకటించాడు. జీరగూడెం దాడి తరువాత జగ్దల్‌పూర్ వచ్చిన అమిత్‌షా మాట్లాడుతూ “మా పోలీసు బలగాల్లో నైతిక స్థైర్యం ఎక్కువ వుందని, మావోయిస్టు వ్యతిరేక సైనిక దాడిని మరింత తీవ్రతరం చేసి, లక్ష్యాన్ని పూర్తి చేస్తామని” ప్రకటించాడు.

ఈ పరిస్థితిల్లో ప్రజలను, వనరులను, ప్రజా సంపదలను కాపాడుకోవడంలో భాగంగా పిఎల్‌జిఎ తప్పనిసరి పరిస్థితుల్లో ప్రతిదాడి చేయవలసి వస్తున్నది.

చర్చల గురించి ఎస్‌జడ్‌సి- చర్చలకు మేం ఎప్పుడూ సిద్ధమే. ప్రభుత్వానికే చిత్తశుద్ధి లేదు. గతంలో జరిగిన అనేక చర్చల సందర్భాల్లో ఉద్యమకారులు ఎప్పుడూ ఆయుధాలు విడిచింది లేదు. చర్చలకు సానుకూల వాతావరణం కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వానిదే. బలగాల మోహరింపులు, క్యాంపుల నిర్మాణం, దాడులు, నిర్బంధ విధానాలను నిలిపినపుడే చర్చలు జరుగుతాయి. అలా కాకుండా బలగాలతో దాడులు చేస్తున్నందుకే కొండగాం, నారాయణపూర్, బీజాపూర్ జిల్లాల్లో జరిగిన ప్రతిదాడులలో పోలీసులు చనిపోవలసి వచ్చింది. దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే- అని ఆ ప్రకటనలో చెప్పింది.

మోడీ అధికారంలోకి వచ్చిన 7 సంవత్సరాల కాలంలో ఆర్థిక సంక్షోభం తీవ్రమై, రాజకీయ పరిస్థితులు దిగజారి ప్రజల మానప్రాణాలకు, దేశ సంపదకు ప్రమాద పరిస్థితి ఏర్పడింది. దేశవ్యాప్తంగా అన్ని వర్గాల మీద అన్ని సంస్థల మీద , దళితులు, ఆదివాసులు, మత మైనార్టీలు, మహిళలు, కార్మికులు, రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజాస్వామికవాదులు మీద, ప్రజా సంఘాలపైన ప్రభుత్వం ఫాసిస్టు దమనకాండను కొనసాగిస్తున్నది. పోరాడుతున్న మేధావులు, ప్రజాస్వామిక వాదులను అర్బన్ మావోయిస్టులనే పేరు మీద, చివరకు బూర్జువా పార్టీల నాయకుల మీద మోడీ ప్రభుత్వం చేస్తున్న దాడులు పెరిగి పోతున్నాయి. అన్ని రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసి, యన్ఐఎకు విస్తృత అధికారాలు ఇచ్చి ఫాసిస్టు పాలనను చట్టబద్ధం చేస్తున్నారు. మేమే దేశభక్తులమని బుకాయిస్తున్నారు.

దేశవ్యాప్తంగా జల్-జంగల్-జమీన్-ఇజ్జత్ నినాదాలతో అడవి, మైదానాలలోని ప్రజలు పోరాడుతూ, ప్రకృతి వనరులను, సంపదను కాపాడుకుంటున్నారు. వీరే నిజమైన దేశ భక్తులు. ఆ పోరాటాలకు సిపిఐ (మావోయిస్టు) నాయకత్వాన్ని అందిస్తూ, ఆ పోరాటాలను మిలిటెంట్‌గా ముందుకు తీసుకుపోతున్నది. ప్రజా పోరాటాలను, ప్రజా యుద్ధాన్ని నడుపుతున్నది.

దేశం నేడు అత్యంత కఠిన పరిస్థితుల్లో ఉంది. దేశ ప్రజలకు మోడీ, అమిత్‌షాల ఫాసిజమే అత్యంత ప్రమాదకారి. అన్ని రాజ్యాంగ వ్యవస్థలు నిర్వీర్యమై పోయిన పరిస్థితుల్లో, చట్టబద్ధ ఆందోళనలను క్రూరంగా అణచి వేస్తున్న పరిస్థితుల్లో ప్రజాందోళన, ప్రజాయుద్ధం జమిలిగా సాగే సాయుధ పోరాట మార్గమే ప్రత్యామ్నాయం. ‘అన్ని అధికారాలు ప్రజలకే’ అనే విధానంతో నడుస్తున్న ‘జనతన సర్కార్ల’ మార్గమే సరియైన ప్రత్యామ్నాయం. అన్ని వర్గాల, అన్ని సెక్షన్ల ప్రజలు జనతన సర్కార్ల మార్గంలో భాగస్వాములు కావాల్సి ఉంది. మోడీ, అమిత్‌షాలు ఎన్ని రాక్షస మారణకాండలకు పథకాలు పన్నినా వాటినన్నింటినీ ప్రజాయుద్ధం ద్వారా ఓడిద్దాం.

20వ పి.ఎల్.జి.ఎ వార్షికోత్సవాల సందర్భంగా జీరగూడెం ప్రతిదాడిని విజయవంతం చేసిన గెరిల్లాలకూ, విప్లవ ప్రజలకు జేజేలు పలుకుదాం!

## జీరగూడెం ప్రతి ఘటనలో అమరులైన నలుగురు పార్టీ సభ్యులు



కామ్రేడ్ నూపో సురేష్ | కామ్రేడ్ వోడి సన్ని | కామ్రేడ్ పద్దమ్ లక్మా | కామ్రేడ్ కోవాసి బద్రు



**అమరుల అంతిమ యాత్రకు కదిలివచ్చిన జనతన సర్కార్ ప్రజలు, గెరిల్లాలు.**

కామ్రేడ్ నూపో సురేష్ (పియమ్) దక్షిణ్ బస్తర్ డివిజన్ పామేడ్ ఏరియా మీనగట్ట గ్రామం. పామేడ్ యల్ఓఎస్ సభ్యుడు. కామ్రేడ్ వోడి సన్ని (పియమ్) దక్షిణ్ బస్తర్ డివిజన్ కిష్టారం ఏరియా ఎల్మగొండ గ్రామం. ఒకటవ బెటాలియన్ లో ఒకటవ కంపెనీ సభ్యురాలు. కామ్రేడ్ కోవాసి బద్రు (పియమ్) దర్భా డివిజన్ కట్టకళ్యాణ్ ఏరియా కొదుం గ్రామం. రెండవ కంపెనీ సభ్యుడు. కామ్రేడ్ పద్దమ్ లక్మా (పియమ్) దర్భా డివిజన్ కట్టకళ్యాణ్ ఏరియా చిక్కపాల్ గ్రామం. ఒకటవ బెటాలియన్‌లో సభ్యుడు.

ఎప్రిల్ 3న జరిగిన ప్రతిఘటనలో బంధీగా దొరికినా కోబ్రా కమాండో రాకేశ్వర్ సింగ్ మన్హా 6 రోజుల పాటు జనతన సర్కార్ రక్షణలో సురక్షితంగా ఉన్నాడు. ఎప్రిల్ 9వ తేదిన చత్తీస్‌ఘడ్ ప్రభుత్వం పంపిన మధ్యవర్తులు ధర్మపాల్ సైనీ, తెల్లం బొరయ్యలకు 5 వేల మంది ప్రజల పాల్గొన్న ప్రజా సభలో విలేకర్ల సమక్షంలో ప్రజా సభలో అతనిని అప్పగించడం జరిగింది. విప్లవ క్యాంపులో బంధీగా ఉన్న ఆ పోలీసును విలేకరులు ప్రశ్నించినప్పుడు 'జనతన సర్కార్, పీఎల్‌జీఏ రెండు నన్ను తల్లిదండ్రుల్లాగా ఆదరించారు. 3 పూటలా తిండి పెట్టి, టీ ఇచ్చి మర్యాదగా చూసుకున్నారని చెప్పారు.




**జీరగూడెం ప్రతిఘటనలో పోలీసుల నుండి స్వాధీనం చేసుకున్న ఆయుధాలు, తూటాలు.**




**బంధీగా దొరికిన కోబ్రా కమాండో రాకేశ్వర్ సింగ్ మన్హా**

★

# పీఎల్‌జీఏ ప్రతిఘటనకు అనూహ్యమైన స్పందన

దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పాశవిక దాడులకు గురైన వివిధ రంగాల, వివిధ సెక్షన్ల ప్రజలు దీనిని పాసిస్టు పాలకులకు సరైన జవాబుగా ఆహ్వానించారు. విప్లవ పార్టీ పట్ల, పీఎల్‌జీఏ పట్ల తమ విశ్వాసాన్ని ప్రకటించారు. విప్లవ శ్రేణుల్లో విప్లవోత్సాహం ద్విగుణీకృతమయ్యింది. నేడు ఉద్యమిస్తున్న రైతాంగం, కార్మికులు, దళితులు, ఆదివాసులు, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, మత మైనార్టీలు, వివిధ జాతుల ప్రజలు సమస్తం దోపిడీ వర్గాల పట్ల తమ ద్వేషాన్ని, కసిని ప్రకటించినట్లైందని భావించారు. ఆ ప్రతిఘటనలో నిరంకుశ ప్రభుత్వాన్ని, బలమైన కేంద్రాన్ని దెబ్బకొట్టగల విప్లవ శక్తిని చూడగలిగారు.

ప్రజావ్యతిరేక, సామ్రాజ్యవాద అనుకూల నయా ఉదారవాద విధానాలను వేగంగా అమలు చేయడానికి, హిందూరాజ్య నిర్మాణానికి తీవ్రంగా కృషి చేస్తున్న హిందూ ఫాసిస్టు శక్తులకు, తమను ఎదుర్కోగల శక్తి ఏది లేదని విర్రవీగుతున్న సందర్భంలో ప్రత్యామ్నాయం ఉందని, అది అట్టడుగు ప్రజల ఆగ్రహావేశాల నుండి ఉద్భవించిందని తెలిసి కలవరం పట్టుకుంది. అందుకే అమిత్‌షా ఆఘమేఘాల మీద బస్తర్‌లోని బాసగూడెంకు, జగదల్పూరుకు వచ్చాడు. రాయ్‌పూర్‌లో సమీక్షకు సూచనలు చేసి వెళ్ళాడు. కేంద్ర హోంమంత్రి, బిజెపిలో కీలక నాయకుడు, కుట్ర రాజకీయాలు చేయడంలో సిద్ధహస్తుడు అమిత్‌షా ఎందుకంతగా ఆత్మస్థైర్యం కోల్పోయాడు. బలగాలు మనోస్థైర్యం దెబ్బతినలేదని పదేపదే అంటున్నాడు. మావోయిస్టులను ఏరివేస్తామని (ఒంటరిగానే) గావు కేకలేస్తున్నాడు. జీతభత్యాల కోసం పనిచేసే జవాన్‌లకు ప్రజల శ్రేయస్సు, దేశ భవిష్యత్ ప్రధానం కాదు. ప్రజల కోసం, ఈ దేశ విముక్తి లక్ష్యంగా పని చేసే మావోయిస్టులకు విశ్వాసం, ధైర్యసాహసాలు, ఆత్మస్థైర్యం ఉన్నతంగా ఉంటాయి. అవి విప్లవ రాజకీయాలతో కూడుకున్నవి. నక్సల్బరి నుండి నేటి వరకు దశాబ్దాల విప్లవోద్యమ చరిత్రలో ఎన్నో త్యాగాలున్నాయి. అమరుల విలువైన చరిత్రలు ఉద్యమాభివృద్ధికి ఎంతో దోహదం చేసాయి. ఎవరు ఎవరికోసం పని చేస్తున్నారు, ఏ లక్ష్యం కోసం పోరాడుతున్నారు, ప్రాణ త్యాగానికి సిద్ధపడుతున్నారు. ఇది ప్రధానం. పీడిత ప్రజలకు ఆవిషయం స్పష్టమే. దోపిడి వర్గాల మీడియా ఎన్ని అబద్ధాలు చెప్పినా, మాయచేసి తప్పుదారి పట్టించాలని చూసినా వాస్తవ ప్రజల స్పందనను దాచలేదు. పాలకుల భయాలను కప్పిపుచ్చలేదు. ఆ దెబ్బ ఒక్కచోటే కావచ్చు. కాని అది భారత పీడిత ప్రజల సమిష్టి స్పందన. ప్రజల ప్రతి స్పందనగానే ఆ ప్రతిఘటనకు గుర్తింపు వచ్చింది. అలానే చరిత్రలో రికార్డవుతుంది.

దేశంలో ఆర్థిక సంక్షోభం తీవ్రమై ఇంటా బయటా అబాసుపాలవుతున్న సందర్భంలో, దేశంలో ఆర్థిక సంక్షోభం తీవ్రమై అది రాజకీయ సంక్షోభంగా మారి బిజెపిలోను, ప్రతిపక్షపార్టీలలోను అంతర్గత కుమ్ములాటలు బలపడుతూ, బెంగాల్ ఎన్నికలు కీలకం కానున్న సందర్భంలో జీరగూడెం పీఎల్‌జీఏ ప్రతి ఘటనలో హిందూ ఫాసిస్టుల పథకం, పోలీసుల వ్యూహం రెండూ విఫలం కావడంతో బిజెపి ఊహలపై నీళ్ళు జల్లినట్లయ్యింది. పోలీసుల మనోస్థైర్యం దెబ్బతిని పోయింది. సూపర్ కాప్ కెపిఎస్ గిల్‌లాగా కె.విజయ్ కుమార్ ను ఇంటికి సాగనంపే పరిస్థితి ముందుకొచ్చింది. ఆలోక్ జునేజా ఏం మాట్లాడినా, కుల్‌దీప్ సింగ్ "మావోయిస్టులు చావడం లేదా పారిపోవడం అని" రెండు ఆప్షన్‌లను పెట్టినా చివరికి జరిగేది ఒక్కటే. దోపిడీ వర్గాల అంతం, పీడిత ప్రజల విజయం.

ఆర్థిక సంకటం, రాజకీయ సంకటాల నుండి బయటపడేందుకు దోపిడీ పాలకవర్గాలు ఫాసిజాన్ని అనుసరిస్తాయి.అవి ప్రధానంగా పోలీసు, సైనిక బలగాలమీదనే ఆధారపడతాయి. ఇప్పుడు వాటికే గట్టిదెబ్బ తగలడంతో వెర్రెత్తి పోయిన అమిత్‌షా అస్సాం నుండి ఢిల్లీ మీదుగా రాయిపూర్‌కు వచ్చేసాడు. బాసగూడెం, జగదల్పూర్‌లను చుట్టి పోలీసుల్లో ఆత్మసైర్థ్యం పెంచాలనుకున్నాడు. ఆత్మస్థైర్యం దెబ్బతినిపోయిన షా ఉరుకులు, పరుగులు పెడుతున్నాడని అందరికి అర్థమయిపోయింది.

సామ్రాజ్యవాదుల ముందు, కార్పోరేట్ శక్తుల ముందు అంబానీ, అదానీల ముందు తను సమర్థుడినేనని నిరూపించుకోవాలి. విదేశాల నుండి అప్పులు, పెట్టుబడులు తెచ్చుకోవాలి అంటే సుస్థిర ప్రభుత్వం, సుస్థిర పాలన గ్యారెంటీ ఇవ్వాలి కదా. దేశంలో ప్రతి పక్షాలను దెబ్బతీసినా, సమస్త రంగాల, సెక్షన్ల ప్రజల్ని అణచివుంచినా, మిడియాను అడ్డం పెట్టుకుని అబద్దాలతో, మాయమాటలతో లేని అభివృద్ధిని, తమకు లేని సమర్థతలను గొప్పలు చెప్పుకున్నా కొన్నాళ్ళు చెల్లింది. ఈ ఘటనతో వాస్తవం ఎక్కిరిస్తుంది. మావోయిస్టులు ప్రత్యామ్నాయంగా తయారయి ప్రజల కళ్ళముందు కనబడుతున్నారు. శత్రువు దాడులను ప్రతిఘటిస్తున్నారు.

ఎల్ఐసి వ్యూహంలో భాగంగా సల్వాజుడుం, గ్రీన్‌హంట్, సమాధాన్, ప్రహార్ 1,2,3 లాంటి పథకాలు ఎన్ని రచించినా ప్రజా యుద్ధ రాజకీయాల ముందు చిత్తుకాక తప్పడం లేదు. ప్రజల శ్రమ శక్తిని, దేశ సంపదను దోపిడీ చేసి, అణచివేతను తమ దోపిడీ వర్గ పాలనా విధానంగా కొనసాగిస్తున్నంత కాలం ప్రజలు వివిధ రూపాల్లో ప్రతిఘటిస్తూనే ఉంటారు. మోదీ-షాల కూటమిలో కల్లోలం మొదలయ్యింది. గుజరాత్ మారణకాండలు, బాబ్రీ మసీదు విధ్వంసాలు, గత 7 సంవత్సరాల పాలనలో దిగజారిన దేశంలోని పరిస్థితులు. అన్ని రంగాల, అన్ని సెక్షన్ల ప్రజలు పడిన ఇబ్బందులు ఎదురు తిరుగుతున్నాయి. అందుకు

ఈ రకమైన ప్రతిఘటనలు కావలసినంత భూమికను చేకూర్చుతాయి.

2 వేల మంది పోలీసులు దాడికి వచ్చారు. పీఎల్‌జీఏ చేసిన ప్రతిదాడిలో 28 మంది పోలీసులు చనిపోగా, 31 మంది గాయపడ్డారు. ఒకరు బంధీగా దొరికారు. అమిత్‌షా యుద్ధం, దాడి, ప్రహార్-3 దశ అంటూ సైనికభాష మాట్లాడుతున్నాడు. మాది ప్రతిదాడి, ప్రతిఘటన, ఆత్మరక్షణ విధానం మాత్రమే. ప్రజలు యుద్ధాన్ని కోరుకోరు. ప్రభుత్వమే యుద్ధాన్ని ప్రకటిస్తే ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకుంటారు. ఆత్మరక్షణలో భాగంగా ప్రతిఘటిస్తారు. ఇదే వర్గ సమాజంలో తరతరాలుగా ఆవిష్కృతమవుతున్నది.

బంధీగా దొరికిన రాకేశ్వర్ సింగ్ మన్హాను పీఎల్‌జీఏ, జనతనసర్కార్ ప్రజలు సాదరంగా చూసారు. గౌరవప్రదంగా మధ్యవర్తులను రప్పించి ప్రజా సభలో విలేకర్ల ముందు అప్పగించారు. అప్పటి వరకు పాలక వర్గాల హింసను కప్పిపుచ్చి మావోయిస్టులు హింసావాదులని పాలక వర్గాలు చేసిన దుష్ప్రచారానికి, కొద్దిమంది అవకాశవాదుల కుతర్కాలకు గండిపడింది. మేమే దాడికి వెళ్ళామని గాయపడిన పోలీసులు చెప్పిన వాస్తవాలను తొక్కిపెట్టి మావోయిస్టులు వల పన్ని పోలీసుల్ని హతమార్చారన్న తప్పుడు కథనాలను అల్లారు. "మా మధ్య పిల్లి-ఎలుక ఆట సాగింది" అన్న కె.విజయకుమార్ చెప్పిన వాస్తవ కథనంతో అవన్నీ బహిర్గత మైపోయాయి.

ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారీ విధానం విఫలమైంది. ప్రపపంచ దేశాలలోని అన్ని రకాల పార్లమెంటరీ వ్యవస్థలు ఫాసిజాన్ని అమలు చేస్తూ నయా ఉదారవాద విధానాలు కొనసాగిస్తున్నాయి. సామ్రాజ్యవాద విధానాల ఫలితంగా ప్రపంచ పర్యావరణ సమస్యలు తీవ్రమైన కొవిడ్-19 మహమ్మారి కోట్ల మంది పేద ప్రజలపై ప్రభావం చూపి లక్షల మంది మరణానికి కారణమైంది. పాలకవర్గాలు పనిచెయ్యని వాక్సిన్‌ను తెచ్చి వ్యాపారం కోసం వ్యాక్సిన్ ఉత్సవాలు జరుపుతున్నారు. మనిషి ప్రాణాలను పణంగా పెట్టి వ్యాపారం చేస్తున్నారు.

నేడు దేశంలో అన్ని వర్గాల, సెక్షన్ల ప్రజలు దోపిడీ వర్గ రాజకీయలకు ప్రత్యామ్నాయంగా మావోయిస్టు రాజకీయాలను కోరుకుంటున్నారు. వివిధ నిర్మాణాల్లో సమీకృతమవుతున్నారు. నేడు దేశానికి ప్రతిఘటన రాజకీయాలు, జనతన సర్కార్ రాజకీయ పరిపాలన విధానం మాత్రమే ప్రత్యామ్నాయం తప్ప మరో మార్గం లేదు. పీడిత ప్రజలు ప్రతిఘటిస్తారు. విశాల ప్రజల ప్రతిఘటనగా జీరగూడెం ఘటన నిలుస్తుంది.

విప్లవ ప్రజలకు ప్రతిఘటనా శక్తి ఉంది. ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయి. అంతిమ విజయం ప్రజలదే. ★

---

*(25వ పేజీ తరువాయి....)*

ప్రైవేటీకరణ ఇలా చెప్పుకుంటూ పోతే ఈ లిస్టు ఒక పెద్ద చాంతాడంత అవుతుంది. మరోవైపు ఈ చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగం, కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు, వివిధ సెక్షన్ల ప్రజలు మునుపెన్నడూ లేనంతగా ఉద్యమబాట పడుతున్నారు. ఆ ఉద్యమాలు దేశవ్యాపిత, సమరశీల స్వభావాన్ని సంతరించుకుంటున్నాయి. ఈ స్థితి సామాజిక సంక్షోభపు తీవ్రతను వ్యక్తీకరిస్తున్నది. ఈ సామాజిక సంక్షోభాన్ని పరిష్కరించేందుకు మోడీ ఇప్పటికే అనేక 'మంత్ర'లను ప్రయోగించాడు. అవన్నీ విఫలమైనాయి. ఇప్పటికీ 'అభివృద్ధి మంత్ర', 'ఆత్మ నిర్భర్ మంత్ర' అంటూ మరికొన్ని 'మంత్ర'లను ఉపదేసిస్తున్నాడు. వీటి బండారాన్ని కూడా ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. ఇటువంటి పరిస్థితులలో దోపిడీ పాలకవర్గాలకు మిగిలిన ప్రత్యామ్నాయం మతం, జాతి, 'దేశభక్తి'ల పేరుతో ప్రజలలో భావోద్రేకాలను ప్రేరేపిస్తూ, ఒక కృత్రిమ, బలవంతపు ఐక్యతను తెచ్చేందుకు ప్రయత్నించడమూ, ఈ కృత్రిమ, బలవంతపు ఐక్యత ఆధారంగా దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలకూ, వారి యజమానులైన సామ్రాజ్యవాదులకు దోచుకునేందుకు భారతదేశాన్ని సురక్షితమైన మార్కెట్ (నయాభారత్ లేదా హిందూరాజ్యం)గా మార్చడమూ, ఈ ప్రక్రియకు వ్యతిరేకంగా ఉన్నవారిని నిర్దాక్షిణ్యంగా అణచివేయడం ఉంటుంది. దీనినే 'ఫాసిజం' అంటారు. ఈ క్రమం ఇప్పటికే ప్రారంభమైంది. ఆర్.ఎస్.ఎస్ మార్గదర్శకత్వంలో పని చేస్తున్న మోడీ ప్రభుత్వం ఒక వైపున బ్రాహ్మణీయ హిందూ మతోన్మాదాన్నీ, హిందూ సాంస్కృతిక జాతీయవాదాన్నీ, దేశభక్తిని ప్రజలలో ప్రేరేపిస్తూ, వాటి ఆధారంగా ప్రజలలో ఏర్పడిన ఒక మందబలాన్ని చూసుకొని సామ్రాజ్యవాద అనుకూల, ప్రజావ్యతిరేక సంస్కరణలను అత్యంత మెరటుగా అమలుచేస్తున్నది. మరోవైపు తన విధానాలను వ్యతిరేకిస్తున్న కార్మికులనూ, రైతాంగాన్నీ, దళితులనూ, మహిళలనూ, మతమైనారిటీలనూ, పీడిత జాతులనూ, ప్రజాస్వామికవాదులనూ, మేధావులను తీవ్రంగా అణచివేస్తున్నది. ఏ ప్రజాఉద్యమమైన ఫాసిజం సవాలును ఎదుర్కొనేందుకు అన్ని విధాలా సిద్ధంకావాలి.

**ముగింపు**

'విశాఖ ఉక్కు పరిరక్షణా' ఉద్యమంలో ముందుపీఠిన నిలబడి పోరాడుతున్న కార్మికవర్గం ఈ సందర్భంగా తమ చారిత్రక కర్తవ్యాన్ని మననం చేసుకోవాలి. ప్రస్తుత పరిస్థితులల్లో 'విశాఖ ఉక్కు పరిరక్షణా' ఉద్యమం కేవలం ఆ డిమాండ్‌పైనే, అక్కడి ప్రజలతోనే పోరాడితే సాధ్యమయ్యేది కాదు, ఆ ఉద్యమ విజయం పైన చెప్పుకున్నట్లుగా అనేక సవాళ్ళను ఎదుర్కోవడంపైన, ప్రజాపోరాటాలను సమన్వయించుకొని ఒక ప్రజాపోరాట వెల్లువను సృష్టించడంపైన ఆధారపడి ఉంది. ఆ ఉద్యమానికి తక్షణ, అంతిమ లక్ష్యాలను రూపొందించుకోవడంపై కూడా ఉద్యమ విజయం నిర్ణయించబడుతుంది. ఈ కర్తవ్యాలనూ, లక్ష్యాలను తమ చారిత్రక కర్తవ్యంలో భాగంగా చేసుకొని 'విశాఖ ఉక్కు పరిశ్రమ' కార్మికులు పురోగమిస్తారని ఆశిద్దాం! ★

**బహుళజాతి కంపెనీలకు, దళారీ నిరంకుశ బడా బూర్జువాలైన ముఖేష్ అంబానీ, గౌతమ్ అదానీలకు దేశాన్ని అమ్మివేస్తున్న బిజెపి, ఆర్ఎస్ఎస్‌లను తరిమికొట్టండి!**

**సామ్రాజ్యవాదుల ప్రాయోజిత ఆదేశాలతో మోడీ ప్రభుత్వం ముందుకు తెచ్చిన మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేసే వరకు రైతాంగం పోరాటాన్ని కొనసాగించాలి!**

**దేశంలోని యావత్తు ప్రజలు పోరాడే రైతాంగానికి మద్దతునివ్వాలి!**

నేడు దేశంలో రైతాంగం మహోజ్వాల పోరాట ఘట్టానికి తెర తీసింది. వలసవాద వ్యతిరేక పోరాటంలో రైతాంగం ప్రముఖ పాత్ర వహించింది. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా దేశమంతటా అనేక తిరుగుబాట్లు చేసింది. రాచరిక, ఫ్యూడల్, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాల్లో చారిత్రక పాత్ర వహించింది. పంజాబ్ నుండి బెంగాల్ వరకు, మధ్యప్రదేశ్ నుండి దక్షిణాన తమిళనాడు వరకు జరిగిన బ్రిటీష్ వ్యతిరేక చారిత్రక పోరాటాల్లో రైతాంగానిదే ప్రధానమైన పాత్ర ఉండింది. అలాంటి పోరాట వారసత్వం గల రైతాంగం నేడు బిజెపి ప్రభుత్వం తెచ్చిన ప్రతీఘాతుక మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా మిలిటెంట్‌గా పోరాడుతున్నది. భూమి, స్వపరిపాలన కోసం బ్రిటీష్ వలసవాదులకు వ్యతిరేకంగా పోరాడిన రైతాంగం, నేడు నయావలసవాద, సామ్రాజ్యవాద అనుకూల, దళారీ నిరంకుశ బడాబూర్జువా ప్రయోజనాలు నెరవేర్చడానికి బిజెపి ప్రభుత్వం తెచ్చిన ఈ చట్టాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ఈ మూడు చట్టాల ద్వారా ప్రభుత్వం తమ భూములను లాక్కుంటుందని గ్రహించిన రైతాంగం ఎంతో పట్టుదలతో పోరాటానికి దిగింది. 5 నెలలుగా సాగుతున్న రైతాంగ పోరాటాలు తమకు ఎదురులేదని భావిస్తున్న బిజెపి ప్రభుత్వానికి ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. సామ్రాజ్యవాదులకు, దళారీ నిరంకుశ బూర్జువా వర్గానికి కలవరం రేపుతున్నాయి.




ఈ చట్టాల ద్వారా కార్పొరేట్ కంపెనీలకు, బహుళజాతి కంపెనీలకు దేశంలో వ్యవసాయ రంగంపై గట్టి పట్టు ఏర్పడుతుంది. రైతాంగం చేతులలో ఉన్న భూములకు సంబంధించిన పెట్టుబడి నిర్ణయాలు తీసుకోగలిగే విధంగా అంతర్జాతీయ, దేశీయ కార్పొరేట్ కంపెనీలకు అధికారం దక్కుతుంది. దేశంలో ఉన్న పేద, మధ్య తరగతి రైతులు తమ భూములు కోల్పోయి కూలీలుగా మారే ప్రక్రియ వేగవంతం అవుతుంది. చిన్న, మధ్య రకం కమతాలు లాభసాటిగా లేకుండా పోయి, రైతాంగం దివాళా తీసి తమ భూములను అమ్ముకోవాల్సిన దుస్థితికి దారి తీస్తుంది. ఇప్పటికే మూడు లక్షలకు పైగా నమోదైన ఆత్మహత్యల పరంపర మరింత పెరిగిపోతుంది. ప్రపంచ వ్యవస్థీకృత రిటైల్ రంగం వర్తక గొలుసులో ఇరుక్కుని చిన్న రైతులు తమ భూముల నుండి స్థానభ్రంశం చెందుతారు. చిల్లర వర్తకం కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి వెలుతుంది. తద్వారా దేశంలోని మార్కెట్లు (మండీలు) మూసివేయబడతాయి. రైతన్న పంటను నచ్చిన రీతిలో అమ్ముకునే పరిస్థితిని కోల్పోతాడు. అంతేగాకుండా రైతుకు లభించే మద్దతు ధరను ప్రభుత్వం రద్దు చేస్తుంది. వ్యవసాయంలో కాంట్రాక్టు పద్ధతి బలోపేతం అయి భూమి, ఉత్పత్తి మీద రైతులు తమ హక్కులను కోల్పోతారు. ఇలా రైతాంగం సాంప్రదాయక భూమి హక్కులను, ఆవాసాలను కోల్పోవడమే గాకుండా వ్యవసాయ ఆర్థిక స్థితిపై ఆధారపడిన సామాజిక సంబంధాలను కూడ కోల్పోయి దిక్కు తోచని స్థితికి నెట్టబడుతుంది. తమ పరిస్థితి పెనం మీది నుండి పొయ్యిలో పడబోతున్నదనే ఆందోళనతోనే రైతాంగం ఆగ్రహానికి గురైంది.

సామ్రాజ్యవాదులు, వారి బహుళజాతి కంపెనీలు, ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల్లో గల వెనుకబడిన, అభివృద్ధి చెందుతున్న దేశాలను పలు రకాలుగా దోచుకుంటున్నాయి. థాచర్, బుష్‌లు తెచ్చిన నయా ఉదారవాద విధానాల పథకంలో భాగంగా ప్రపంచ బ్యాంకు ఇండియాపై వెలువరించిన డాక్యుమెంట్ 'భారత

దేశ ఆర్థిక మెమొరాండం వాల్యూం-11' ద్వారా దేశంలో ప్రారంభించిన వ్యవస్థాగత సంస్కరణల నాటి ఆదేశాలు ఈ రోజు పూర్తిగా అమల్లోకి రాబోతున్నాయి. ఉరుగ్వే రౌండ్ చర్చల ద్వారా వ్యవసాయ రంగంలో అదుపు, దోపిడీ కొనసాగించడానికి 'గాట్' ఒప్పందాన్ని ఈ దేశాలపై రుద్దారు. దీని వలన ఈ దేశాల వ్యవసాయ రంగం కకావికలం అయ్యింది.

సామ్రాజ్యవాదం ఎదుర్కొంటున్న శాశ్వత సంక్షోభం నుండి బయటపడడానికి అది అనేక రకాలుగా ప్రయత్నాలు చేస్తూనే ఉంటుంది. అయినప్పటికీ అది కాలక్రమంలో మరింత సంక్షోభానికి గురి అవుతూనే ఉంది. 2008లో ప్రారంభమైన ద్రవ్య, ఆర్థిక సంక్షోభం మరింత లోతుల్లోకి విస్తరిస్తూ సామ్రాజ్యవాదాన్ని అతలాకుతలం చేస్తుంది. ఈ సంక్షోభం నుండి గట్టెక్కడానికి సామ్రాజ్యవాదం జన్యు వనరులు, అడవులు, భూమి, నీరు వంటి సంపదను స్వాధీనం చేసుకోవడానికి, తద్వారా సూపర్ లాభాలు సాధించడానికి వాటిపై ఉన్న ఆంక్షలను రద్దు చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. ఇందులో భాగంగానే వెనుకబడిన, అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని వనరులపై బహుళజాతి కంపెనీలు కన్ను వేసాయి. బిల్‌గేట్స్, అమెజాన్ కంపెనీ లాంటి బిలియనీర్లు, వీరికి తోడుగా రిలయన్స్ అంబానీ, అదానీ గ్రూపులు ప్రయోజనాల కోసం పెద్ద ఎత్తున రైతాంగ భూముల కబ్జాకు బిజెపి ప్రభుత్వం నూతన చట్టాలు రూపొందించింది.

ఒక అధ్యయనం ప్రకారం గతంలో ''వ్యవసాయం చారిత్రాత్మకంగా తక్కువ రాబడినిచ్చే ప్రమాదకర వెంచర్‌గా చూడబడింది. ఇటీవల సంవత్సరాలలో ఇది మారిపోయింది. ఆహార వ్యవస్థ దీర్ఘకాలిక వృద్ధికి హామి ఇచ్చే రంగంగా చూడబడింది". అందుకే పెట్టుబడిదారీ రాబందులకు వ్యవసాయ రంగంపై దృష్టి మళ్ళింది. దీనికి అనుగుణంగా, ప్రపంచ బ్యాంకు తన వార్షిక ప్రపంచ అభివృద్ధి నివేదిక (డబ్ల్యూ.డి.ఆర్) -2008ని వ్యవసాయానికి అంకితం చేసింది. డబ్ల్యూ.డి.ఆర్. (W.D.R.) 'వ్యవసాయాన్ని అభివృద్ధి ఎజెండాలోకి తీసుకోవడానికి సమయం ఆసన్నమయింది. ఉద్భవించిన అవకాశాలు మరియు సవాళ్లు విభిన్న సందర్భాలను పరిగణలోకి తీసుకుంటుంది' అని చెప్పింది. అయితే మేము ఇక్కడ సవాళ్లను చర్చించడం లేదు. దీని ప్రకారం సామ్రాజ్యవాదుల, కార్పొరేట్ల లాభాల కోసం రైతులను వారి భూముల నుండి వేరు చేసే ప్రక్రియ పారిశ్రామిక, మౌలిక సదుపాయాల, మైనింగ్ లేదా రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల కోసం భూమిని సేకరించడానికే పరిమితం కాదు. గుత్తాధిపత్య పెట్టుబడి ప్రయోజనాల దృష్ట్యా భారత దేశ వ్యవసాయ రంగాన్ని పునర్నిర్మించడానికి ప్రపంచ బ్యాంకు, దళారీ నిరంకుశ బూర్జువా వర్గం పూనుకుంది.

**బహుళజాతి కంపెనీల ప్రయోజనాల కోసమే భూమి పట్టాల చట్టం :**

వ్యవసాయ రంగాన్ని పునర్నిర్మించడం కోసం శక్తివంతమైన భూమి అమ్మకాల మార్కెట్లను సృష్టించడం అత్యవసరం అని చెబుతున్నారు. భూముల మార్కెట్‌ను సృష్టించడం గురించి నీతి ఆయోగ్ 2015లో వెలువరించిన ఒక పత్రంలో "భారత దేశంలో భూమి సొంతదారునికి హక్కులను కూడా సరిగా నిర్వచించలేదు. సొంతదారుల హక్కులన్నీ ఊహాజనితమైనవి, కోర్టులలో సవాల్ చేయడానికి వీలైనవి. ఈ కారణం వలన యాజమాని తన భూమికి నిజమైన విలువను పొందలేకపోవడంతో, శక్తివంతమైన భూముల అమ్మకాల మార్కెట్ అభివృద్ధి కావడం లేదని, దీనికి ప్రతిగా, జీవనాధార వనరుగా ఉపయోగించుకోవడానికి తన భూమి మరీ చిన్నదిగా ఉందని రైతు భావించడం వల్ల కూడ భూమి అమ్మకాలను నిరుత్సాహపరుస్తుంది" అని ఆ పత్రం పేర్కొంది. ఈ పరిస్థితిని మార్చడానికి ప్రభుత్వం శక్తివంతమైన భూముల అమ్మకాల మార్కెట్లను సృష్టించడం కోసం 'నిశ్చయాత్మక టైటిలింగ్' వ్యవస్థను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. దీని ద్వారా ఇతర హక్కుదారులకు వ్యతిరేకంగా పట్టాదారుకు గుర్తింపు ఇచ్చి ప్రభుత్వం శాశ్వతంగా హామీ ఇస్తుంది. ఇందులో భాగంగా భూమిని సులభతరంగా అమ్ముకోవడానికి వీలుగా "భూమి పట్టాల చట్టం" (లాండ్ టైట్‌లింగ్ చట్టం) తీసుకొచ్చారు. పైన చెప్పిన ఇతర హక్కుదారులంటే కౌలు చట్టాలు, భూసంస్కరణలు, అటవీ హక్కుల చట్టం, ప్రభుత్వ భూముల పంపిణీలో భూములు పొందిన వారు అని అర్థం. దేశంలో కౌలుదారుల చేతుల్లో, భూసంస్కరణల వలన ప్రయోజనం పొందిన వారి చేతుల్లో ఉన్న భూములను అలాగే ఆదివాసీ చేతుల్లో ఉన్న అటవీ భూములను, పేదల చేతుల్లో ఉన్న ప్రభుత్వ భూములను, పేదలకు పంచిన ఇళ్ళ స్థలాలు లాంటి వాటిపై హక్కులు అస్పష్టంగా ఉన్నాయని వారిని భూముల నుండి తొలగించి వేసే కుట్ర ప్రారంభమైంది. వీరంతా ఆక్రమణ దారులేనని ఈ భూములను పారిశ్రామిక వేత్తలకు, భూస్వాములకు కట్టబెడతారు.

పేదలు, చిన్న, సన్నకారు రైతులకు గల హక్కులను గుర్తించకుండా ఒక వ్యక్తిని భూమి యాజమానిగా గుర్తించి అతనికి పట్టా ఇతచ్చి ప్రభుత్వం ఆ పట్టా దారులకు హామీ ఇస్తుంది. ఇక అప్పుడు ఆ వ్యక్తి భూమి మార్కెట్‌లో స్వేచ్ఛగా భూమిని అమ్ముకునేలా సిద్ధమవుతాడు. వీరంతా పాత, కొత్త రకమైన భూస్వాములు, పెట్టుబడిదారీ భూస్వాములు, ధనిక, పై మధ్య తరగతి రైతులు, ఫామ్‌హౌజ్ యాజమానులు అయి ఉంటారు. ఆ భూమిని ప్రభుత్వ మధ్యవర్తిత్వం లేకుండానే పెద్ద కార్పొరేట్ కంపెనీలు వశం చేసుకోవడానికి వీలవుతుంది. వారు భూమి హక్కుల సమస్యను

పూర్తిగా నిర్వాహక సమస్యగా తగ్గించేసి, భూమికి సంబంధించిన పరిపాలన వ్యవస్థ సామర్థ్యాన్ని మెరుగుపరిచే విధంగా చూస్తారు. కేవలం పరిపాలన అంశంగా కాకుండా సామాజిక అంశంగా చూడడం వలనే భూమి పేదలకు దక్కుతుంది. కానీ దీనికి విరుద్ధంగా కార్పొరేట్ల ప్రయోజనాల కోసం మోడీ ప్రభుత్వం తన మొదటి పదవి కాలంలో పునర్ వ్యవస్థీకరణ, పునరావాస చట్టం–2013 లోని వివిధ నిబంధనలను నీరుకార్చడానికి, వీలైతే మొత్తంగా తొలగించడానికి ప్రయత్నించింది. కార్పొరేట్లకు అనుకూలంగా 'కర్ణాటక భూ సంస్కరణల (సవరణ) బిల్లు 2020'లో భూ సంస్కరణల చట్టం నుంచి రెండు సెక్షన్లను సంవత్సరానికి రూ. 25 లక్షల కన్నా తక్కువ సంపాదించే వారికి మాత్రమే వ్యవసాయ భూమిని కొనుగోలు చేయడానికి అనుమతించే సెక్షన్ 79 ఎ ను, వ్యవసాయం జీవనోపాధిగా ఉన్న ప్రజలు మాత్రమే వ్యవసాయ భూమిని కొనుగోలు చేయడానికి అనుమతించే సెక్షన్ 72 బి ను తొలగించారు. ఇప్పుడు ఈ భూమి పట్టాల చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పేర్ల మీద అమలు చేస్తున్నాయి. తెలంగాణలో భూమి సర్వే నిర్వహించడం, ధరణి పోర్టల్ ఆవిష్కరించడం కూడా ఇందులో భాగమే.

మోడీ మొదటి పరిపాలన కాలంలో చేసిన చట్టం గానీ, ఇప్పటి వ్యవసాయ చట్టాల రూపకల్పన సైతం ప్రపంచ బ్యాంకు మార్గదర్శకాలకు అనుగుణంగానే ఉన్నాయి. భూమి అంతటిని గణనలోకి (లెక్కల్లోకి) తీసుకొని రావటానికి కంప్యూటరీకరణను, ఏకీకరణను, రికార్డులు, రాత ప్రతాల వాడకాన్ని విస్తృతం చేయాలి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రదేశాలన్నింటిని నమోదు చేయడానికి ఒక ఆధారాన్ని కల్పించాలి. సర్వేలో ప్రైవేట్‌రంగ భాగస్వామ్యాన్ని అనుమతించాలి. ప్రభుత్వం తన దృష్టిని నియంత్రణ పైన కేంద్రీకరించాలి. చివరగా భూమి లీజుకు ఇవ్వడాన్ని చట్టబద్ధం చేస్తూ "భూముల మార్కెట్లపై ఆంక్షలు తొలగించాలి" అని ప్రపంచ బ్యాంకు చెప్పింది. లీజుకు పరిమితులను తొలగించాలి. వ్యవసాయేతరులకు భూమి బదిలి చేయడంతో సహ, భూమి బదిలీపై ఉన్న అన్ని రకాల ఆంక్షలను తొలగించాలి. పెట్టుబడిదారులు వ్యవసాయ భూమిని నేరుగా (అంటే ప్రభుత్వ మధ్యవర్తిత్వం లేకుండా) పొందడానికి అనుమతించాలని పేర్కొంది. దీని వలన భూసంస్కరణలలో ఎంతో కొంత పేదలకు లభించిన భూములు, కౌలుదారుల హక్కులు అన్ని రద్దు చేయబడతాయి. 2006 అటవీ చట్టం ద్వార ఆదివాసులకు లభించిన భూములపై అధికారం కోల్పోతారు. దేశంలో కోట్లాది మంది కౌలుదారులు, పేదలు కలిగి ఉన్న చిన్న కమతాల భూములు కోల్పోయి పూర్తిగా కూలీలుగా మారుతారు. చిన్న, మధ్యతరగతి రైతుల భూములు మార్కెట్ పందెంలో చేరి వారి భూములు బడా భూస్వాముల, కార్పొరేట్ల, మల్టీనేషనల్‌ల ఆక్రమణకు గురి అవుతాయి.

భూమిని పూర్తి సరుకుగా మార్చే ప్రకియలో భాగంగా "భూమి పట్టాల చట్టం" (లాండ్ టైటిలింగ్ చట్టం) ను ఏర్పాటు చేసే లక్ష్యంతో 2008లో యూపీఏ ప్రభుత్వం భూమి రికార్డుల ఆధునిక కార్యక్రమం (ఎన్.ఎల్.ఆర్.సి.) చేపట్టింది. దీనిని 2014లో మోడీ ప్రభుత్వం "డిజిటల్ ఇండియా భూమి రికార్డుల ఆధునిక కార్యక్రమం" (డి.ఇ.యల్.ఆర్.ఎం.సి.) గా పునరుద్ధరించింది. అందుకే మోడీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి "డిజిటల్ ఇండియా" అని గట్టిగా అరుస్తున్నాడు. వ్యవసాయ చట్టాలను 15 ఏళ్ల క్రితమే తేవాల్సిన అవసరం ఉండేనంటూ దబాయిస్తున్నాడు. మోడీ ప్రభుత్వం మొదటి పదవి కాలంలో ప్రజల, ప్రతిపక్షాల వ్యతిరేకతతో పునర్ వ్యవస్థీకరణ, పునరావాస చట్టం–2013 సరిగా అమలులోకి రాకపోవడంతో ప్రస్తుత కరోనా సంక్షోభాన్ని ఉపయోగించుకొని ఈ మూడు వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చాడు. ఏప్రిల్, 2020లో లాక్‌డౌన్ అమలవుతున్న సమయంలో డ్రోన్ల సర్వేల ద్వారా గ్రామీణ ప్రాంతాలలోని అన్ని నివాస గృహాలను మ్యాప్ చేయడానికి ప్రధాన మంత్రి "స్వమిట్వా" అనే కొత్త పథకాన్ని ప్రారంభించాడు. ఈ పథకంతో ఇళ్ల స్థలాలు లేని వారికి ప్రయోజనం ఉండదు. ఈ పథకం వలన 'మార్కెట్‌లో భూమిని భాగాలుగా (పార్శిళ్లను) మరింత తేలికగా అమ్ముకొని డబ్బు చేసుకునే స్థితిని పెంచుతుందని' ప్రభుత్వం అంటున్నది. ఇలా ప్రపంచ బ్యాంకు కనుసన్నలలో బిజెపి, కాంగ్రెస్‌తో సహ పాలక పార్టీలన్నీ రైతును తమ సొంత భూముల నుండి దూరం చేయడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి.

**భారత దేశంలోకి డిజిటల్ సాంకేతిక భారీ టెక్ కంపెనీల ప్రవేశం**

భారత దేశంలోని భూములు, పంటలను విదేశీ బహుళజాతి కంపెనీలు కబ్జా చేస్తున్నాయి. వ్యవసాయాన్ని కార్పొరేటీకరించడం కోసం చురుగ్గా కదులుతున్నాయి. అమెరికా లాంటి దేశాల్లో వ్యవసాయం ఇక ఎంత మాత్రం లాభదాయకము కాకపోవడంతో ఈ కంపెనీలు భారత దేశ వ్యవసాయాన్ని తమ అదుపులోకి తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. వ్యవసాయ రంగంలోకి కొత్తగా సాంకేతికతతో కూడిన టెక్ కంపెనీలు తమ పెట్టుబడులతో ముందుకు వస్తున్నాయి. అమెజాన్, గూగుల్, మాక్రోస్, ఫేస్‌బుక్ లాంటి టెక్ సంస్థలు కొత్తగా రంగంలో అడుగు పెడుతున్నాయి. వీరంతా ఇప్పటికే అమెరికా, బ్రిటన్ తదితర దేశాల్లో వ్యవసాయ రంగంలో పెట్టుబడులతో నూతన భూస్వాములుగా మారారు. అమెరికాలో బిల్‌గేట్స్, ఆయన భార్య మిలిండ కలిసి 2,68,940 ఎకరాల భూమి కలిగి ఉన్నారు. భారత్‌తో సహ ఇతర దక్షిణాసియా దేశాల్లో, ఆఫ్రికా దేశాల్లో అధిక దిగుబడి ఇచ్చే సుస్థిర అభివృద్ధికి కోసం వీరి ఫౌండేషన్ కోట్ల డాలర్ల ఆర్థిక సహాయం అందిస్తుంది. వీరు క్రమంగా ఈ దేశాల్లో భూములను స్వాధీనం చేసుకునే



అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మన దేశంలో బిహార్‌లో వీరి ఫౌండేషన్ చురుకుగా పని చేస్తున్నది. అలాగే మైక్రో సాఫ్ట్ తన ఎజ్యూర్ క్లావుడ్ కంప్యూటింగ్ సాంకేతికత ఆధారంగా ఎజ్యూర్ ఫార్మ్ బీట్స్ అనే డిజిటల్ వ్యవసాయ వేదికను నిర్మిస్తుంది. ఇది కృత్రిమ మేధా వంటి సాంకేతికాలతో డ్రైవర్ రహిత ట్రాక్టర్‌లు, నాట్లు, కోత యంత్రాలు, క్రిమి నాశనాలను చల్లే డ్రోన్లను, సెన్సర్‌లను అభివృద్ధి చేస్తున్నది. అమెజాన్ అధిపతి బెజోస్ కూడా 4,20,000 భూమి కలిగి ఉన్నాడు. ఫేస్‌బుక్ సంస్థ భారత్‌లో జియో ప్లాట్ ఫామ్స్‌లో 44,000 కోట్ల పెట్టుబడి పెట్టింది. భారత దేశంలో వ్యవసాయంలో ఫేస్‌బుక్ ఇప్పటికే ప్రముఖ పాత్ర వహిస్తుంది. భారత రైతులు అత్యధికంగా ఉపయోగిస్తున్న సాంకేతిక సాధనాలు ఫేస్‌బుక్, దాని అనుబంధ వాట్సప్‌లే. ఈ భారీ టెక్ కంపెనీలు అందించే సేద్య యాపులు, డ్రైవర్ లేని ట్రాక్టర్లు, డ్రోన్లు వేల ఎకరాలలో విస్తరించిన పంట భూముల్లో సాగుకు ఉపయోగపడవొచ్చునేమో కానీ, మన దేశంలోని 50 కోట్ల చిన్న కమతా దారులకు ఇవి ఏ మాత్రం ఉపయోగపడవు.

అప్పటికే వ్యవసాయ రంగంలో పాతుకపోయి పురుగు మందులు, విత్తనాలు, ఎరువులు, టాక్టర్స్, డ్రోన్స్ మొదలైన వాటిని రైతులకు అమ్మి దోపిడీ చేస్తున్న అగ్రి బిజినెస్ కంపెనీలైన బేయర్స్, సిన్‌గెట్టా, కోర్డోనా, కార్గిల్ సంస్థలు తమ పునాదిని మరింత బలపర్చుకుంటున్నాయి. కొత్తగా రంగంలోకి వస్తున్న టెక్ కంపెనీ దిగ్గజాలు, ఈ భారీ టెక్ కంపెనీలతో కలిసిపోయి వ్యవసాయానికి సంబంధించిన డిజిటల్ సమాచారాన్ని ఆ కంపెనీలకు అందిస్తున్నాయి. అలాగే ఆహార వినియోగదారుల డేటా కూడ సమకూరుస్తాయి. రైతులు వందల సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తూ సముపార్జించిన సహజ జ్ఞానాన్ని ఈ డిజిటల్ టెక్ కంపెనీలు దొంగిలిస్తాయి. భూముల నాణ్యత, సహజ విత్తనాలు, వాతావరణ మార్పుల్లో రైతు వ్యవసాయంలో అనుసరించే పద్ధతులు, నీటి వినియోగం లాంటి వాటిలో రైతు సంపాదించిన జ్ఞానాన్ని డిజిటల్ సమాచార రూపంలో సేకరించి వాటికే నూతన టెక్నాలజీని జోడించి అగ్రి బిజినెస్‌లో పాతుకొని పోయిన బహుళ జాతి కంపెనీలకు అందిస్తూ వ్యవసాయంలో కార్పొరేటీకరణకు తోడ్పడతాయి. ఇలా ఈ రెండు రకాల పెట్టుబడులు కలగలసిపోయి భారత దేశం వ్యవసాయంలో కార్పొరేటీకరణ పెద్ద ఎత్తున జరిగి రైతాంగానికి తీవ్రంగా నష్ట జరుగుతుంది.

పెద్ద టెక్ సంస్థలు, అగ్రి బిజినెస్ సంస్థలు, ఈ-కామర్స్ ద్వారా రైతుల భూములను ఆక్రమించటం, వాటిని పెద్ద పారిశ్రామిక వ్యవసాయ కమతాలుగా మార్చి, యంత్రాలతో, కెమికల్స్‌తో వ్యవసాయాన్ని చేసే విధానాన్ని చేపడుతాయి. ఇవన్నీ ద్రవ్య, స్పెక్యులేటర్స్ కంట్రోల్‌లో ఉంటాయి. ఈ బహుళజాతి కంపెనీలు చేసే కార్పొరేటీకరణ వలన పర్యావరణం, ప్రకృతితో గల మనిషి సహజ సంబంధం దెబ్బతిని పోతుంది.

**రిటైల్ దిగ్గజాల విలువ గొలుసుల్లో బలికానున్న రైతాంగం :**

అంతర్జాతీయ రిటైల్ దిగ్గజాలు భారత దేశంలోని రిటైల్ రంగంను ఈ-కామర్స్ ద్వారా కంట్రోల్ చేస్తున్నాయి. 2016లో వాల్‌మార్ట్ కంపెనీ 3.3 యుఎస్ బిలియన్ల డాలర్లతో ఫ్లిప్ కార్ట్ సంస్థను టేక్ ఓవర్ చేసింది. ప్రస్తుతం ఇండియా మార్కెట్‌లో వాల్‌మార్ట్, అమెజాన్‌లు రిటైల్ రంగంలో రెండింటిలో మూడొంతుల డిజిటల్ రిటైల్ మార్కెట్‌ను కబ్జా చేశాయి. దీనితో దేశంలో లక్షలాదిగా ఉన్న చిన్న వ్యాపారులు, రిటైల్ వ్యాపారస్థులు పూర్తిగా ఉపాధిని కోల్పోతున్నారు.

మరొక ముఖ్య పరిణామం ఏమంటే, వ్యవస్థీకృత రిటైల్ పెద్ద కంపెనీల పెట్టుబడులు వెనుకబడిన, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సాంప్రదాయేతర ఎగుమతులను పోత్సహిస్తున్నాయి. ముఖ్యంగా సముద్ర ఆహారాలు, పండ్లు, కూరగాయలు, పూలు, కాయలు, మాంసం, సుగంధ ద్రవ్యాలను సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ దేశాలల్లోకి ఎగుమతి చేయడం కోసం ఈ పెట్టుబడులను వెచ్చిస్తున్నది.

డబ్ల్యూ.డి.ఆర్-2008 దీనిపై మూడవ ప్రపంచ వ్యవసాయ వృద్ధిని అంచనా వేసింది. ఈ వృద్ధి డిమాండ్ యొక్క కొత్త వనరు అని . "అధిక విలువ కలిగిన వ్యవసాయ ఉత్పత్తులకు వేగంగా పెరుగుతున్న స్థానిక మరియు అంతర్జాతీయ డిమాండ్‌తో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వ్యవసాయ రంగానికి ముఖ్యమైన కొత్త వృద్ధి అవకాశాలను తెరుస్తుంది. అభివృద్ధి చెందుతున్న కొత్త వ్యవసాయం ప్రైవేట్ వ్యవస్థాపకుల నాయకత్వంలో ఉత్పత్తి దారులను వినియోగదారులతో అనుసంధానించే విస్తృతమైన విలువ గొలుసులతో నడుస్తుంది" అని పేర్కొంది.

అలాగే భారత దేశంలో పండించే ప్రధాన పంటల ద్వారా స్వయం సమృద్ధి, ఆహార భద్రత గానీ సాధించడం అసలు సాధ్యం కాదని, దానికి వ్యతిరేకంగా మారుతుందని ఓ.యి.సి.డి పేర్కొంది. ప్రధానమైన ఆహారాన్ని దిగుమతి చేసుకోవడం, అధిక విలువైన పంటలను ఎగుమతి చేయడం, అంతర్జాతీయ మార్కెట్‌లో పాల్గొనడం, వ్యవసాయ ఆహార గ్లోబల్ విలువ గొలుసుల ద్వార ఆదాయ వృద్ధికి అవకాశాలు అందించే అవకాశం ఉందని అది

పేర్కొంది. ఈ ఆదాయం ద్వారా ప్రభుత్వం, వ్యక్తులు ప్రధాన ఆహారం కోసం దిగుమతులపై ఆధారపడవచ్చు అని చెబుతుంది. ఇందులో భాగంగానే ప్రభుత్వం 'ప్రధాన మంత్రి కిసాన్ యోజన' కింద కనీస ఆదాయ మద్దతు అని రైతుల బ్యాంకుల్లో డబ్బు ట్రాన్స్‌పర్ చేస్తున్నది. అంత వరకు ఎరువుల సబ్సీడి, విద్యుత్‌పై తక్కువ సుంకాలు, బ్యాంకు అప్పులపై తక్కువ వడ్డీ రేట్లను రద్దు చేసి వ్యవసాయాన్ని దెబ్బతీసి, ఆహార ధాన్యాల కోసం దిగుమతిపై ఆధారపడేలా రైతులను తయారు చేస్తుంది.

పైన తెలిపిన సామ్రాజ్యవాదుల ప్రాయోజిత ఆదేశాలతో తెచ్చిన వ్యవసాయ చట్టాలను పరిశీలిస్తే ఈ క్రింది పరిణామాలు ముందుకు వస్తాయి.

వ్యవసాయ ఉత్పాదక మార్కెట్ కమిటీ మండీన్ మూసివేయబడగా, ఆహార ధాన్యాల అధికారిక సేకరణను నిలిపివేయడంతో, ఆహార ధాన్యం మిగులు ప్రాంతాలలోని రైతులు తమ పంటలను కనీస మద్దతు ధర వద్ద అమ్మలేరు. దానితో చాల వరకు ఆహార ధాన్యాల ఉత్పత్తి దెబ్బతింటుంది.

ఆహార ధాన్యాల మార్కెట్ బహుళజాతి కంపెనీల ద్వారా జరిగే దిగుమతులపై ఆధారపడుతుంది. దీని కోసం హోర్డింగ్ పై ఆంక్షలను తొలగించడానికి ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ సవరించ బడింది.

పూర్వపు ధాన్యం పండించే ఒక సెక్షన్ రైతాంగం ఇతర పంటలకు మారవలసి వస్తుంది. కాంట్రాక్టు వ్యవసాయానికి సంబంధించి కొత్త చట్టం లక్ష్యం ఇదే.

వ్యవస్థీకృత రిటైల్ చిన్న రైతులను స్థానభ్రంశం చేస్తుంది. అది ఎలాగు అంటే, వ్యవస్థీకృత రిటైల్ సేకరణ ఏజెన్సీగా మారిన తరువాత చిల్లర వ్యాపారులు పెద్ద సరఫరాదారులను కోరుకుంటారు. ఎందుకంటే వారికి పెద్ద సరఫరాదారులతో వ్యవహరించడంతో కొనుగోలు చేసే అన్ని ఖర్చులు తగ్గుతాయి. పెద్ద రిటైల్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తిని ప్రమాణికరించడం సులభం అవుతుంది. ఇది ప్రతి ఉత్పత్తికి, ఉత్పత్తి దారుడ్ని గుర్తించడం సులభమే గాక చౌకగా చేస్తుంది. పెద్ద ఉత్పత్తి దారుడు వివిధ ప్రమాణాలకు అనుగుణంగా వివిధ సరుకులను కొనుగోలు చేయగలుగుతాడు. ఈ కొనుగోలు వలన చిన్న రైతులు దివాళ తీసి తమ భూముల నుండి స్థానభ్రంశం చెంది ఆ స్థానంలో పెద్ద కమతాలలో చేసే కార్పొరేట్ వ్యవసాయం ఉనికిలోకి వస్తుంది.

అంతేగాక రిటైల్ దిగ్గజాల అవసరాలకు అనుగుణంగా సరఫరాదారులు తమ ఉత్పత్తి ప్రక్రియలను మార్చాలి. అలాగే గణనీయమైన పెట్టుబడులు పెట్టాలి. దీనితో చిన్న సరఫరాదారులు తొలగింపుకు కూడ దారి తీస్తుంది. ఈ ప్రపంచ విలువ గొలుసుల్లో భాగం కావడానికి చిన్న రైతులకు గానీ, చిన్న సరఫరాదారులకు గానీ వీలుకాదు. బహుళజాతి కంపెనీలు శక్తివంతమైన సంస్థలతో వ్యవసాయ ఒప్పందాలు కుదుర్చుకుంటే, పేద రైతులు ఖర్చులను భరించలేరు. అధిక విలువ కలిగిన వ్యవసాయంలో ఉత్పత్తుల కోసం అన్ని భూములు అటువంటి పంటలకు తగిన విధంగా ఉ ండవు. వారు ప్రధానమైన పంటలను పండిస్తూనే ఉంటారు. ఈ క్రమంలో వారు తక్కువ సంపాదిస్తారు. దీనితో రైతాంగం రుణభారం పెరిగి చివరకు భూములను అమ్ముకోవాల్సిన దుస్థితికి దారి తీస్తుంది.

ధాన్యం గిడ్డంగులను మూసివేసి ధాన్యం నిల్వలను ఆపివేయాలని, విదేశీ దిగుమతులపై ఆధారపడాలనే సామ్రాజ్యవాదుల నిర్దేశిత విధానాలను దేశంలోని దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య పాలక వర్గాలు నిస్సిగ్గుగా అమలు చేస్తున్న ఫలితంగా ప్రజా పంపిణీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిని పోయి, ఆహార భద్రత దెబ్బతిని పోతుంది.

వ్యవసాయ చట్టాల ప్రభావం పాల ఉత్పత్తి దారులపై కూడా పడుతుంది. ఒకటి రెండావులు లేదా గేదలు గల సన్నకారు, చిన్నకారు రైతులలో యాభై రెండున్నర లక్షల మంది సరళీకరణ వల్ల 2000 నుండి 2016 మధ్య పాల ఉత్పత్తి జీవనోపాది నుండి ఇప్పటికే తొలగించబడినారు. పాల ఉత్పత్తి వ్యాపార రంగం నుండి ప్రభుత్వ నియంత్రణ సడలింపు వలన ఈ పరిణామం చోటుచేసుకుంది. పాల ఉత్పత్తి క్షేత్రం నుండి వినియోగ కుటుంబం వరకు అన్నీ స్థాయిల్లోనూ మార్కెట్ సువ్యవస్థీమైనది. 2005-19లో ధరలు తగ్గిపోయిన కాలంలో పెద్ద డెయిరీ సంస్థలు లాభపడగా చిన్న ఉత్పత్తిదారులు పెద్ద సంఖ్యలో నష్టపోయారు. ఫ్రెంచి కంపెనీ లాక్టాలిస్ గత అయిదేళ్ళలో తిరుమల, అనిక్, ప్రభాత్ డెయిరీ కంపెనీలను స్వాధీనం చేసుకుంది. అమూల్ కూడా ఇలాగే ఎదిగింది. కానీ గుజరాత్ లోని చిన్న, సన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోయారు. కొత్త వ్యవసాయ చట్టాల వలన పాడి పరిశ్రమపై కార్పొరేట్ సంస్థల నియంత్రణ, గుత్తాధిపత్యాన్ని మరింత వేగవంతం, పటిష్టం చేస్తాయి.

భారత దేశంలో 60 శాతం పైగా ప్రజలు వ్యవసాయంపై ఆధారపడతారు. ఇందులో 80 శాతం పైగా చిన్న, సన్నకారు రైతాంగం ఉన్నారు. వ్యవసాయంలో 50 శాతం వరకు కూలీ పని చేస్తున్నారు. జాతీయ నమూనా సర్వే 2012-13 ప్రకారం అన్నీ వనరుల నుండి సగటు రైతుల గృహ ఆదాయం నెలకు 6,400 రూపాయలని తేలింది. వీళ్ళ మొత్తం ఆదాయం వినియోగ వ్యయం కంటే తక్కువగా ఉంది. అలాగే రుణపడి ఉన్న రైతు కుటుంబాలు 49 శాతం నుండి 53 శాతానికి పెరిగాయి. సగటున 1.04 లక్షల అప్పుల్లో ఉన్నారు. ఈ దారిద్ర్యం కారణంగానే ఇప్పటికీ 3.30 లక్షల మంది రైతాంగం ఆత్మహత్యలకు పాల్పడింది.

మరోవైపు ఆక్స్‌ఫామ్ రిపోర్టు ప్రకారం దేశంలో ముఖేష్ అంబానీ, అదానీతో సహా అనేక మంది బిలియనీర్ల సంపద 35 శాతం పెరగగా, అదే సమయంలో దేశంలోని 84 శాతం కుటుంబాలు వేరు వేరు స్థాయిల్లో ఆదాయాన్ని కోల్పోతున్నాయి. కరోనా కాలంలో 2020, ఒక్క ఏప్రిల్ మాసంలోనే 1,70,000 మంది తమ ఉద్యోగాలను కోల్పోయారు.

అంతర్జాతీయ బిలియనీర్లు, దేశంలో అంబానీ, అదానీ లాంటి దళారీ పెట్టుబడిదారులు వ్యవసాయ రంగంలో అడుగు పెట్టడంతో అశేష రైతాంగానికి జరగబోయే దుష్ఫలితాలను ముందుగానే గ్రహించిన రైతాంగం చావుకు తెగించి పోరాటానికి దిగడాన్ని మనం ఇప్పుడు చూస్తున్నాం.

**దేశ వ్యాప్తంగా ఉద్యమిస్తున్న రైతాంగం :**

మోడీ ప్రభుత్వం వ్యవసాయ చట్టాలను తీసుకరాబోతున్నదనే విషయం ముందే తెలుసుకున్న పంజాబ్ కిసాన్ సంఘాలు ఫిబ్రవరి 2020లో చండీఘర్‌లో ఒక సెమినార్ నిర్వహించాయి. దీనిలో మేధావులు, కార్యకర్తలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ చట్టాల వలన కలిగే నష్టాల గురించి చర్చించడంతో పాటు వీటిని ఎదుర్కోవడానికి పథకాన్ని కూడ రూపొందించాయి.

జూన్ 8న మోడీ ప్రభుత్వం మూడు చట్టాలపై ఆర్డినెన్స్‌లు తెచ్చిన రోజున రైతాంగ ప్రదర్శనలు ప్రారంభమైనాయి. రైతాంగ ప్రదర్శనలు జులై, ఆగస్టులో కూడ కొనసాగాయి. 'పింద్ జాగో, పింద్ హైలో' (Pind Jagao, pind hailo) 'గ్రామాలను మేల్కొలపండి, గ్రామాలను కదిలించండి' అనే నినాదంతో 14 జిల్లాల్లోని 13 వందల గ్రామాల్లో 25 లక్షల మంది ప్రజలను కవర్ చేస్తూ ప్రచారం చేశారు. ఒక లక్ష కొత్త కేడర్స్, ఇందులో 26 వేల మంది మహిళలు ఉద్యమానికి తయారైనారు.

నవంబర్ 21న రైతులు, కూలీలు, మగ, ఆడతో కూడిన మూడున్నర లక్షల మందితో ఢిల్లీలో కిసాన్ ర్యాలీ తలపెట్టారు. ట్రాక్టర్స్‌తో సహ లక్షలాది మంది రైతులు పంజాబ్, హర్యానా సరిహద్దులో పోలీసు బారిగేడ్లను తొలగించి ఢిల్లీ సరిహద్దున గల సింఘూ, టిక్రీలకు చేరుకున్నారు. సింఘూ, టిక్రీ బార్డర్‌లో చేరుకున్న రైతాంగాన్ని ఢిల్లీ పోలీసులు అడ్డుకొని ఢిల్లీలోకి ప్రవేశం లేదని, ప్రక్కన గల భురారి మైదానంలో గానీ, అక్కడే మరేదైన మైదానంలో గానీ ప్రదర్శన జరుపుకోమని చెప్పారు. దీనితో ఆగ్రహం చెందిన రైతాంగం సింఘూ, టిక్రి బార్డర్‌లో రోడ్డుపైన బైఠాయించారు. తర్వాత అక్కడే టెంట్స్ వేసుకొని ఇప్పటికీ నిరసన ప్రదర్శనలు కొనసాగిస్తున్నారు. ఆ వెనువెంటనే హర్యాన రైతాంగం కూడ వివిధ ప్రదేశాల్లో బైఠాయింపులు వేసి ఉద్యమాన్ని విస్తరింపజేశారు. నవంబర్ 27న ఉత్తర ప్రదేశ్ రైతాంగం ఘాజీయపూర్ ఫ్లై ఓవర్ వద్ద బైఠాయించారు. వీటితో పాటు పంజాబ్, హర్యానాల లోని ముఖేష్ అంబానీకి చెందిన టోల్ ప్లాజాలు, పెట్రోల్ పంపులు, షాపింగ్ మాల్స్‌తో పాటు అదానీకి చెందిన గోడౌన్స్‌ను దాదాపు 50 చోట్ల దిగ్బంధనం చేశారు. తదుపరి హర్యానా, పంజాబ్ లోని 15 వందల జియో సెల్ టవర్స్‌కు నష్టం చేశారు.

గడ్డ కట్టుకపోయే చలిలో లక్షలాది మంది రైతాంగం ఆరుబయల్లో ఆందోళన చేయడం చరిత్రలో ఒక గొప్ప సన్నివేశం. వీరికి అక్కడ స్థానిక ప్రజల మద్దతు ఎంతగానో లభించింది. ఇందులో చుట్టు ప్రక్కల వ్యాపారస్తులతో పాటు మైనార్టీలు కూడ భోజనాలు సరఫరా చేయడమే గాక ఉద్యమానికి మద్దతు తెలిపారు. మైనార్టీలు కూడ రైతాంగంలో భాగమే కావున వారు కూడ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొంటున్నారు.

మొగలులకు, బ్రిటీషర్లకు వ్యతిరేకంగా జరిగిన రైతాంగ పోరాటాల చారిత్రిక సన్నివేశాలతో ఆనాటి చరిత్ర ఉట్టి పడేలా ఈ వేదికల్లో రైతాంగం సాంస్కృతిక కార్యక్రమాలు, ఆర్ట్స్ కార్యక్రమాలు కొనసాగించారు. నవంబర్ 26న స్వాతంత్ర సమరయోధుడు, సోషలిస్టు అయిన భగత్‌సింగ్ జన్మ స్థలం ఖకరకలా నుండి కూడ ఆందోళన ప్రారంభించి బ్రిటీష్ వ్యతిరేక స్ఫూర్తిని పొందారు.

డిసెంబర్ 9న అంతర్జాతీయ మానవ హక్కుల దినం రోజున ప్రభుత్వ వ్యతిరేక నిరసన గళాన్ని వినిపించే మేధావులను, స్కాలర్‌లను, విద్యార్థులను జైళ్ళ నుండి మోడీ ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నవంబర్ 7న ఐక్య ఉద్యమ నిర్మాణం కోసం వ్యవసాయ చట్టాలు రద్దు చేయాలని పోరాడుతున్న సంఘాల నాయకత్వం, భారత దేశంలో అప్పటికే పని చేస్తున్న ఎఐకెఎస్‌సీసీ ఐక్య సంఘాల వేదిక (ఇది మందసోర్ కాల్పుల తరువాత ఏర్పడింది.) నాయకుడు బి.యం.సింగ్ మధ్య చర్చలు జరిగాయి కానీ ఇవి ఫలప్రదం కాలేదు. దానితో పంజాబ్ నుండి 31 సంఘాలు కలిసి సంయుక్త కిసాన్ మోర్చా ఏర్పడి వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలనే డిమాండ్‌తో ఆందోళనకు పిలుపునిచ్చింది. దీనికి బికేయు, ఎస్‌కేయమ్ లాంటి సంఘాలు మద్దతు ఇచ్చి మరిన్ని న్యాయమైన డిమాండ్స్ చేర్చారు. ప్రభుత్వం ఈ ఐక్యవేదికతో 11 దఫాలుగా చర్చలు జరిపింది. ఈ చర్చలు ఫలప్రదం కాలేదు. ప్రభుత్వం ఈ చర్చలను సంఘాల్లో చీలిక తేవడానికి, సమయం వృదా చేయడానికి ఉపయోగించుకోవాలని చూసింది. అలాగే సుప్రీంకోర్టు కూడ ఈ సమస్యపై ఒక కమిటీని వేసింది. ఈ కమిటీని రైతుల అభిష్టానికి వ్యతిరేకంగా వేయడంతో ఈ కమిటీని సంయుక్త మోర్చా తిరస్కరించింది. రైతులు రిపబ్లిక్ డే నాడు ఢిల్లీలో టాక్టర్ ర్యాలీ చేయడానికి నిర్ణయించారు. ఢిల్లీ పోలీసులు ఈ ర్యాలీకి ముందుగా పర్మిషన్ ఇవ్వలేదు. తదుపరి సుప్రీం కోర్టు కలగచేసుకోవడంతో కొన్ని షరతులతో టాక్టర్ ర్యాలీకి అనుమతి ఇచ్చారు. ఎర్రకోటకు

వెళ్ళే దారులను మూసివేసి వేరే దారులలో ర్యాలీ చేసుకోమని చెప్పారు. కాని ఆ రోడ్డుపై కూడ బారికేడ్లు నిర్మించి ర్యాలీని అడ్డుకోవడానికి పోలీసులు ప్రయత్నించారు. దానితో ఆగ్రహం చెందిన రైతాంగం బారికేడ్లను ధ్వంసం చేసి ముందుకు సాగింది. ఈ ర్యాలీలో పోలీసులతో ఘర్షణలు జరిగాయి. పోలీసులు జరిపిన కాల్పుల్లో ఒక రైతు మరణించాడు. ప్రభుత్వం రైతాంగ ఉద్యమంపై దుష్ప్రచారం చేస్తూ, ఈ ఉద్యమం ఖలిస్థాన్ అనుకూలమైనదని, దీనిలో విదేశీ హస్తం ఉందని, అరాచక మూకల విధ్వంసమని, దేశంలోని మధ్యతరగతి ప్రజలను తప్పుదోవ పట్టించడానికి, రైతాంగ ఉద్యమం పైన బురద చల్లడానికి బిజెపి ప్రభుత్వం లంఖించుకుంది. ఈ దుష్ప్రచారాన్ని రైతాంగ సంస్థలు ఖండించడంతో ప్రభుత్వ పన్నాగం విఫలమైంది. మోడీ ప్రభుత్వ కుట్రలను, కుహకాలను ఎదుర్కొంటూ రైతాంగ ఉద్యమం 4 నెలలకు పైగా ఉధృతంగా సాగుతున్నది. వ్యవసాయ చట్టాలను రద్దు చేసేంత వరకు మా పోరాటానికి విరామ చిహ్నం లేదని "విత్తనాలు చల్లాం-పంట కోసుకునే తీరుతాం" అని రైతాంగం తెగేసి చెబుతున్నారు.

అయితే ఈ ఉద్యమంలో ఇప్పటికే 150 మంది రైతాంగం ఆత్మత్యాగం చేశారు. ఈ మహోద్యమంలో రైతాంగ మహిళల పాత్ర అద్వితీయమైనది. వారు ఉద్యమంలో ఎంతో మిలిటెంట్‌గా పాల్గొంటున్నారు. దేశవ్యాప్త రైతాంగం ఈ పోరాటాల్లో పాల్గొంటూ భుజం, భుజం కలిపి పోరాడుతుంది. ఎన్నడూ లేని విధంగా ఈ ఉద్యమానికి అంతర్జాతీయ మద్దతు లభించింది. కెనడా ప్రధాని మద్దతు పలకడం, బ్రిటీష్ పార్లమెంట్‌లో చర్చకు తీసుకోవడం, రిహన్న లాంటి ప్రముఖ సెలబ్రిటీలు మద్దతు తెలియజేయడంతో పాటు పద్దెనిమిదేళ్ల స్వీడిష్ దేశీయురాలైన ప్రపంచ ప్రసిద్ధి గాంచిన పర్యావరణవేత్త గ్రేటా థన్బర్గ్ టూల్ కిట్ అనే ఒక ఉద్యమ మార్గదర్శక బుక్‌లెట్ భారత రైతాంగ ఉద్యమానికి సహాయం చేస్తుందని ట్వీట్ చేయడంతో ఈ ఉద్యమానికి అంతర్జాతీయ ప్రాముఖ్యత లభించింది. దీనితో బిజెపి ప్రభుత్వం బెంబేలు పడిపోయి, దేశంలోని కొంత మంది ప్రొఫెషనల్స్ టుల్ కిట్ తయారు చేయడానికి సహకరించారని వారిపై అక్రమ కేసులు మోపుతున్నది. రైతాంగ నాయకులను ఒక వైపు చర్చలకు పిలుస్తూనే, వారిపై ఎన్.ఐ.ఏ అక్రమ కేసులు బనాయించింది.

బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు సింఘూ, త్రటిక్రీ ల్లోని రైతాంగ టెంట్ల పైన గుండాలతో దాడులు చేయించాయి. అక్కడ నీటి సరఫరాను, కరెంట్ సరఫరాను బందు పెట్టించింది. 4 వరసల్లో బారిగేడ్లు (మేకులు, గోడలు, తలుపులు లాంటి వాటితో) అఘమేఘాల మీద నిర్మించారు. అయినప్పటికీ రైతాంగం గ్రామ, గ్రామాన మహా పంచాయితీలు జరుపుతూ నూతనంగా అనేక లక్షల సంఖ్యలో ఈ పదర్శనల్లో మిలిటెంట్‌గా పాల్గొంటున్నారు. మార్చి 26న ఉద్యమం నాలుగు నెలలు గడిచిన సందర్భంగా దేశ వ్యాప్త సమ్మెకు కిసాన్ మోర్చా పిలుపునిచ్చింది.

**ప్రియమైన ప్రజలారా, రైతాంగ మిత్రులారా!**

నరేంద్ర మోడీ ప్రభుత్వం రెండవ సారి అధికారానికి వచ్చిన తర్వాత హిందూ రాష్ట్రం ఏర్పాటుకు, సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ బూర్జువా ప్రాయోజిత కార్యక్రమాలను దూకుడుగా అమలు చేస్తున్నాడు. కశ్మీర్ స్వయం ప్రతిపత్తిని హరించడం, రామ మందిర నిర్మాణం, పౌరసత్వ సవరణ చట్టం, కార్మిక హక్కుల హననం, పత్రిక స్వేచ్ఛకు తూట్లు పొడవడం, ఉపా చట్టంలో సవరణలు, పార్లమెంటరీ చట్టాల్లో పలు మార్పులు, జిఎస్‌టి అమలు, డిమానిటైజేషన్ లాంటి అనేక నిర్ణయాలు తీసికొని దేశ ప్రజలకు ద్రోహం చేస్తూ సామ్రాజ్యవాదుల అంటకాగుతున్నాడు. ఇప్పుడు వ్యవసాయ చట్టాలను ముందుకు తెచ్చి భారత రైతాంగానికి తీవ్రమైన నష్టాన్నీ కలుగజేస్తున్నాడు. అదే సమయంలో పబ్లిక్ సెక్టార్‌లోని అనేక ముఖ్యమైన పరిశ్రమలల్లో వంద శాతం పెట్టుబడిని ఆహ్వానించి, సామ్రాజ్యవాదులకు ఎర్ర తివాచీ పరుస్తున్నాడు. ఈ ప్రతిఘాతుక, ప్రజావ్యతిరేక, ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా అన్ని రంగాల ప్రజలు మిలిటెంట్‌గా ఉద్యమాలు చేస్తున్నారు. అయినప్పటికీ మోడీ ప్రభుత్వం పోలీసు బలగాలతో ఈ ఉద్యమాలను అణచివేయ చూస్తున్నది. మిలిటెంట్ ప్రజా ఉద్యమాలను లెక్క చేయకుండా, ఈ ఫాసిస్టు చట్టాల అమలుకు పూనుకొంటూనే ఉన్నాడు. వ్యవసాయ చట్టాలను ఎట్టి పరిస్థితిల్లో వెనక్కి తీసికోనే ప్రసక్తే లేదని రైతాంగాన్ని బెదిరిస్తున్నాడు.

మోడీ ప్రభుత్వం రూపొందించిన వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకునేంత వరకు రాజీలేని పోరాటాన్ని రైతాంగం కొనసాగించాలి. అయితే ప్రభుత్వం ఈ చట్టాలను ఉపసంహరించుకోవడంతోటే పూర్తిగా రైతుల సమస్యలు పరిష్కారం కావు. కావున, బిజేపి ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలు, నిర్ణయాలు, నిర్బంధాలకు బలి అవుతున్న రైతాంగం, కార్మికులు, విద్యార్థులు, మహిళలు, జాతులు, మైనారిటీలు, మేధావులు, పాత్రికేయులు, ప్రజాస్వామిక వాదులు ఒక్కటై మిలిటెంట్‌గా పోరాడి మోడీ ప్రభుత్వానికి, బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజానికి ఘోరి కట్టాలి. భారత దేశాన్ని సామ్రాజ్యవాదులకు తాకట్టు పెడుతున్న పాలక వర్గాలకు వ్యతిరేకంగా పోరాడుతూనే, యావత్తు దేశ ప్రజలకు ఉమ్మడి శత్రువైన సామ్రాజ్యవాదానికి, నయా వలస దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా ఉమ్మడిగా పోరాడాలి. ఇప్పటికే శిదిలావస్థకు చేరిన సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా, బడా భూస్వామ్య పాలక వర్గాలను అధికారం నుండి తొలగించి, నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం చేయడం ద్వారానే భారత ప్రజలు అన్ని రకాల దోపిడి నుండి విముక్తి అవుతారు. ★

# పారిస్ కమ్యూన్ కు 150 సంవత్సరాలు

**'మానవజాతిని వర్గపాలన ద్వారా శాశ్వతంగా విముక్తి చేసే గొప్ప సామాజిక విప్లవోద్యమం-పారిస్ కమ్యూన్' ....కార్ల్‌మార్క్స్**

1869 నాటికి ఫ్రాన్స్‌లో కార్మికవర్గం గణనీయంగా బలపడింది. ఫ్రాన్స్ కార్మికవర్గంలోని పురోగామి విభాగాలు బూర్జువా పలుకుబడి నుండి బయటపడి కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌లో చేరాయి. పెట్టుబడిదారీ విధానంలో కార్మికులు అంతులేని కష్టంతోనూ, దారిద్ర్యంతోనూ కృశించిపోవడంతో ఏర్పడిన భయంకర పరిస్థితులు కారణంగా సామాన్య ప్రజలలో రోజు రోజుకు ఆందోళన పెరగసాగింది. సభలు, ప్రదర్శనలు, సమ్మెలు ఎక్కువయ్యాయి 1870 జనవరిలో పారిస్ వీధుల్లో 2 లక్షల మందితో ఒక ప్రదర్శన జరిగింది. 'రిపబ్లిక్ జిందాబాద్', 'నెపోలియన్ ముర్దాబాద్' అని ప్రజలు నినదించారు. పారిస్ ప్రజలు ప్రాణాలొడ్డి, తమ రిపబ్లిక్ రాజధాని రక్షణకు సిద్ధపడ్డారు.




దేశద్రోహకర ప్రభుత్వ విధానాలు అర్థమయిన ప్రజలు వెంటనే 1870 అక్టోబర్‌లో ఒకసారి, 1871 జనవరిలో మరోసారి తిరుగుబాట్లు చేసారు. 1871 ఫిబ్రవరి నాటికి ప్రజాబలం పెరిగి పారిస్‌లో జాతీయ రక్షణ దళ కేంద్ర కమిటీ ఏర్పడింది. ప్రజలు, జాతీయ రక్షణ దళం కలిసి సైనిక జనరల్‌ను అరెస్టు చేసి తుపాకులను కాపాడుకున్నారు.

**1871 మార్చి 18 నాటి విప్లవం-పారిస్ కమ్యూన్ ఏర్పాటు**

జాతీయ రక్షణ దళం కేంద్ర కమిటీ పిలుపు మేరకు మార్చి 18 మధ్యాహ్నం 2 గంటలకు ఆర్లియన్స్ స్టేషన్‌ను, నగరంలోని ఇతర స్థావరాలను సాయుధ ప్రజలు ఆక్రమించారు. బూర్జువా ప్రభుత్వం కూలదోయబడింది. అధికారం సర్వమూ జాతీయ రక్షణ దళ కేంద్ర కమిటీ చేతిలోకి వచ్చింది. నూతన ప్రభుత్వం 'పారిస్ కమ్యూన్' ఏర్పడింది. కమ్యూన్ జిందాబాద్ అని ప్రజలు హర్షధ్వానాలతో అభినందించారు.

సార్వజనీన ఓటింగు ద్వారా కౌన్సిల్ ఎన్నిక జరుగింది. కార్మికులు, శ్రామిక ప్రజల సామూహిక సంస్థలు, ట్రేడ్‌యూనియన్లు, విప్లవ క్లబ్బుల అండదండలతో కమ్యూన్ కార్యకలాపాలు సాగేవి. మహిళా కార్మికులు కమ్యూన్‌కు ఎనలేని సాయం చేసారు. కమ్యూన్ కౌన్సిల్ ప్రభుత్వ అధికారపు అత్యున్నత సంస్థ అయ్యింది. అదే పారిస్ కమ్యూన్. కమ్యూన్ ఒక రాజ్యాంగ యంత్రమని, కార్మికవర్గ రాజ్యాంగ యంత్రమని కమ్యూన్ కార్యకలాపాలు నిరూపించాయి. పారిస్‌కమ్యూన్ మొట్టమొదటి కార్మికవర్గ నియంతృత్వం. పారిస్ కమ్యూన్ 72 రోజుల స్వల్ప వ్యవధిలోనే, యుద్ధ పరిస్థితుల్లోనే ఆర్థిక వ్యవస్థను సంఘటితపరచడానికి, శ్రామిక జనుల జీవన పరిస్థితులు మెరుగుపరచడానికి కృషి చేసింది. ఆ చర్యలు కార్మిక శ్రేయస్సు పట్ల కమ్యూన్‌కు ఉన్న బాధ్యతను, శ్రద్ధను రుజువు చేసాయి.

జర్మనీతో ఫ్రెంచి బూర్జువాలకు కుదిరిన ఐక్యతతో పారిస్ కమ్యూన్‌పై వారివురి సమిష్టి యుద్ధం మొదలయ్యింది. మే 20న పారిస్ నగరం మీద సర్వతోముఖ దాడి ప్రారంభం అయ్యింది. వీధుల్లో భీషణ పోరాటం జరిగింది. కార్మికవర్గం అసమాన సాహసం ప్రదర్శించారు. మే 21 నుండి మే 28 వరకు వారం రోజులు పాటు ప్రజలు వీరోచితంగా పోరాడి ప్రాణ త్యాగం చేసారు. పారిస్ వీధుల్లో రక్తం ఏరులై పారింది.

పారిస్ కమ్యూన్ ఓటమి తర్వాత ఫ్రాన్స్‌కు పారిపోయిన కమ్యూనార్డ్ యూజీన్‌పోతిఏల్ 'ఇంటర్నేషనల్ గీతం' రాసాడు.

**పారిస్ కమ్యూన్ ఓటమికి కారణాలు (కార్ల్ మార్క్స్ గుర్తించినవి)**

1. విప్లవ పార్టీ నిర్మాణం లేకపోవడం పెద్ద లోపం. 2. పాత ప్రభుత్వ యంత్రాంగం మీద ఆధారపడ్డారు. రియాక్షనరీలను అణచివేయలేదు.

3. శత్రువును సంపూర్ణంగా సంహరించలేదు. శత్రు యుద్ధ సన్నాహాలను గమనించలేదు. వర్సేల్స్‌పై దాడి చేయలేదు. 4. మున్సిపల్ ఎన్నికలకు, చర్చలకు ఎక్కువ ప్రాధాన్యత నిచ్చారు. అధికారం శాంతియుతంగా రాదని, నిలబడదని గుర్తించలేదు. 5. విప్లవ పారిస్ కోసం సరిహద్దు ప్రాంతాల మద్దతు కూడగట్టలేదు. విప్లవాన్ని దేశవ్యాప్తంగా విస్తరించలేదు.

కమ్యూన్ నాయకత్వంపై బ్లాంక్వీ, ప్రౌధాన్ అనుయాయుల ప్రభావం ప్రధానం అయ్యింది. మార్క్స్ 'ఇంటర్నేషనల్ నుండి ఇచ్చిన సలహాలను సరిగా వినియోగించుకోలేదు.

**కమ్యూన్ చారిత్రక ప్రాధాన్యత –** అంతర్జాతీయ కార్మికవర్గ పోరాటం మీద కమ్యూన్ బ్రహ్మాండమైన ప్రభావం వేసింది. యూరప్ అంతటా అది కమ్యూనిస్టు ఉద్యమాన్ని రేపింది. అంతర్యుద్ధపు శక్తిని నిరూపించింది. సోషలిస్టు విప్లవ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకోవాలని యూరోపియన్ కార్మికవర్గానికి కమ్యూన్ నేర్పింది. 'కమ్యూన్ అనేది నూతన తరహా ప్రజాస్వామ్యం, కార్మికవర్గ ప్రజాస్వామ్యం' అని మార్క్స్ గుర్తించిన పారిస్ కమ్యూన్ అనుభవాన్ని లెనిన్ వివరించాడు. పీడిత వర్గాల ఐక్యసంఘటనా ప్రభుత్వానికి కార్మికవర్గ నాయకత్వాన్ని ఏర్పరిచి వర్గపోరాటం కొనసాగించాలన్నాడు.రష్యాలో సోషలిస్టు విప్లవ విజయానికి ఉపయోగపడే అంశాలను అక్కడి పార్టీ కమ్యూన్ నేర్పిన గుణపాఠాల నుండి నేర్చుకుంది. పారిస్‌కమ్యూన్ మొట్టమొదటి కార్మికవర్గ నియంతృత్వం. అది సోవియట్ ప్రభుత్వానికి మాతృకగా ఉపయోగపడింది.

పారిస్ కమ్యూన్ ఏర్పాటుతో కార్మిక వర్గ ఉద్యమంలో అంతవరకు ఉండిన తప్పుడు సిద్ధాంతాలనన్నిటినీ ఓడించి నాయకత్వ స్థానమాక్రమించిన మార్క్సిజం సిద్ధాంతరంగంలో విజయం సాధించడంతో దాని శత్రువులు కూడా మార్క్సిస్టు వేషం వేసుకునే పరిస్థితి వచ్చింది. మార్క్సిజం ఈ అవకాశవాద రివిజనిస్టు ధోరణితో ఢీకొన్నది.

మొదటి ప్రపంచ యుద్ధకాలంలో (1917లో) రష్యాలో అక్టోబర్ సోషలిస్టు విప్లవం విజయవంతం కావడం, వలస దేశాల్లో జాతీయ విముక్తి పోరాటాలు విజృంభించడంతో సామ్రాజ్యవాదం శాశ్వత సంక్షోభంలోకి ప్రవేశించింది. మానవ సమాజం విప్లవాల యుగంలోకి ప్రవేశించింది. ప్రపంచ వ్యాప్తింగా కమ్యూనిస్టు పార్టీల నిర్మాణానికి, మూడవ ఇంటర్నేషనల్ నిర్మాణానికి, విప్లవ పోరాటాల విస్తరణకు దోహదం చేసింది. రెండ ప్రపంచ యుద్ధకాలంలో రెడ్ ఆర్మీ మద్దతుతో తూర్పు యూరప్ దేశాల్లో జనతా ప్రజాస్వామిక రాజ్యాలు ఏర్పాటు కావడంతో పాటు, మావో నేతృత్వంలో (1949లో) చైనా అక్టోబర సోషలిస్టు విప్లవం విజయవంతమయ్యింది.

మరో వక్కన రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత సామ్రాజ్యవాదులు అనుసరించిన ప్రపంచ ఆర్థిక రాజకీయ విధానాలు (ప్రపంచ బ్యాంకు, ఐ.యమ్.ఎఫ్ ద్వారా) సామ్రాజ్యవాద సంక్షోభం నుండి తాత్కాలికంగా బయటపడవేయడంతో 1970ల వరకు పెట్టుబడిదారీ విధానంలో సమస్యలు బహిర్గతం కాకుండా కొనసాగాయి. సోవియట్ రష్యాలో ప్రతీఘాతుక ఆధునిక రివిజనిస్టు కృశ్చేవ్ ముఠా 1956 తర్వాత పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరించింది. ప్రపంచ కార్మిక వర్గాన్ని, కమ్యూనిస్టు పార్టీలను, సోషలిస్టు శిబిరాన్ని చీల్చింది. మావో నేతృత్వంలో చైనా కమ్యూనిస్టు పార్టీ ఆధునిక రివిజనిజాన్ని ఓడించడంతో పాటు చైనాలో శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవం నడిపి, పెట్టుబడిదారీ పునరుద్ధరణ జరగకుండా ఆపింది. అయితే 1976 తర్వాత ఆధునిక రివిజనిస్టు డెంగ్ ముఠా నమా ఉదారవాద విధానాలను అమలు చేసి చైనాను పెట్టుబడిదారీ దేశంగా మార్చి వేసింది. ప్రపంచ సోషలిస్టు శిబిరం లేకుండా పోయింది.

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత సామ్రాజ్యవాద శిబిరంలో తిరుగులేని శక్తిగా ఎదిగిన అమెరికా అగ్రరాజ్యం 1970 తర్వాత 2 దశాబ్దాల పాటు (1991లో రష్యా అగ్రరాజ్య పతనం వరకు) రష్యన్ అగ్రరాజ్య పోటీని ఎదుర్కొన్నది. 1970 నుండే అమెరికా ఆర్థికంగా బలహీనపడడంతో దాని వ్యూహాత్మక బలహీనత బయటపడింది. 2008లో వచ్చిన సంక్షోభం దానిని మరింత తీవ్రం చేసింది. ప్రపంచ సామ్రాజ్యవాదంలో కొత్తగా వచ్చిన చైనా సామ్రాజ్యవాదంతోనూ, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ లాంటి దేశాలతో అమెరికా పోటీని ఎదుర్కొంటున్నది. అమెరికా అగ్రరాజ్య అధిపత్య స్థాయిని క్రమంగా కోల్పోతున్నది.

పెట్టుబడిదారీ విధానంలోని పిరియాడికల్ సంక్షోభాల స్థానంలో సాధారణ సంక్షోభం (శాశ్వత) వచ్చింది. పెట్టుబడిదారులు ఎన్ని రకాల సంస్కరణలు ప్రవేశ పెట్టినా శాశ్వత సంక్షోభం నుండి బయట పడడం లేదు. కెనీషీయన్ సిద్ధాంతాలు, సంస్కరణలు 1980ల తర్వాత వచ్చిన నూతన ఆర్థిక విధానాలు (యల్‌పిజీ) కూడా సంక్షోభం నుండి బయట పడవేయడం లేదు.

చారిత్రకంగా ఎన్నడులేని విధంగా తక్కువ వడ్డీరేట్ల పై విస్తరించడం, కొద్దిమంది చేతుల్లో అసాధారణంగా సంపద ప్రోగుపడడంతో సంపద, ఆదాయాల్లో అసమానతలు చరిత్రలో లేని స్థాయికి పెరిగిపోయాయి. ప్రపంచ పర్యావరణాన్ని దెబ్బతీసి మనిషి జీవించడానికి భూమి ఎంత మాత్రం అనువైన స్థలంగా లేకుండా చేయడం జరుగుచున్నది. ప్రపంచ గుత్త పెట్టుబడిదారీ, ద్రవ్య వ్యవస్థ నూతన మహమ్మారి రోగాలను అంటించే ప్రధాన




వాహకంగా తయారైంది. నయావలసవాదం, నయాఫాసిజం రూపంలో ప్రభుత్వాలు పెద్ద ఎత్తున నిర్బంధాన్ని అమలు చేస్తున్నాయి.

పెట్టుబడిదారీ విధానంలో గుత్త పెట్టుబడిదారీ విధానం వలన పోటీ మరింత పెరిగి పోయింది. ఆర్థిక అసమానతలు మరింతగా పెరిగిపోయాయి. సంపద ఒక చోట, పేదరికం మరో చోట పెరిగి వర్గ వైరుధ్యాలు తీవ్రతరమయ్యాయి. ఇప్పుడు పెట్టుబడిదారీ విధానం తీవ్ర సంక్షోభంలో ఉంది. 1930ల నాటి తీవ్రతను మించి లోతుల్లోకి వెడుతుంది. దీనిని కొవిడ్-19 మహమ్మారి మరింత విస్తృతం చేసింది. దీని వలన ప్రపంచ వ్యాప్తింగా కార్మికవర్గం, ఇతర పీడిత వర్గ ప్రజల ఆందోళనలు పెరిగాయి.

ఉత్పత్తి శక్తులను నాశనం చేస్తూ, ఉత్పాదకతను దెబ్బతీస్తూ ఉన్న ఆర్థిక, రాజకీయ విధానాల కారణంగా నిరుద్యోగం పెరిగి కొనుగోలు శక్తి క్షీణించి పోతున్నది. నేడు పేదరికం పెరగడంతో పాటు ఆహార సంక్షోభం కూడా కొనసాగుతున్నది. ఇంతటి గొప్ప విప్లవ సంక్షోభ పరిస్థితి గతంలో ఎన్నడు కానరాలేదు.

1976 నుండి కొనసాగుతున్న ప్రపంచ విప్లవోద్యమ వెనుకంజ (సెట్‌బ్యాక్) ను అధిగమించి నేడు అపూర్వ స్థాయిలో ప్రపంచ వ్యాప్తంగా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు, ప్రపంచ కార్మిక వర్గ విప్లవాలు తలెత్తే అవకాశాలున్నాయి. ఇది మరో వరుస విప్లవాల వెల్లువకు దారి తీస్తుంది. భారత దేశం, ఫిలిప్పైన్స్, టర్కి, పెరు, ఇతర దేశాల్లో మావోయిస్టు పార్టీలు ఈ పరిస్థితిని వినియోగించుకుని ముందుకు సాగేందుకు సన్నద్ధమవుతున్నాయి.

1871 నాటికి ఎదురెదురుగా నిలిచిన రెండు వర్గాలు గత 150 సంవత్సరాలుగా నిరంతరం వర్గ సంఘర్షణతోనే కొనసాగుతున్నాయి.

సామ్రాజ్యవాదం అనుసరించిన నయా ఉదారవాదవిధానాలు, గ్లోబలైజేషన్‌ల ఫలితంగా కార్మికవర్గం,మధ్యతరగతితో పాటు అన్నివర్గాల ప్రజలు పరిస్థితి ఘోరంగా దెబ్బతిన్నది. దీనితో మార్క్సిజమే ప్రత్యామ్నాయమని, సోషలిస్టు వ్యవస్థలు ఏర్పడాలని ప్రపంచంలో ఆకాంక్షలు వృద్ధి అవుతున్నాయి.

పారిస్ కమ్యూన్ స్ఫూర్తి కొనసాగుతుంది. ప్రపంచ విప్లవ విజయానికి కార్మిక వర్గం సమాయత్తం అవుతుంది. ★

---

*(19వ పేజి తరువాయి....)*

పార్టీ జిల్లా ప్రజల్లో పని చేస్తుందని ఒప్పుకుంటూ, దళాలను దెబ్బతీయడానికి వేలాది మంది పోలీసు బలగాలను మోహరించి కూంబింగ్‌లు నిర్వహించింది. ప్రజల అసాధారణ మద్దతుతో దళాలు నిర్విఘ్నంగా తమ కార్యకలాపాలను కొనసాగిస్తూ ప్రజల పోరాటాలకు నాయకత్వం అందిస్తున్నాయి. ప్రజలు కూడ మావోయిస్టు పార్టీ నాయకత్వంలోనే తమ సమస్యలు పరిష్కారం అవుతాయని భావించి పార్టీకి క్రియాశీల మద్దతు ఇస్తున్నారు.


కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలైన బిజెపి, టిఆర్ఎస్ పార్టీలు సామ్రాజ్యవాద, బహుళజాతి కంపెనీలకు, కార్పొరేట్ శక్తులకు, భూస్వామ్య నిరంకుశ దళారీ బూర్జువాలకు తలవొగ్గి దోపిడి పాలక వర్గాలు, ఉద్యమ ప్రాంతంలో అణచివేత దాడులు చేస్తున్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితిలో కూడా ఆదివాసీ ప్రజలు విప్లవ పార్టీని, దళాలను గుండెలకు హత్తుకొని, కంటికి రెప్పలా కాపాడుకుంటూ పార్టీ నాయకత్వంలో సంఘటితం అవుతూ జల్-జంగల్-జమీన్-ఇజ్జత్ అధికారంకై ఇంద్రవెల్లి స్ఫూర్తితో నేటికి పోరాడుతున్నారు.

గత 40 సంవత్సరాల చరిత్రను పరిశీలిస్తే ఆదిలాబాద్ జిల్లా ప్రజలు విప్లవోద్యమాలకి అంకితమై అనేక త్యాగాలు చేసారు. అనేక మంది విప్లవ కార్యకర్తలు పోలీసు ఎన్‌కౌంటర్లలో అమరులైనారు. అయినప్పటికీ జిల్లా ప్రజలు పోరాట రంగాన ఉజ్వలమైన చరిత్ర నిర్మించుకుంటున్నాయి. అందుకు 40 ఏళ్ళ ఇంద్రవెల్లి ఒక సాక్ష్యంగా నిలుస్తుంది.

గాయాలు మానినా గుర్తులు మాసిపోలే. ఇంద్రవెల్లి పోరాట మహోజ్వల జ్వాల నేటికి నివురుగప్పిన నిప్పులా రగులుతూనే ఉంది. ఆదివాసుల హక్కు జల్-జంగల్-జమీన్-ఇజ్జత్ అధికారం దక్కేంత వరకు ఉద్యమజ్వాల నిరంతరం దేదీప్యమానంగా జ్వలిస్తూనే ఉంటుంది. ★

# మహోజ్వల ఇంద్రవెల్లి ఉద్యమ జ్వాల దేదీప్యమానంగా జ్వలిస్తుంది!

## ఇంద్రవెల్లి పోరాట స్ఫూర్తికి నలభై ఏళ్ళు!!



ఇంద్రవెల్లి అమరుల స్మారక స్థూపం

సామ్రాజ్యవాద, భూస్వామ్య, నిరంకుశ దళారీ పెట్టుబడిదారుల, దోపిడీ పాలక వర్గాల ప్రభుత్వాలు నిషేదాజ్ఞలు విధించి పారామిలటరీ, పోలీసు బలగాలతో ఇంద్రవెల్లిని దిగ్బంధించినా లెక్కచేయకుండా ఆదివాసులు ప్రతి సంవత్సరం ఏప్రిల్ 20న ఇంద్రవెల్లి అమరుల స్థూపాన్ని చేరుకొని జెండాలు ఎగరవేసి మృతవీరులను స్మరించుకొని నివాళ్లు అర్పించి వారి ఆశయాలను చివరి కంటా కొనసాగిస్తామని శపథం చేస్తూ ఇంద్రవెల్లి అమరుల పోరాట స్ఫూర్తితో ఉద్యమిస్తున్నారు.

ఈ ఏడాదితో ఇంద్రవెల్లి పోరాటానికి నలభై ఏళ్ళు నిండాయి. ఈ పోరాటం ఇప్పటికీ ఆదివాసి ప్రజలకు పోరాట చైతన్యానికి దిక్సూచిగా పని చేస్తూనే ఉంది. కొమురం భీం జోడేఘాట్ పోరాటానికి, ఇంద్రవెల్లి పోరాటానికి మధ్య నలభై ఏళ్ళు, నేడు ఇంద్రవెల్లి పోరాటానికి నలభై ఏళ్ళు కావడం చారిత్రక కాలక్రమంలో యాదృచ్ఛికత ఉండవచ్చోనేమోగాని, చరిత్ర మాత్రం పూసల్లో దారంలా కొనసాగుతూనే ఉంది. ఈ పోరాటం మెలికలు, మలుపుల గుండా కొనసాగుతూనే ఉంది. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో (ఇప్పటి నుండి ఆదిలాబాద్ జిల్లా గానే ఈ వ్యాసంలో పేర్కొంటాం.)

ఆదివాసీల పోరాటాలకు చరిత్రలో విశిష్ట ప్రాధాన్యత ఉంది. చాందా కేంద్రంగా గోండ్వానా రాజ్యంలో ఆదివాసీలు బొంస్లే మారాఠా రాజులకు, బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా తమ అధికారం కోసం నిరంతరం పోరాడారు. రెండు శతాబ్దాలుగా సాగిన పోరాటంలో బ్రిటీష్ వాళ్ళు గోండ్వానా రాజ్యాన్ని ఆక్రమించుకొన్నప్పటికీ, అదివాసీలు నివసించే లోతట్టు ప్రాంతాల్లో పూర్తిగా ఆధిపత్యాన్ని కొనసాగించలేక పోయారు. వలసవాదులు దేశాన్ని విడిచి పెట్టి దేశానికి బూటకపు స్వాతంత్యం ఇచ్చినప్పటికీ, ప్రస్తుతం దేశాన్ని పాలిస్తున్న పాలకులు కూడ బ్రిటీష్ కాలం నాటి ఆదివాసీ తెగ పెద్దలు (మొకాశీలు) పై ఆధారపడి అధికారాన్ని చెలాయిస్తూ వచ్చారు. గోండ్వానా పోరాట కాలం నాటి నుండి చాందా రాజ్యానికి పక్కనే పార్ధా నదికి యీవలి గట్టున ఉన్న సిర్పూర్ (మానిక్‌ఘడ్) కేంద్రంగా కొనసాగిన ఆదిలాబాద్ గోండుల అధికారంను నిజాం రాజు ఆక్రమించాడు. అప్పటి నుండి ఆదిలాబాద్ జిల్లాలో నిజాం రాజుకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతూ వచ్చింది.

ఆదిలాబాద్ జిల్లా ఉత్తర తెలంగాణలో ప్రవహించే గోదావరి నదికి ఉత్తరాన ఎతైన పర్వత ప్రాంతాలతో కూడుకొని ఉంది. విశాలమైన ఈ జిల్లాలో అడవుల విస్తీర్ణం చాలా ఉంది. ఈ అడవుల్లో

టేకు, కలప విస్తారంగా ఉంది. గోదావరి పరివాహక ప్రాంతంలో గల ఈ జిల్లాలో సారవంతమైన నల్లరేగడి భూములు అధికంగా ఉన్నాయి. స్వర్ణ, సాత్నాల, వట్టివాగు, కడెం లాంటి చిన్న నదులు అనేక కొండల గుండా ప్రవహించి గోదావరిలో కలుస్తాయి. నల్లరేగడి భూముల్లో జొన్న, మొక్కజొన్న, పత్తి పంటలు విస్తారంగా పండుతాయి. ఈ భూములపై కన్నేసిన బహుళజాతి కంపెనీలు విత్తనాల పంటలను ప్రవేశ పెట్టారు. అలాగే సోయాబీన్లు కూడా రావడంతో రైతులు వీటి సేద్యం కూడ ప్రారంభించారు. పత్తి విత్తనాలు పక్కనే గల మహారాష్ట్ర ప్రాంతం నుండి 1900 ప్రారంభంలో రావడం జరిగింది. ఈ పంటను నిజాం కూడా ప్రోత్సహించారు. అలా కొండలపై ఆదివాసులు కూడా జొన్నలు, కందులతో పాటు పత్తిని కూడ పండిస్తారు. ఆదివాసీలకు జొన్న రొట్టే, కందిపప్పు ప్రధాన ఆహారంగా ఉన్నాయి. అయితే 1965లో రెండు రూపాయలకు కిలో బియ్యం ప్రభుత్వం ప్రవేశపెట్టిన దగ్గరి నుండి ఆహారంలో జొన్న గట్కతో పాటు బియ్యం అన్నం కూడా భాగమైంది.

నిజాం రాజు ఆదిలాబాద్ జిల్లాలో తన అధికారాన్ని సుస్థిరం చేసుకోవడం, భూమి, అటవీ సంపదను కొల్లగొట్టడం, పన్నులు వసూలు చేసుకోవడం కోసం మైదాన ప్రాంతాల నుండి జిల్లాలోకి వలసలు ప్రోత్సహిచడంతో పాటు మక్తేదార్ల వ్యవస్థను ప్రవేశ పెట్టాడు. గోదావరి నడి ఒడ్డున గల సారవంతమైన భూముల్లో మక్తేదార్ల వందల, వేల ఎకరాల యాజమాన్యంతో నిజాం రాజుకు, ప్రజలు పండించిన పంటల నుండి శిస్తులు చెల్లించేవారు. వీరికి అడవులు కూడ ఉండేవి. బ్రహ్మణులు, ముస్లీంలు, వెలమలు ప్రధానంగా మక్తేదార్లుగా జిల్లాలో స్థిరపడ్డారు. జిల్లా మహారాష్ట్రకు ఆనుకొని ఉన్న ప్రాంతం గనుక ఆ రాష్ట్రం నుండి వలస నిరంతరం కొనసాగుతూ ఉండేది. అందులో భాగంగా వ్యాపార వర్గం ముందుగా జిల్లాలోకి ప్రవేశించింది. 1850 తర్వాత నుండి మెల్లగా లంబాడీలు జిల్లాలో స్థిర నివాసం ఏర్పర్చుకోవడం ప్రారంభమైంది. ఇది 1976 తర్వాత వీరి వలస పెద్దఎత్తున వేల, లక్షల సంఖ్యలోకి పెరిగింది. వీరు గోండుల భూములను అక్రమంగా కొన్నారు. అనేక గ్రామాలు ఏర్పరిచారు. ఆ తదుపరి వీరే ఆదివాసీల రిజర్వేషన్‌లో అత్యధిక భాగం పొంది గోండులకు సమాన అవకాశాలు లేకుండా చేశారు. అదివాసీల్లో కూడ ఇంద్రవెల్లి పోరాటం తర్వాత పెంపొందిన చైతన్యంతో విద్య పెరగడంతో ప్రస్తుతం రిజర్వేషన్లలో పొందాల్సిన కోటా కోసం పోరాటం చేయక తప్పడం లేదు.

40వ దశకంలో సాగిన కొమరం భీం పోరాటం ఆదిలాబాద్ ఆదివాసీ రైతాంగంలో తిరుగుబాటు తత్వాన్ని మరోమారు ముందుకు తెచ్చింది. నిజాం రాచరిక, భూస్వామ్య, వ్యాపార వర్గాల దోపిడితో కకావికలం అయిన ఆదివాసీలు కొమురం భీం నాయకత్వం క్రింద నిజాం రాజుకు వ్యతిరేకంగా తిరుగుబాటు లేవదీసారు. అడవులపై, భూమిపై, అధికారంతో పాటు ఆదివాసీలకు రాజ్యాధికారం కావాలని ఆయన సాయుధ తిరుగుబాటు నడిపాడు. రాంజీగోండు వారసత్వంగా నడిపిన ఈ పోరాటం ఆదివాసీల్లో పోరాట చైతన్యాన్ని రగిలించింది.

నిజాం సేనల క్రూర హత్యకాండలో కొమురం భీంతో పాటు 11 మంది వీరులు అమరులైనారు. కానీ ఈ పోరాటానికి నాయకత్వం వహించిన కొమరం భీం ఆదివాసీల్లో నిలిచిపోవడమేగాక నేడు తెలంగాణ రాష్ట్రంలో ఆయనొక పోరాట సంకేతంగా గుర్తిండి పోయాడు.

ఆంధ్రప్రదేశ్‌లో 1968-70ల మధ్య రగిలిన శ్రీకాకుళ పోరాటజ్వల ఆదిలాబాద్ అడవుల్లోకి చొరబడింది. ఇంద్రవెల్లి పోరాటం నాటికీ ఆదివాసీ ఏరియాలకు పరిమితమైన ఈ చరిత్రను విప్లవోద్యమం తవ్వితీసి కొమరం భీం చారిత్రక నవలగా రూపొందించి తెలుగు ప్రజల్లో విస్తృత ప్రచారం నిర్వహించింది. ఈ పోరాటం మరోమారు ఇంద్రవెల్లి కొండల్లో మారుమోగింది.

ఆదివాసుల ఆగ్రహాన్ని చల్లార్చడానికి నిజాం రాజు హేమన్ డార్ఫ్‌ను ఆదివాసుల తిరుగుబాటు గల కారణాలను అన్వేషించడానికి ఆదిలాబాద్ జిల్లాలో నియమించింది. ఆయన ఆదిలాబాద్ ఆదివాసీ గ్రామాల్లో నివసిస్తూ అధ్యయనం చేసి నిజాంకు కొన్ని సిఫారసులు చేసారు. తదుపరి కాలంలో ఇవి ఏవీ అమలుకాలేదు. ఆదివాసీల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా తయారైంది.

ఇంద్రవెల్లి పోరాటం నాటికి ఆదివాసీల పరిస్థితి దుర్భరంగా మారింది. షావుకార్లు, అటవీ అధికారులు, భూస్వాముల, పోలీసుల దోపిడి దౌర్జన్యాలు పెరిగిపోయాయి. ఈ సమయంలో పీపుల్స్‌వార్ పార్టీ (పౌరకల సార్లు) ఆదివాసీల్లో విప్లవోద్యమ నిర్మాణాన్ని ప్రారంభించింది. పార్టీ నాయకత్వంలో ఆదివాసీలు సంఘటితమై పోరాటాలకు సిద్ధమైనారు. 1978లో అసిఫాబాద్ తాలుకాలోని కమాన గ్రామంలో గల షావుకార్ల ఇండ్లపై రైతాంగం దాడి చేసి దుక్కి టెద్దులు తెచ్చుకున్నారు. ఆదివాసీల ఎడ్లను అప్పులకు బదులుగా షావుకార్లు బలవంతంగా లాక్కొని పోయేవారు. అలాంటి ఎడ్లను రైతాంగం తెచ్చుకోవడంతో పాటు అప్పుల పత్రాలను కాల్చి వేసారు. ఈ తిరుగుబాటు రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. ఈ పోరాట వార్త ఆదివాసీ ప్రాంతాలంతటా సుడిగాలిలా విస్తరించింది. గిరిజన రైతుకూలీ సంఘం క్రింద జిల్లా వ్యాప్తంగా ఆదివాసులు సంఘటితమైనారు. జిల్లా వ్యాప్తంగా భూమి కోసం పోరాటం ప్రారంభమైంది. అటవీ అధికారులను గ్రామాలకు రాకుండా తన్ని తరిమారు. పోలీసులు గ్రామాలపై దాడికి వస్తే సంప్రదాయక వాయిద్యమైన తుడుంను మోగించి ప్రజలను పోరాటానికి సిద్ధం చేసి, పోలీసులపై ప్రతిఘటన చేసేవారు. ఇలా

పోరాటం పెంపొందింది, ఆదివాసీ గ్రామాల్లో రైతు సంఘాల అధికారం నెలకొల్పబడింది. ప్రభుత్వ వ్యతిరేక పోరాటాలతో ఆదివాసీ ప్రాంతాలన్నీ అట్టుడికి పోయాయి. ఈ పోరాటాలకు అసిఫాబాద్ తరువాత ఇంద్రవెల్లి ఒక ముఖ్య కేంద్రంగా మారింది. ఇంద్రవెల్లిలో గల భూస్వాములు, వ్యాపారులు ప్రజలను విపరీతంగా దోపిడి చేసేవారు. అందుకని ఈ ప్రాంతంలో అనేక గ్రామాల ప్రజల్లో వీరి పట్ల వ్యతిరేకత ఉంది. ఇక్కడ నడిపే ప్రతి పోరాటం ఈ దోపిడీ దారులకు వ్యతిరేకంగా మారింది. గిరిజన రైతుకూలీ సంఘం మహాసభ జరపాలనే నిర్ణయం జరిగింది. ఈ మహాసభను ఇంద్రవెల్లిలోనే జరపాలనే ఆదివాసులు కోరుకున్నారు. పోరాట ప్రభావం 30 వేల చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో గల ఆదివాసీ గ్రామాలపై పడింది. ఆదిలాబాద్ జిల్లాలో తూర్పున గల సిర్పూర్ నుండి సరిహద్దులోని మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా వరకు పోరాటం విస్తరించింది. ఇంద్రవెల్లి సభకు ఈ ప్రాంతాలలోని ప్రజలంతా కదిలారు.

ఏప్రిల్ 20, 1981లో ఇంద్రవెల్లిలో గిరిజన రైతు కూలీ సంఘం మహాసభ జరుపుకోవడానికి ప్రభుత్వం పర్మిషన్ ఇవ్వలేదు. అయినప్పటికి ప్రజలు సభ జరుపుకునే హక్కు ఉందని చెప్పి ఇంద్రవెల్లికి వేలాదిగా చేరుకున్నారు. మీటింగ్ కోసం ఇంద్రవెల్లికి చేరుకున్న ప్రజలపై ప్రభుత్వం (జలియన్‌వాలా బాగ్‌లో బ్రిటీష్ ప్రభుత్వం ప్రజలపై కాల్పులు చేసి చంపిన విధంగా) ఎలాంటి హెచ్చరికలు చేయకుండా కాల్పులు జరిపి పదుల సంఖ్యలో గిరిజనులను చంపింది. ఈ సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

మేధావులు, పౌరహక్కుల సంఘాలు, విద్యార్థులు, వివిధ సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు, ప్రజలు ఈ నరమేధాన్ని ఖండించాయి. గిరిజన హక్కులకు మద్దతునిచ్చాయి. గిరిజనులు అమరత్వం చెందిన చోటే 120 అడుగుల ఎత్తైన స్థూపాన్ని పార్టీ నిర్మించింది. “కొండ గొగులు ఎరుపు, కొండల్లో అక్కల, అన్నల అమరత్వం ఎరుపు'' 'ఇంద్రవెల్లి అమరులు మృత్యుంజయులు' అని స్థూపంపై లిఖించబడింది. ఇంద్రవెల్లి అమరుల సాక్షిగా, వారి పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తూ ఇప్పటికి ఆదివాసులు జల్-జంగల్-జమీన్-ఇజ్జత్ అధికారంకై నిరంతరం పోరాటం కొనసాగిస్తూనే వున్నారు.

ఆదివాసీ హక్కుల కోసం పోరాడుతూ రక్తం చిందించి ప్రాణాలు అర్పించిన అమరుల ఇంద్రవెల్లి స్థూపం వద్ద మీటింగ్ జరుపుకోవడానికి ప్రయత్నించిన గిరిజనులను ప్రభుత్వం అనుమతించలేదు. సరికదా నిషేధాజ్ఞలు విధించింది. ఇంద్రవెల్లి మారణకాండ, ఆదివాసీల హత్యలకు సాక్షిగా నిలిచిన స్థూపాన్ని పోలీసులు 1986లో కూల్చివేశారు. ప్రజల, ఆదివాసుల నుండి వెల్లువెత్తిన నిరసనలతో యన్‌టిఆర్ ప్రభుత్వం మళ్ళీ ఆ స్థూపాన్ని నిర్మించక తప్పలేదు.

గిరిజనుల తిరుగుబాటు తర్వాత ప్రభుత్వం ఐటిడిఏను బలోపేతం చేసి గిరిజనుల్లో అనేక సంస్కరణలు చేసింది. విద్య, వైద్యం లాంటి సంస్కరణలు ప్రవేశ పెట్టింది. కాని గిరిజనుల భూముల్లో మౌళిక మార్పు రాలేదు.

పీపుల్స్‌వార్ పార్టీ తీవ్రంగా కొనసాగుతున్న నిర్బంధాన్ని ఎదుర్కొంటూనే గిరిజనుల పోరాటాలకు నాయకత్వం వహించింది. భూములపై హక్కు, కరువు సమస్యల పరిష్కారం, సమిష్టి వ్యవసాయం, సమిష్టి ఆర్థిక గ్రూపులు, కూలీరేట్ల పెంపుదల, గిట్టుబాటు ధరల పోరాటం లాంటి పోరాటాలు చేపట్టి గిరిజన రైతుకూలీ సంఘాలు గ్రామాల్లో అధికారాన్ని నడిపాయి. పార్టీ భూమి, భుక్తి, విముక్తి నినాదంతో (జల్-జంగల్-జమీన్-ఇజ్జత్ అధికారం) ప్రజలను కదిలించింది. ఆదివాసీ, ఆదివాసేతర రైతాంగ ఐక్యత కోసం కృషి చేసింది. మరాఠా, లంబాడీ, ముస్లీం లాంటి ఆదివాసేతరులతో ఐక్యత నెలకొల్పింది. ఆదివాసేతర భూస్వాములకు వ్యతిరేకంగా గిరిజనుల హక్కుల కోసం పోరాడింది. గిరిజనుల మౌళిక హక్కుల కోసం పోరాడుతూనే వారిని నూతన ప్రజాస్వామిక విప్లవ మార్గంలో సమీకరించింది. గ్రామాల్లో ప్రజా అధికార సంఘాలుగా గ్రామ రాజ్య కమిటీలను నిర్మించి, ఈ రోజు అదే కొనసాగింపుగా దండకారణ్యంలో 'జనతన సర్కార్లు' పని చేస్తున్నాయి.

ఆదివాసులు ఒంటరిగా రాజ్యాధికారాన్ని సాధించుకోవడం సాధ్యంకాదు. వారు దేశ ప్రజలతో సమైఖ్యమై నూతన ప్రజాస్వామిక విప్లవ మార్గంలో సాయుధ పోరాటాన్ని కొనసాగించి భారత దళారీ, బూర్జువా భూస్వామ్య వర్గాల ప్రభుత్వాన్ని కూల్చి వేసినప్పుడే దేశ ప్రజలతో పాటు ఆదివాసులకు రాజ్యాధికారం లభిస్తుంది. అయితే కొంత మంది పార్టీ పంథాను వ్యతిరేకిస్తూ, పీపుల్ వార్ పార్టీ (నేడు మావోయిస్టు పార్టీ) ఆదివాసుల రాజ్యాధికారాన్ని పట్టించుకోలేదని, కేవలం భూమి సమస్యను మాత్రమే ముందుకు తెచ్చారని, ఆదిలాబాద్ ఆదివాసుల్లో మొదటి నుండి గోండుల రాచరిక రాజ్యాధికార చైతన్యం ఉందని చెబుతున్నారు. ఈ వాదన ఆదివాసుల అసలు రాజ్యాధికారం గురించి చెప్పడం లేదు. ఈ దేశ రాజ్యాంగ పరిధిలో గల 5, 6 షెడ్యూల్స్ ప్రకారం ఆదివాసులకు చెందే హక్కుల గురించి మాట్లాడుతున్నారు. పార్టీ నిర్వహించిన విప్లవ మార్గం, అందులో భాగంగా కార్మిక వర్గ వారసత్వంలో నాలుగు వర్గాలు కలిసి, దోపిడి పాలక వర్గాలను అధికారం నుండి తొలగించి అధికారాన్ని సాధించి, జనత ప్రజాస్వామిక విప్లవాన్ని పూర్తి చేసి, సోషలిజంను నిర్మించే లక్ష్యంతో జరిగిన పోరాటం ద్వారా ఆదిలాబాద్ గిరిజనులు గోండ్వానా

రాజ్యాధికార చైతన్యాన్ని మించి శాస్త్రీయమైన మార్గంలో విప్లవ చైతన్యాన్ని పెంచుకున్నారు. కాని ఆక్స్‌వర్డ్ మేధావులు సబాల్టర్న్ సిద్ధాంతాన్ని ఆమోదించేవారు మాత్రమే జిల్లా గిరిజనుల పోరాటాన్ని చాందా రాజుల పరిపాలనకు నమూనాగానో, భారత రాజ్యాంగంలో గల 5, 6 షెడ్యూల్స్ కోసం జరిగే పోరాటంగానో భావిస్తారు. ఈ రాజ్యాంగ హక్కులు కూడ ప్రభుత్వం నేడు నిరాకరిస్తున్నది. వీటి కోసం కూడ ఆదివాసులు పోరాడే స్థితి నేడు నెలకొని ఉంది. ఈ సూడో రాజ్యాధికార వకల్తా దారులు గిరిజనులు జల్-జంగల్-జమీన్ ఇజ్జత్ అధికారం పొందటానికి ఆటంకంగానే ఉన్నారు.

గత 40 సంవత్సరాల్లో విప్లవోద్యమం దేశమంతటా అనేక రాష్ట్రాలకు విస్తరించింది. భారత పాలక వర్గాలకు పెను సవాలుగా మారింది. ఇంద్రవెల్లి పోరాట స్ఫూర్తిని ఆదిలాబాద్ జిల్లాలో తరాలు మారినప్పటికీ ఆదివాసులు అందుకొని పోరాడుతూనే ఉన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న హరితహారం, కవ్వాల టైగర్ ప్రాజెక్టు, ఓసీ బొగ్గు గనుల వలన ఆదివాసుల అస్థిత్వానికి ముప్పు ఏర్పడింది. ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ ప్రజా వ్యతిరేక, పర్యావరణ వ్యతిరేక చర్యలకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. గత 40 సంవత్సరాల్లో ఆదివాసులు విద్యలో కొంత ముందంజ వేసారు. కాని వారికి ఉద్యోగాలు లభించడం లేదు. ఆదివాసీ రిజర్వేషన్ కోటా ఉద్యోగాలు లంబాడీలు కాజేస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా ప్రజలు పోరాడుతున్నారు. తమ సంప్రదాయ రాయి సెంటర్లను పటిష్టపరుచుకొని తమ గ్రామాల్లో తామే టీచర్లుగా స్కూల్స్ నడుపుతున్నారు. వీటితో పాటు ఆదివాసులు ఐక్యంగా అనేక పోరాటాలు నడుపుతున్నారు.

2020, ఏప్రిల్ 20న నిర్బంధం, లాక్‌డౌన్ల మధ్య నిషేదాజ్ఞలు లెక్క చేయకుండ ఇంద్రవెల్లి 39వ అమరుల సంస్మరణ సభను విప్లవోత్సహంతో జరుపుకున్నారు. లోతట్టు ప్రాంతాల్లో కూడా ఆదివాసులు 75 గ్రామాల్లో ఇంద్రవెల్లి సభలు జరిపారు. ఇంద్రవెల్లి వారసత్వాన్ని నేటికి కొనసాగిస్తూనే పోరాడుతున్నారు.

అటవీ భూముల పట్టాలకై మహారాష్ట్ర-చంద్రపూర్ జాతీయ రహదారిని 600 మంది అడ్డగించి రాస్తారోకో చేశారు. దీనితో కలెక్టర్ దిగివచ్చి 300 మందికి వెంటనే పట్టాలు ఇచ్చి, మిగితా వారికి నెలలోపు ఇస్తామని హామీ ఇచ్చారు. కవ్వాల టైగర్ జోన్‌ను రద్దు చేయాలని నియమ నిబంధనాలను ఎత్తివేయాలని 49 గ్రామాల ప్రజలు 16వ రహదారిపై నిరసనలు తెలిపారు. ఆదివాసీ యువకుడిని ఫారెస్టు అధికారులు కొట్టి చంపినందుకు నిరసనగా 6 గ్రామాలలోని 2500 మంది ప్రజలు ఊరేగింపుగా వెళ్ళి ఫారెస్టు అధికారులను చితుకబాది, ఫారెస్టు ఆఫీస్‌ను ద్వంసం చేశారు.

ఏజెన్సీ ప్రాంతంలో ఆర్‌సిసితో కట్టిన భవనాలను విద్యార్థులు, మహిళలు, యువకులు ఊరేగింపుగా వెళ్ళి ద్వంసం చేశారు. 1/70 చట్టాన్ని, పెసా చట్టాన్ని అమలు పరచాలని, అటవీ భూములకు పట్టాలు ఇవ్వాలని, ప్రాజెక్టులలో భూములు కొల్పోయిన నిర్వాసితులకు ప్రత్యామ్నాయ భూముల చూపించాలని, జీవో నెం.3ని అమలు చేయాలని, ఎస్‌టి జాబితా నుండి లంబాడీలను తొలగించాలని, ఫారెస్టు అధికారుల జులుం నశించాలని, పర్యావరణాన్ని ద్వంసం చేస్తున్న ఓపెన్ కాస్టులను రద్దు చేయాలని విద్యార్థులు, మహిళలు, యువకులు ఉమ్మడి జిల్లా అంతటా నాలుగు రోజులు నిరసనలు తెలియజేశారు.

ఆదివాసీ ప్రాంతాలైన డోర్లీ, కైరీగూడ, అబ్బపూర్ ప్రాంతాలలో ఓపెన్ కాస్టులను వచ్చి ఆదివాసులను నిర్వాసితులను చేశాయి. కొత్తగా అసిఫాబాద్ జిల్లాలోని ముచ్వాడ ప్రాంతంలోని ఓపెన్ కాస్టులకు అనుమతి ఇచ్చారు. ప్రజాభిప్రాయ సేకరణ 1/70, పెసా, 5వ, 6వ షెడ్యూల్‌కు భిన్నంగా పరిశ్రమలు (థర్మాల్ పవర్ ప్లాంట్, సోలార్ ప్లాంట్, సిమెంట్ ఫ్యాక్టరీలు వివిధ కార్ఖానాలు) యాదేచ్చగా ఏర్పాటు చేస్తూ ఆదివాసులను నిర్వాసితులను చేస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా యువకులు, మహిళలు, విద్యార్థులు, విద్యావంతులు, ఆదివాసులంతా పోరాడుతున్నారు.

ఈ పోరాటాలను అణచివేయడానికి, మావోయిస్టు అణచివేత పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ 'సమాధాన్', నిఘా, స్టిక్ పేరుతో జిల్లా అంతటా ఏజెన్సీ ప్రాంతాల్లో భౌతిక దాడులు చేస్తూ అమాయక ప్రజలను అరెస్టు చేయడం, తప్పుడు ఆరోపణలతో కేసులు పెట్టి, కోర్టుల చుట్టూ తిప్పడం, జైళ్ళో నిర్బంధించడం సర్వసాధారణం అయ్యింది. గ్రామ గ్రామాన పోలీసు నిఘా పెరిగింది. గ్రామ పోలీస్, ఇన్ఫార్మార్ (నెట్‌వర్క్), ఇంటలీజెన్సీ, సీసీ కెమెరాలు మొదలగు పద్ధతులతో మోటర్ సైకిల్‌పై పెట్రోలింగ్ చేస్తూ నిరంతరం గ్రామాలను జల్లెడ పడుతున్నారు. రెగ్యూలర్ కూంబింగ్స్, స్పెషల్ ఆపరేషన్స్ సంవత్సరం పొడవునా ఐజీ పర్యవేక్షణంలో, మధ్య మధ్య డిజిపి పర్యవేక్షణంలో సమావేశాలు, సమీక్షలు జరిపి మావోయిస్టు ఉద్యమాన్ని అణచివేయడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

అడవి, మైదాన గ్రామాలు, పట్టణాలు, రహదారులు, నది తీరాలు పూర్తిగా పోలీసు చెకింగులతో పహారాతో ఉంది. జిల్లా అంతటా పోలీస్ రాజ్యం నడుస్తుంది. ఇందులో భాగంగా గతంలో ఉద్యమ అణచేతలో పాల్గొన్న కౄరులైన అధికారులను మళ్లీ ఉద్యమ ప్రాంతాలకు బదిలీ చేసి ఎస్‌ఐబి పదవి విరమణ చేసిన ఆఫీసర్లను మోహరించి ఏఎస్‌పి, ఓఎస్‌డి, ఎస్‌పి, ఐజి, డిఐజి, ఎస్‌ఐబి, యన్‌ఐఎ లాంటి ఆఫీసర్లతో సమావేశాలు నిర్వహించి విప్లవోద్యమాన్ని అణచివేయడానికి కుట్ర చేస్తున్నారు.

జిల్లాలో విప్లవోద్యమం నూతన పద్ధతులలో నిర్మించబడుతున్నది. గత కొన్ని సంవత్సరాలుగా మావోయిస్టులను అణచివేస్తామని, వారు జిల్లాలో లేరని చెబుతూ వచ్చిన ప్రభుత్వం 2020లో మావోయిస్టు

*(మిగతాది **15**వ పేజీలో...)*

# మయన్మార్‌లో సైనిక తిరుగుబాటుకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నిరసన ప్రదర్శన

మయన్మార్‌లో గత నవంబర్ 8న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 83% ఓట్లతో నేషనల్ లీగ్ ఆఫ్ డెమక్రసీ (యన్‌యల్‌డి) గెలిచింది. యన్ఎల్‌డి ప్రభుత్వాన్ని మళ్ళీ 3 నెలలకే సైనిక కుట్ర ద్వారా జనవరి ఒకటిన సైన్యం కూల్చి వేసింది. ఎన్నికలలో అక్రమాలు జరిగాయన్న ఒకే ఒక సాకుతో సైన్యం అధికారాన్ని హస్తగతం చేసుకుంది. అంగ్‌సాన్ సూకీతో పాటు కీలక నేతలను నిర్బంధించారు. రాజధానితో పాటు నగరాలలో మొబైల్, ఇంటర్నేట్ సేవలు స్థంబింపజేసింది. టివి ప్రసారాలపై ఆంక్షలు విధించింది. విమానాశ్రమాలను మూసివేసింది. దేశం లోపలికి, బయటికి రాకపోకలు నిలిపివేసింది. మరల పాత పరిస్థితి నెలకొంటున్నది. సైనిక కవాతులు ప్రతిధ్వనిస్తున్నాయి.

ప్రస్తుత సైన్యాధిపతి మిన్ అంగ్ హేలింగ్ సర్వాధికారాలు చెలాయిస్తున్నాడు. 2016 నుండి 2021 జనవరి 1 వరకు (సైనిక కుట్ర జరిగే వరకు) సూకీ నాయకత్వంలోని పార్టీ, సైన్యం ఉమ్మడిగా అధికారంలో కొనసాగాయి. బూర్జువా ప్రజాస్వామ్య నియమం అది ఎక్కడా అమలు కాలేదు ముఖ్యంగా మయన్మార్‌లో మొదటి నుండి లేదు.

మయన్మార్‌లో సైనిక తిరుగుబాటుకు వ్యతిరేకంగా పెద్దఎత్తున జరిగిన నిరసన ప్రదర్శనల మీద, ప్రజల మీదనే సైన్యం డైరెక్టుగా కాల్పులు జరపడంతో ఇప్పటికే 500 మంది పైగా చనిపోయారు. గాయాలైన వారి సంఖ్యలు చెప్పడం లేదు. ఈ నిరసనల్లో విద్యార్థులు, యువత, మహిళలతో పాటు అన్ని వర్గాల ప్రజలు పాల్గొంటున్నారు. దేశంలోని అన్నీ రాష్ట్రాలకు ప్రజా ఉద్యమం విస్తరించింది.

'సైనిక నియంత్రణను ఓడిద్దాం-ప్రజాస్వామ్యాన్ని గెలిపిద్దాం .'ఇదే నినాదం నేడు బర్మా అంతటా మారుమోగుతుంది. ప్రపంచ దేశాల నుండి అన్ని రకాల ప్రజాస్వామిక శక్తులు మద్దతును అందిస్తున్నారు. రాజకీయ ఖైదీల విడుదల కోసం గొంతు కలుపుతున్నారు. సైబర్ స్పేస్‌లోను భారీ నిరసన వ్యక్తమవుతుంది.

చైనాను వ్యతిరేకిస్తూ రాజధాని యాంగూన్‌లోని చైనా రాయబార కార్యాలయం ఎదుట ఆందోళనకారులు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. మయన్మార్‌లో సైనిక నియంతలు మరింత ఉన్మాదులుగా మారుతున్నారు.

సాయుధ దళాల గౌరవార్థం జరిగిన దినోత్సవం నాడు ప్రజలు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు జరిపారు. ఆ రోజున జరిపిన విచక్షణా రహిత కాల్పుల్లో 114 మంది చనిపోగా తాజాగా జనవాసాలపై విమాన దాడులు జరిగాయి. వీధుల్లోకి ఎవరు రాకూడదని, కనబడితే కాల్చివేస్తున్నారు.

మొత్తంగా 500 మందికి పైగా చనిపోయారు. వేల సంఖ్యలో గాయపడ్డారు. 3వేల మందికి పైగా జైళ్ళలో నిర్బంధింపబడ్డారు. ఇంక నరమేధం కొనసాగుతూనే ఉంది. అదృశ్యాలు పెరుగుతున్నాయి.

మయన్మార్ బహుళజాతుల నిలయం. సాయుధ పోరాట బాట పట్టిన 15 జాతులలో 8 జాతుల నాయకత్వంతో ప్రభుత్వం చర్చలు జరిపినప్పటికి, రోహింగ్యాలతో పాటు మరికొన్ని జాతులు పోరాడుతూనే ఉన్నాయి.

## చరిత్రలో మయన్మార్

1937లో బ్రిటీష్ ఇండియా నుంచి బర్మాను (మయన్మార్) విడదీశారు. 1942లో రెండవ ప్రపంచ యుద్ధకాలంలో జపాన్ బర్మాను ఆక్రమించింది. జపాన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా యువకుడైన అంగ్‌సాన్ 1944లో 'యాంటి ఫాసిస్టు పీపుల్స్ ఫ్రీడమ్ లీగ్' (ఎ.ఎఫ్.పి.ఎఫ్.ఎల్.) ఏర్పాటు చేశారు. 1945లో బ్రిటిష్ సైన్యాలు బర్మాలో ప్రవేశించాయి. ఎఎఫ్‌పిఎఫ్ఎల్ సాయుధ దళాల సహాయంతో జపాన్ ఆక్రమణ నుండి బర్మాను బ్రిటన్ విముక్తి చేసింది. జపాన్ సామ్రాజ్యవాదులకు బ్రిటన్ సామ్రాజ్యవాదులకు మధ్య గుణాత్మక తేడా లేదని గమనించిన ఎఎఫ్ఎఎఫ్ఎల్ బ్రిటన్‌తో సాయుధ ఘర్షణకు దిగింది. దీంతో బ్రిటిష్ ప్రభుత్వం దిగివచ్చి అంగ్‌సాన్‌ను, ఆయన నలుగురు అనుచరులను గవర్నర్ కార్యనిర్వాహక కౌన్సిల్‌లోకి తీసుకుంది. బ్రిటన్‌లో 1947 జనవరి 27న అట్లీ-అంగ్‌సాన్ మధ్య ఒప్పందం కుదిరింది. 1947 ఏప్రిల్‌లో రాజ్యాంగ సభకు ఎన్నికలు జరిపింది. బ్రిటిష్ వాళ్లు ఎంత ప్రయత్నించినా రాజ్యాంగ సభకు ఎన్నిక కావల్సిన 240 స్థానాల్లో 194 స్థానాలు ఎఎఫ్ఎఎఫ్ఎల్‌కు లభించాయి. రాజ్యాంగ పరిషత్ బర్మా సంపూర్ణ స్వతంత్ర ప్రతిపత్తిని బ్రిటన్ గుర్తించాలని తీర్మానించింది. ఈ తీర్మాణం చేసిన కొద్ది రోజుల్లోనే 1947 జూలై 19న ఒక కిరాయి హంతకుల ముఠా అంగ్‌సాన్ మరియు అతని తాత్కాలిక ప్రభుత్వంలోని ఆరుగురు మంత్రులను హత్య చేసింది. దీని వెనుక బ్రిటన్ హస్తముంది. దేశ వ్యాప్తంగా బ్రిటన్ వ్యతిరేక ఆందోళనలు జరిగాయి. ప్రజాందోళనకు తలవొగ్గి బర్మాకు అది వివేశ ప్రతిపత్తిని ప్రసాదించింది. యూన్ నాయకత్వాన 1948 జనవరి 4న బర్మా రిపబ్లిక్‌గా ఏర్పడింది.

1962లో జనరల్ నేవిన్ ఆధ్వర్యంలో సైన్యం తిరుగుబాటు చేసి యూన్‌ను అధికారం నుంచి తొలగించి, సైనిక నియంత అధికారంలోకి వచ్చాడు. జనరల్ నేవిన్ 26 సంవత్సరాలు బర్మాను నిరంకుశంగా పాలించాడు. అన్ని పార్టీలు నిషేధించబడ్డాయి. 1974లో నూతన రాజ్యాంగం అమలులోకి వచ్చింది. అధికారం సైన్యం నుండి పీపుల్స్ అసెంబ్లీకి బదిలీ అయింది. 1988లో జనరల్

సామాంగ్ నేతృత్వంలో మరోసారి సైనిక తిరుగుబాటు జరిగింది. దివంగత అంగ్‌సాన్–కుమార్తె అంగ్‌సాన్ సూకీ 'నేషనల్ డెమోక్రటిక్ లీగ్' పార్టీని 1988లో స్థాపించింది. 1989లో బర్మా పేరును మయన్మార్‌గా, రాజధాని రంగూన్ పేరును యాంగూన్‌గా మార్చారు. సైన్యం సూకీని గృహ నిర్బంధం చేసింది. దాదాపు 30 సంవత్సరాల తర్వాత 1990లో జరిగిన మొదటి ఎన్నికల్లో సూకీ పార్టీ ఎన్‌ఎల్‌డి 80 శాతం స్థానాల్లో గెలిచింది. మిలిటరీ జుంటా ఫలితాలను గుర్తించ నిరాకరించింది. 2010లో సూకీ ఎన్నికల్లో పాల్గొనకుండా నూతన ఎన్నికల చట్టాన్ని సైన్యం తెచ్చింది. సూకీ నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ (ఎన్ఎల్‌డి) ఎన్నికలు బహిష్కరించింది. మయన్మార్ స్వాతంత్ర్యం పొందాక 1962లో, 1988లో సైనిక కుట్రల పాలబడింది. మూడోసారి జనవరి 1న మళ్లీ కుట్రకు పాల్పడింది. ఎన్‌ఎల్‌డి నేత సూకీ దాదాపు 20 సంవత్సరాలు జైలు, గృహ నిర్బంధంలో గడిపింది.

2020 నవంబర్ ఎనిమిదవ తేదీన మయన్మార్ ప్రజా ప్రతినిధుల సభలోని 440కి గాను 315, జాతులకు ప్రాతినిధ్యం వహించే ఎగువ సభలోని 224కి గాను 161 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. అత్యధిక స్థానాలను ఎన్‌ఎల్‌డి సాధించింది. ప్రజాప్రతినిధుల సభలో 258, జాతుల సభలో 139 సీట్లు పొంది పూర్తి మెజారిటీని సాధించింది. మిలిటరీ మద్దతు ఉన్న డెవలప్‌మెంట్ పార్టీకి ప్రతినిధుల సభకు 26 స్థానాలను చిన్న పార్టీలు పొందాయి. రాష్ట్ర, ప్రాంతీయ ఎన్నికల్లో కూడా ఎన్‌ఎల్‌డి ఇదే మాదిరి ఘనవిజయం సాధించింది.. 2008లో రాజ్యాంగ సవరణ ప్రకారం ఎన్నికలలో మయన్మార్ పౌరులు మాత్రమే అర్హులు. జాతీయ, రాష్ట్రాల చట్ట సభల్లో మూడోవంతు సీట్లు మిలిటరీకి రిజర్వు చేశారు. ఎన్నికల అనంతరం ఏర్పడే జాతీయ ప్రభుత్వంలో రక్షణ, సరిహద్దులు, హోంశాఖల మంత్రులుగా మిలిటరీ నియమించిన వారే ఉండాలి.

మయన్మార్ జాతీయులను కాని వారిని వివాహం చేసుకున్న వారు, మయన్మార్ పౌరసత్వం లేని వారి పిల్లలు గానీ ఈ పదవులకు అనర్హులు. ఈ నిబంధన కారణంగా బ్రిటిష్ జాతీయుడిని వివాహం చేసుకున్న అంగ్‌సాన్ సూకీ ఎంపీగా, ఇతర పదవులను మాత్రమే చేపట్టవచ్చు తప్ప దేశ అధ్యక్షురాలయ్యే అవకాశం లేదు. ఆమె పిల్లలకు మయన్మార్ పౌరసత్వం లేనందున వారు కూడా అనర్హులే. ఈ క్రమంలో గత నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో ఎన్నికైన వారు మార్చి 21న పదవి బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం అమలులో ఉన్న ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాలని మిలిటరీ చేసిన సూచనను మెజారిటీ సీట్లు తెచ్చుకున్న ఎన్‌ఎల్‌డి తిరస్కరించింది. పార్లమెంట్ సమావేశ నిర్వహణకు ముందే ఆ పార్టీకి చెందిన నాయకులందరిని నిర్బంధించి తాము అధికారాన్ని హస్తగతం చేసుకున్నట్లు మిలిటరీ ప్రకటించింది. మయన్మార్ చరిత్రను చూసినా దాని ప్రస్తుత రాజ్యాంగాన్ని చూసినప్పటికీ మిలిటరీదే పైచేయిగా ఉందని చెప్పవచ్చు.

మయన్మార్ రాజ్యాంగం ప్రకారం ఎన్నికైన పార్టీ వారికి 75 శాతం పదవులు ఇచ్చి ఇరువై ఐదు శాతం పదవులు సైన్యం నియమించిన వారికి ఇస్తారు. ఈ ఎన్నికలలో ఎన్‌ఎల్‌డి 476 సీట్ల జాతీయ అసెంబ్లీలో అత్యధికంగా 369 సీట్లు గెలిచింది. సైన్యం బలపర్చిన డెవలప్‌మెంట్ పార్టీ కేవలం 33 సీట్లు మాత్రమే గెలిచింది. ఎన్‌ఎల్‌డి పార్టీకి రాజ్యాంగానికి సవరణలు చేసే మూడింట రెండు వంతులు మెజారిటీ ఉంది. ఈ ఫలితాల వలన సైన్యం ప్రాధాన్యత తగ్గిపోతుందని భావించిన సైన్యం ప్రజాస్వామ్యంపై దాడి చేసింది.

మొదటి నుంచి సైన్యానిదే ఆధిపత్యం:

ఇంచుమించు మనతో పాటు బ్రిటిష్ వారి నుంచి విముక్తి పొందిన మయన్మార్‌లో 1948 జనవరి 4వ తేదీ నాటి నుంచీ ప్రజాస్వామ్యం పాదుకొనకుండా మిలిటరీ కండబలం చూపుతూనే ఉన్నది. అప్పటి నుండి అడపా తడపా సైనిక నియంతలు ఎన్నికల తతంగాన్ని నడిపిస్తూనే ఉన్నారు. 1980లో జరిగిన ఎన్నికల్లో ఎన్‌ఎల్‌డి 80శాతం స్థానాలు గెల్చుకోగా సైన్యానికి మింగుడుపడక వాటిని రద్దు చేశారు. ఎప్పటి లాగానే సైనిక పాలన కొనసాగింది. ఆంగ్‌సాన్ హత్య జరిగినప్పుడు రెండేండ్ల చిన్నారి అయిన సూకీ తల్లి సంరక్షణలో విదేశాల్లో గడిపింది. 1988లో స్వదేశానికి తిరిగి వచ్చి ప్రజాస్వామిక ఉద్యమాలకు ప్రాణం పోసి సైనిక పాలనకు

వ్యతిరేకంగా గళం విప్పింది. ఒక చిన్న దేశంలో ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడానికి సూకీ తండ్రి గతంలో ప్రజాస్వామ్యం కోసం పోరాడిన యోధుడు. ఆయన కమ్యూనిస్టు. ఆయన పోరాట వారసత్వాన్ని సూకీ కొనసాగిస్తున్నారు. పౌర, ప్రజాస్వామిక హక్కుల కోసం సూకీ చేసిన శాంతియుత పోరాటానికి ప్రపంచ వ్యాప్తంగా మద్దతు లభించింది. మొక్కవోని దీక్షకు గుర్తింపుగా 1991లో నోబెల్ శాంతి బహుమతి లభించింది. అంతర్జాతీయ మద్దతుతో స్వదేశంలోని సైనిక నియంతలపై సాగించిన పోరాటంలో సుదీర్ఘ నిర్బంధాన్ని అనుభవించిన మహిళా నేత అంగ్ సాన్ సూకీ.

మయన్మార్ గత చరిత్రను పరిశీలిస్తే ప్రజాస్వామ్యం కోసం అక్కడ అనేక సంవత్సరాల నుంచి పోరాటం జరుగుతూనే ఉన్నది. మయన్మార్‌లో గత ఐదు దశాబ్దాలుగా మిలిటరీ అన్నింటా ఆధిపత్యం నెరపుతున్నది.


రోహింగ్యాల ఉచకోత విషయంలో మిగతా ప్రపంచం బర్మాను తీవ్రంగా తప్పుబడుతుంటే చైనా బలంగా వెనకేసుకొచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు బర్మాలో జరిగిన దానిని చైనా అధికారిక మీడియా సైనిక కుట్ర అనడం లేదు. సూకీని గద్దెదించేయడం, నిర్బంధించడం, అధికారాన్ని మిలటరీ లాక్కోవడం వంటివన్నీ

*(మిగతాది **30**వ పేజీలో...)*

# నయా ఉదారవాద విధానాలను తిప్పికొట్టడం ద్వారానే

# విశాఖ ఉక్కు పరిశ్రమను రక్షించుకోగలుగుతాం!

మోడీ ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించాలని నిర్ణయించింది. జనవరి 27న కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీ.సీ.ఈ.ఏ) సమావేశం ఉక్కు పరిశ్రమతోపాటు, దాని అనుబంధ సంస్థలలో నూటికి నూరు శాతం పెట్టుబడులు ఉపసంహరిస్తున్నట్లు సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయానికనుగుణంగానే ఉక్కు పరిశ్రమ అమ్మకానికి ప్రభుత్వ ఉన్నతాధికారులు దక్షిణ కొరియా కార్పొరేట్ సంస్థ పోస్కో (పోహాంగ్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ)తో సంప్రదింపులు కూడా జరిపారు. మరోవైపు భారత దళారీ, నిరంకుశ బూర్జువా వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ముఖ్యుడు ఆదానీతో కూడా కొన్ని లావాదేవీలు జరిగాయి. ఇంత జరుగుతున్నా, ఈ విషయాలేవి ఉక్కు పరిశ్రమ కార్మికులకు గానీ, గతంలో ఆ పరిశ్రమవల్ల నిర్వాసితులైన వారికి గానీ, విశాఖ ప్రజలకు గాని ఏ మాత్రం అర్థం కాకుండా తమ విక్రయ కార్యకలాపాలను గుంభనంగా నిర్వహించారు. అయితే రాష్ట్రంలో జగన్ ప్రభుత్వానికి ఈ విషయాలేవి అర్థం కాలేవనుకోవడం అమాయకత్వమే అవుతుంది. ఈ లోపాయికారి వ్యవహారాలన్నీ నడుస్తున్న క్రమంలోనే నెలన్నరకు విశాఖ ఉక్కు పరిశ్రమ అమ్మకానికి సంబంధించిన అధికార ప్రకటన వెలువడింది. దీంతో విశాఖ ఉక్కు పరిశ్రమతోపాటు, విశాఖ నగరమంతా ఒక్కసారి భగ్గుమన్నది. కార్మికుల, నిర్వాసితుల, ప్రజల ఆగ్రహ జ్వాలలు ప్రజ్వరిల్లాయి.




విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజాఉద్యమం ప్రారంభమవటంతో అవకాశవాదం మూర్తీభవించిన పాలక, ప్రతిపక్ష పార్టీలన్నీ తామెక్కడ వెనకబడిపోతామేమోననే ఆందోళనతో ఉద్యమానికి మద్దతునిచ్చేందుకూ, నాయకత్వం వహించేందుకు పోటీ పడుతున్నాయి. వాస్తవంగా ఈ పార్టీలన్నీ దేశీయ, అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేసేవే. అలాగే నయాఉదారవాద విధానాలలో భాగంగా అమలయ్యే ప్రైవేటైజేషన్‌కు కూడా ఇవి వ్యతిరేకం కావు. అయితే విశాఖ ఉక్కు ప్రైవేటైజేషన్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రారంభమైన ప్రజల కదలికను ఈ పార్టీలన్నీ గమనించి, ఆ ప్రజల కదలికనూ, ప్రజాఉద్యమాన్ని రాబోయే ఎన్నికలలో సొమ్ము చేసుకొనేందుకు దానికి మద్దతుగా ముందుకు వస్తున్నాయి, నాయకత్వం వహించేందుకు పోటీ పడుతున్నాయి. ఇటువంటి అవకాశవాద ధోరణితోనే బీ.జే.పీ పార్టీతో సహా పాలక, ప్రతిపక్ష పార్టీలన్నీ విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరిస్తే ఆందోళనకు దిగుతామంటున్నాయి. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అసెంబ్లీలో తీర్మాణం చేసి, ప్రధాని వద్దకు అఖిలపక్ష ప్రాతినిధ్యాన్ని పంపుతానంటున్నాడు. ప్రధానికి మొక్కుబడిగా ఒక లేఖ కూడా రాసాడు.

రాష్ట్రంలో పార్లమెంటరీ పార్టీలన్నీ ఇంత ఆర్భాటం చేస్తున్నా, ఆ పార్టీల స్వభావం, వాటి నాయకుల వ్యక్తిగత బలహీనతలు ఎరిగివున్న మోడీ ప్రభుత్వం మాత్రం, తన నిర్ణయంలో ఎటువంటి సడలింపును ఇవ్వడంలేదు. పార్లమెంటులో వై.ఎస్.ఆర్.సీ.పీ, టీ.డీ.పీలకు చెందిన ఎమ్.పీలు విశాఖ ఉక్కు ప్రైవేటైజేషన్‌పై అడిగిన ప్రశ్నలకు ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ సూటిగానే సమాధానం చెప్పింది. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వలన పరిశ్రమ విస్తరణ, సామర్థ్యం పెంపు, ఆధునిక టెక్నాలజీ వినియోగం, మెరుగైన యాజమాన్య పద్ధతులు సమకూరుతాయనీ, దీనివల్ల పెద్దఎత్తున ఉత్పత్తి, ఉత్పాదకత పెరగడమేకాక ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతాయని బల్లగుద్ది చెప్పింది. కానీ విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తూ, ప్రైవేటీకరణ సాధించే అభివృద్ధినంతా ప్రభుత్వమే ఎందుకు సాధించలేకపోయిందో మాత్రం చెప్పలేదు. మోడీ ఇంకో అడుగు ముందుకేసి 'ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ, ప్రైవేటీకరణ'లపై ఏర్పాటైన ఒక వెబినార్‌లో, '50–60 ఏళ్ళ కిందట ప్రభుత్వరంగ సంస్థలు మంచివే కానీ, ప్రస్తుతం వాటికి కాలం చెల్లిందనీ, వాటి భారాన్ని ప్రభుత్వం మోయలేదనీ, కనుక మారుతున్న ప్రపంచ పరిస్థితుల్లో

ప్రభుత్వరంగాన్ని ప్రైవేటీకరించడం తప్పదని' తేల్చి చెప్పాడు. వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగిన నాలుగు రంగాల(అణుశక్తి-రక్షణ-అంతరిక్ష రంగం, రవాణా, టెలీ కమ్యూనికేషన్లు, విద్యుత్-ఇంధనం-వివిధ రకాల ఖనిజాలు, బ్యాంకింగ్-ఇన్సూరెన్స్-ఆర్థిక సేవలు)లోని అతికొద్ది సంస్థలను మినహా, మిగిలిన అన్ని ప్రభుత్వరంగ సంస్థల(పీ.ఎస్.యూ)ను అమ్మేస్తామని ప్రకటించాడు. వ్యూహాత్మక రంగాలకు చెందిన సంస్థలలో కూడా అతితక్కువ స్థాయిలో ప్రభుత్వ ప్రమేయం ఉంటుందని వివరించాడు. పీ.ఎస్.యూల విక్రయం ద్వారా రూ॥ 2.5 లక్షల కోట్లను ఆర్జించాలన్నది ప్రభుత్వ ఉద్దేశమనీ, ఈ ప్రజాధనాన్ని 'సద్వినియోగం' చేయాల్సిన అవసరం ఉందని వెల్లడించాడు. మొత్తం సారాంశంలో మోడీ చెప్పిందేమిటంటే 'ప్రభుత్వ విధి వ్యాపారం చేయడంకాదనీ, వ్యాపారానికీ, వాణిజ్యానికి ఊతమివ్వడమేననే' కల్తీలేని నయాఉదారవాద సిద్ధాంతాన్ని ప్రజలముందుంచాడు.

పార్లమెంటులో నిర్మలాసీతారామన్ ప్రకటనతోపాటు, ప్రధానంగా మోడీ వెబినార్ ప్రకటన వెలువడటంతో ఏ.పీకి చెందిన బీ.జే.పీ, వై.ఎస్.ఆర్.సీ.పీ పార్టీలు సన్నాయి నొక్కులు నొక్కటం ప్రారంభించాయి. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విషయం కేంద్ర ప్రభుత్వ విధానపరమైన నిర్ణయంలో భాగం కనుక, పైగా ఆ పరిశ్రమ నష్టాలతో కూడా నడుస్తున్నది కనుక ప్రైవేటీకరణ తప్పదనీ, అయితే దానిపై ఆధారపడి బ్రతికే కార్మికులకూ, ఇతర శ్రామికులకు ప్రయోజనం కలిగేలా కేంద్ర ప్రభుత్వం తగిన నిర్ణయాలు తీసుకుంటుందని మోసపూరిత వ్యాఖ్యానాలు చేస్తున్నది. ఏ.పీ ముఖ్యమంత్రి జగన్ ముందుగా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రంకెలు వేసినప్పటికీ, ప్రధానమంత్రి ప్రకటనతో ఒక అడుగు వెనక్కి వేసి, విశాఖ పోరాటకమిటీ నాయకులతో మాట్లాడుతూ 'స్టీల్ ప్లాంట్ మిగులు 7వేల ఎకరాలను అమ్మి అప్పులు తీర్చేయవచ్చని' అన్నాడు. అంతేకాక 'షేర్ మార్కెట్‌లో స్టీల్ ప్లాంట్ వాటాలను లిస్టింగ్‌కు కూడా పెట్టవచ్చునని' ఒక దగుల్బాజీ సూచన కూడా చేసాడు. జగన్ ఇస్తున్న ఈ మధ్యేమార్గపు సలహాలు, సూచనలు అంతిమంగా విశాఖ స్టీల్ ప్లాంటును ప్రైవేటీకరించడానికే తప్ప మరి దేనికీ పనికిరావు. ఆనాడు విశాఖ ప్లాంటును నిర్మించేందుకు ఇళ్ళస్థలాలు, పొలాలు ఇచ్చి జీవిక కోల్పోయిన నిర్వాసితులకు నష్టపరిహారంలో భాగంగా కుటుంబానికి ఒక ఉద్యోగం ఇవ్వడానికి ఒప్పుకున్నారు. మొత్తం 16వేల 5 వందల కుటుంబాలకు 'ఆర్' (రీ హాబిలిటేషన్) కార్డ్ కేటాయించారు. ఈ 40 ఏళ్ళలో కేవలం 8వేల 5వందల మందికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయి. మిగిలిన 8వేల మందికి తరాలు మారుతున్నా ఇంతవరకూ ఉద్యోగాలు రాలేదు. 'ఆర్' కార్డ్ తాత నుంచి తండ్రికీ, తండ్రి నుంచి మనవడికి బదిలీ అవుతోంది తప్ప, ఉద్యోగాలు రాలేదు. జగన్ ఈ విషయాలను పరిగణలోకి తీసుకోకుండా భూములు అమ్మాలని ఇచ్చిన ఉచిత సలహా ఎవరికి పనికొస్తుందీ? ఇక విశాఖ స్టీల్ ప్లాంట్ వాటాలను లిస్టింగ్‌లో పెడితే జరిగే పరిణామమేమిటీ? గతంలో విశాఖలో ఉన్న పబ్లిక్ రంగ సంస్థ హిందుస్థాన్ జింక్ పరిశ్రమలో 10% వాటాలు అమ్మకంతో ప్రారంభించి జింక్ పరిశ్రమను వేదాంత కార్పొరేట్ కంపెనీకి పూర్తిగా అప్పగించలేదా! నేడు వేదాంత సంస్థ ఆ కంపెనీని మూసివేసి, కార్మికులను వీధులపాలు చేసి, సంస్థకు సంబంధించిన భూములతో రియలెస్టేట్ వ్యాపారం చేస్తూ, వందల, వేల, కోట్ల రూపాయలు సంపాదించడం లేదా! రేపు విశాఖ ఉక్కుకు కూడా ఈగతే పట్టదా! ఈవాస్తవాలన్నీ కళ్ళముందు కనిపిస్తున్నా, జగన్ మాత్రం కేంద్ర ప్రభుత్వానికి ఇబ్బందిలేని ఒక ఉచిత సలహాను పారేసి తన దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గబుద్ధిని ప్రదర్శించాడు.

ఇక రాష్ట్రంలో ప్రతిపక్షపార్టీగా ఉన్న చంద్రబాబు విశాఖ ఉక్కు ప్రైవేటైజేషన్‌పై కేంద్రప్రభుత్వ ప్రకటన వెలువడగానే తీవ్రంగా స్పందిస్తూ, 'విశాఖ ఉక్కును తుక్కు కింద అమ్మేసి, రియలెస్టేట్ వ్యాపారానికి కేంద్రం పూనుకుంద'ని గంభీరంగా మాట్లాడుతూ హైడ్రామాకు తెర లేపాడు. వాస్తవంగా నయాఉదారవాద విధానాలైన లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్‌లను 'అభివృద్ధి' పేరుతో ఆంధ్రప్రదేశ్‌లోకి తీసుకువచ్చి దేశీయ, అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థలు రాష్ట్ర సహజ వనరులనూ, శ్రామికుల శ్రమశక్తిని దోచుకునేందుకు వాటికి దళారీగా పని చేసింది ఈ చంద్రబాబే. నేడు మాత్రం చంద్రబాబుతో సహా, తెలుగుదేశం నాయకులంతా విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటైజేషన్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో తమ ప్రాణాలైన ఇస్తామంటున్నారు. ఇదంతా ఒక నాటకమే. రాబోయే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల నాటికి తమ ఓట్ల బ్యాంకును పెంచుకొనేందుకు చేసే సర్కస్‌ఫీట్లే ఈ హంగామా అంతా. ఇక బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు బీ.జే.పీతో వ్యూహాత్మక భాగస్వామ్యం కలిగివున్న పవన్ జనసేన పార్టీ నుంచి పోరాడే ప్రజలు కొత్తగా ఆశించేదేమి ఉండదు.

**విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యమం ముందున్న సవాళ్ళు**

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆరంభమైన ప్రజాఉద్యమం ముందు నేడు అనేక సవాళ్ళున్నాయి. ఇప్పటికే గుంటకాడి నక్కల్లా కాచుక్కూచున్న పార్లమెంటరీ పార్టీలన్నీ ఈ ఉద్యమంలోకి జొరబడి దాన్ని నీరుగార్చేందుకు చేసే కుటిల ప్రయత్నాలు ఒక సవాల్ అయితే, ఆ ఉద్యమాన్ని ఒక స్పష్టమైన రాజకీయ లక్ష్యంతో నడపటం ఒక ముఖ్యమైన సవాలుగా ఉంటుంది. ఎందుకంటే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ సమస్య ఏ రాజకీయ నేపథ్యం నుంచి ఉత్పన్నమయిందో ఆ రాజకీయ నేపథ్యానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని నడపకుండా విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోవటం సాధ్యం కాదు. ఇప్పటికే ఆ ఉద్యమంలో ఒక ముఖ్యమైన భూమికను పోషిస్తున్న వామపక్ష పార్టీలు, వాటి ట్రేడ్ యూనియన్‌లు ఆ ఉద్యమానికి ఒక స్పష్టమైన రాజకీయ లక్ష్యం లేకుండా చేసి, షరామాములన్నట్లు సమస్యకే పరిమితమైన యాదృచ్ఛిక ధోరణితో వ్యవహరిస్తున్నాయి. ఈ ప్రమాదాన్ని నివారించేందుకు సమస్య తాలుకూ రాజకీయ మూలాల్లోకి వెళ్ళాలి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని చెబుతున్నప్పటి నుంచి

కేంద్రంలోనూ, రాష్ట్రాలలోను అధికారం నెరిపిన బూర్జువా పార్టీలన్నీ సామ్రాజ్యవాదులకూ, దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలకు సేవ చేస్తూ వచ్చాయి. ఆ వర్గాల ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగపడే విధాన పరమైన నిర్ణయాలను మాత్రమే తీసుకుంటూ వచ్చాయి. మోడీ వెబినార్‌లో మాట్లాడినట్లుగానే 50-60 ఏళ్ళ కింద ప్రభుత్వ రంగ పరిశ్రమలు మంచివే, అవసరమైనవే. ఎందుకంటే అవి దళారీ, నిరంకుశ బూర్జువా వర్గానికి లాభాలు దండుకునేందుకు సేవ చేసాయి కనుక. మోడీ ఈ వాస్తవాన్ని మరుగున పరిచినప్పటికీ, ఇది ఒక చారిత్రక సత్యంగా మన ముందు నిలిచింది. ఆ నాటికి భారత దళారీ, నిరంకుశ బూర్జువావర్గం వద్ద పెట్టుబడి సరుకులు (యంత్రాలు వగైరా) తయారు చేసే భారీ పరిశ్రమలు నెలకొల్పేందుకుగానీ, పెద్ద పెద్ద గనులు తవ్వేందుకుగాని పెట్టుబడులు లేవు. కనుక రాజ్యమే ప్రజాధనంతో ప్రభుత్వరంగ భారీ పరిశ్రమలనూ, గనులను ఏర్పాటు చేసి దళారీ, నిరంకుశ బూర్జువా వర్గానికి అవసరమైన పెట్టుబడి సరుకులతోపాటు, ముడి సరుకులను కారుచౌకగా అందించింది. ఈ క్రమంలో దేశంలోని దళారీ, నిరంకుశ బూర్జువా వర్గం (సీ.బీ.బీ) చాలా శక్తివంతమైంది. మరోవైపు 1980ల చివరికల్లా భారతదేశ ఆర్థికవ్యవస్థ గొంతులోతు అప్పుల్లోకి కూరుకుపోయింది. ఈ అప్పుల ఊబి నుంచి బయటపడేందుకు అప్పటి ప్రధాని పీ.వీ నరసింహారావు ఆర్థిక మంత్రి మన్మోహన్‌సింగ్‌లు సామ్రాజ్యవాదుల ద్రవ్యసంస్థ ఐ.ఎమ్.ఎఫ్‌ను అప్పుకోసం ఆశ్రయించారు. ఐ.ఎమ్.ఎఫ్ అప్పులు ఇస్తూ, భారత ఆర్థిక వ్యవస్థను సామ్రాజ్యవాద ప్రపంచీకరణ సాలెగూట్లోకి గుంజేందుకు విషమ షరతులను పెట్టింది. వాస్తవంగా ఈ షరతులు భారత ప్రజలకు విషమ షరతులేగానీ, ఈ దేశ సీ.బీ.బీ (కాంప్రడార్ బ్యూరాక్రటిక్ బూర్జువా) వర్గానికి మాత్రం 'తంతే గారెలబుట్టలో పడ్డ చందమైంది'. ఈ నేపథ్యంలోనే అంటే ఐ.ఎమ్.ఎఫ్ షరతులలో భాగంగా ఈ దేశ సీ.బీ.బీ వర్గం నయాఉదారవాద విధానాల పేరిట దేశంలోకి విచ్చలవిడిగా జొరబడ్డ సామ్రాజ్యవాదుల పెట్టుబడులకు వాహకంగా ఉంటూ, మరోవైపు ఆ పెట్టుబడులతో మిలాఖతై దేశ సంపదను పందికొక్కుల్లా అడ్డంగా మేసి, 'మహాకాయుడు'గా ఎదిగింది. ఈ పరిస్థితుల్లో నాడు పబ్లిక్‌రంగ సంస్థలుగా ఉన్న భారీ పరిశ్రమలన్నింటినీ తమ ఆధీనంలోకి తెచ్చుకోవాలనుకుంటున్నది. అందుకే దళారీ, నిరంకుశ బూర్జువా వర్గం అభీష్టం మేరకే మోడీ ప్రభుత్వం స్ట్రాటజిక్, నాన్ స్ట్రాటజిక్ అనే తేడా లేకుండా పబ్లిక్‌రంగ సంస్థలన్నింటినీ ప్రైవేటీకరించేందుకు సిద్ధమైంది. అయితే ప్రైవేటీకరణకు సాధికారత పొందేందుకు ఒక వ్యూహాత్మక దృష్టితోనే ప్రభుత్వరంగ సంస్థలను దెబ్బతీస్తూ వచ్చింది. వాస్తవంగా 2009 వరకు కమ్యూనికేషన్ రంగంలో పీ.ఎస్.యూగా ఉన్న బీ.ఎస్.ఎన్.ఎల్ లాభాలతో నడిచింది. కానీ కాంగ్రెస్ హయాం నుండే బీ.ఎస్.ఎన్.ఎల్‌ను నష్టాల ఊబిలోకి నెట్టడం ప్రారంభమై, మోడీ ప్రభుత్వ హయంలో ఆ క్రమం తీవ్రతరమైంది. ముఖ్యంగా ముకేశ్‌అంబానీకి చెందిన జియోకు ప్రధాన్యతనిచ్చేందుకు బీ.ఎస్.ఎన్.ఎల్‌ను ఒక పథకం ప్రకారం దెబ్బతీసింది. దానికి పెద్ద ఎత్తున ఆస్తులున్నప్పటికీ, బ్యాంకులు ఋణం ఇవ్వలేదు. ఆధునీకరణను ఉద్దేశపూర్వకంగా నిలిపివేసింది. ఇంకా అనేక పీ.ఎస్.యూలను ప్రైవేటీకరించే పథకంతో వాటికి తమ పథకాలను అమలు చేసే సీ.ఈ.ఓలను నియమించింది. ఇక విశాఖ ఉక్కుకు ఎప్పటినుంచో ప్రత్యేక గనులు కావాలని స్థానిక అధికారులు, కార్మికులు మొత్తుకున్నప్పటికీ, ఏ మాత్రం ఖాతరు చేయకుండా అది నష్టాల్లో నడుస్తున్నదని నేడు వేలెత్తిచూపుతున్నది. సొంత గనులున్న స్టీల్‌ప్లాంట్లు, ముడి ఇనుము టన్ను ఒక్కింటికి రూ॥ 1600-1800 మధ్య ఖర్చు పెడుతుంటే, విశాఖ ఉక్కు మాత్రం టన్ను ఒక్కింటికి రూ॥ 5000 ఖర్చు పెట్టాల్సి వస్తున్నది. నేడు పీ.ఎస్.యూలపై చూపుతున్న ఈ వివక్ష ఇవాల్టిది కాదు. ప్రపంచీకరణ ప్రారంభమైన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాం నుంచే ఈ వివక్ష ప్రారంభమైంది. మోడీ ప్రభుత్వ హయాంలో అది మరింత ఊపందుకుంది. ఇంత కుట్ర పూరితంగా ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరిస్తున్నప్పటికీ, దేశంలోని 366 పీ.ఎస్.యూలలో 43 మాత్రమే నష్టాల్లో నడుస్తున్నాయి. అయినా మోడీ ప్రభుత్వం పీ.ఎస్.యూల భారాన్ని మోయలేమంటూ ముసలికన్నీరు కారుస్తూ దేశీయ, అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థలకు వాటిని తెగనమ్మేందుకు సిద్ధమైంది.

అయితే నాడు పీ.ఎస్.యూలను ఏర్పాటు చేయడంగానీ, నేడు వాటిని ప్రైవేటీకరించడంగాని దేశ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి పథంలోకి నడిపించేందుకు ఎంత మాత్రమూ కాదు, కేవలం ఈ దేశ దోపిడీ పాలకవర్గమైన సీ.బీ.బీ, దాని యజమానులైన సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసమే. నాటి నుంచి నేటి వరకు పాలకపార్టీలు రూపొందిస్తున్న విధాన పరమైన నిర్ణయాలన్నీ దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాల, వారి యజమానులైన సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసం మాత్రమే. ఈ వాస్తవాలు నేడు ఎంతగా ప్రజల సాధారణ చైతన్యంలోకి ఇంకిపోయాయంటే ప్రభుత్వ ఆర్డినెన్సులు, చట్టాలు పార్లమెంటులో రూపొందించబడటం లేదనీ, అంబానీ, ఆదాని వగైరా సీ.బీ.బీల అధికార నివాసాలలోనే రూపొందించబడుతున్నాయని ప్రజాఉద్యమాలలో పాల్గొంటున్న ప్రజలు బహిరంగంగానే మాట్లాడుతున్నారు. విషయాలు ఇంత స్పష్టంగా బహిర్గతమవుతుంటే మోడీ ప్రభుత్వం పీ.ఎస్.యూలను అమ్మడం ద్వారా వచ్చే 2.5 లక్షల, కోట్ల ధనాన్ని ప్రజాసంక్షేమం కోసం ఖర్చు పెడతానంటున్నది. ఇందులో ఏ మాత్రం వాస్తవంలేదనీ, ఆ నిధులన్నీ వ్యాపారానికీ, వాణిజ్యానికి ఊతం ఇవ్వడంలో భాగంగా సీ.బీ.బీ పరిశ్రమలకు ఉద్దీపనల పేరుతో దారి మళ్ళుతాయనే విషయం కూడా ప్రజలకు స్పష్టమే, ప్రజల చైతన్యంలో ఉన్నదే.

పై విషయాలను దృష్టిలో పెట్టుకుని విశాఖలో ప్రారంభమైన ఉద్యమానికి, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకునే తక్షణ కర్తవ్యంతోపాటు, నయాఉదారవాద విధానాలను తిప్పికొడుతూ, దేశంలో నిజమైన ప్రజాస్వామిక వ్యవస్థను నెలకొలిపే అంతిమ

లక్ష్యం కూడా ఉండాలి. ఈ రాజకీయ అవగాహనకు భిన్నంగా దేశంలో రివిజనిస్టు, నయా రివిజనిస్టు పార్టీలు కార్మికవర్గాన్ని ఆర్థికవాదంపిలోకి దింపాయి. వారి దివాళాకోరు రాజకీయాల వలన దేశంలో కార్మికవర్గం రాజకీయ స్తబ్ధతకు లోనైంది. ప్రస్తుతం మోడీ ప్రభుత్వ హయాంలో ప్రజలు పోరాడి సాధించుకున్న హక్కులు, విలువలు మృగ్యమవుతూ, దోపిడీ వర్గాల ప్రయోజనాలే ప్రజల ప్రయోజనాలుగా భావించాలనే శాసనం (ఫాసిజం) ప్రజల గొంతులపై కత్తిలాగా వేలాడుతున్నప్పుడు విశాఖ ఉక్కు ఉద్యమం అన్ని ప్రజా ఉద్యమాలను కలుపుకొని ఒక రాజకీయ మహోద్యమంగా పురోగమించాల్సిన అవసరం నేడెంతో ఉంది.

ఉద్యమం ఎదుర్కొంటున్న మరో ముఖ్యమైన సవాలేమిటంటే, 1960లలో విశాఖలో స్టీల్‌ప్లాంట్‌ను సాధించుకునేందుకు రాష్ట్రవ్యాపితంగా వచ్చిన స్పందన, సహకారం, సంఘీభావం నేడు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకునేందుకు కనిపించడం లేదనేదే. ఇది కొంత మేరకు వాస్తవం కూడా. 'విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు' నినాదంపై విశాఖలో స్టీల్‌ప్లాంట్‌ను సాధించేందుకు సాగిన ఆ మహోద్యమం 1960వ దశకంలో జరిగింది. 1960వ దశకం, దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాపితంగా ప్రజల ప్రజాస్వామిక చైతన్యంతో వెల్లువెత్తిన ఉద్యమాల దశకంగా చరిత్రలో నమోదైంది. ఆ దశకంలోనే భారతదేశంలో 'నక్సల్బరీ సాయుధ రైతాంగ విప్లవ పోరాటం వసంతకాలపు మేఘగర్జన' అయింది. ఈ ప్రజాస్వామిక, విప్లవ పోరాటాలలో ప్రజలు గొప్ప ప్రజాస్వామిక, సోషలిస్టు చైతన్యంతో కదం తొక్కారు. 'విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు' ఉద్యమం కూడా ఇటువంటి ఉత్తేజంతోనే జరిగింది. ఈ ఉద్యమానికి రాష్ట్ర వ్యాపితంగా ప్రజల క్రియాశీలక మద్దతు లభించింది. 1966 అక్టోబర్‌లో గుంటూరు జిల్లాకు చెందిన తమనంపల్లి అమృతరావు ఆమరణ నిరాహారదీక్షకు కూర్చోవడంతోపాటు, నిరవధిక సమ్మె ప్రారంభమైంది. నవంబర్ 1న 3వేల మందితో జరిగిన ప్రజా ప్రదర్శనపై పోలీసు కాల్పులు జరిగి, 9 ఏళ్ళ బాలుడితో సహా 9 మంది చనిపోయారు. పోలీసులు జరిపిన ఈ కౄరమైన హత్యాకాండ, పోరాడే ప్రజలను ఏ మాత్రం నిలువరించలేకపోయింది. ఉద్యమం రాష్ట్రవ్యాపితంగా అలముకొంది. పలు చోట్ల ప్రజలు సమరశీలంగా ప్రభుత్వంతో, దాని పోలీసులతో తలపడ్డారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లాలో వందలాది మంది విద్యార్థులు పోలీసులతో తలపడగా 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. జగిత్యాలలో పోలీసులు జరిపిన కాల్పుల్లో సాయిరెడ్డి చనిపోయాడు. మొత్తంగా ఈ ఉద్యమంలో 32 మంది పోలీసు కాల్పుల్లో అసువులు బాసారు. ప్రజల ఒత్తిడితో 7గురు ఎమ్.పీలు, 67 మంది ఎమ్.ఎల్.ఏలు తమ పదవులకు రాజీనామ చేసారు. హైదరాబద్, గుంటూరు, విశాఖపట్టణం ఇంకా అనేక పట్టణాలు విద్యార్థుల ఆందోళనలతో అట్టుడికిపోయాయి. అందుకే ఆ ఉద్యమం ఒక విస్తృతమైన, సమరశీల మహోద్యమంలా కొనసాగి కేంద్ర ప్రభుత్వం మెడలు వంచింది. ఆ నాటికి దేశ ప్రధానిగా ఉన్న ఇందిరాగాంధీ 1970, ఏప్రిల్ 10న విశాఖలో 'ఉక్కు పరిశ్రమ'ను ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఆ తర్వాత 2 దశాబ్దాలకు 1992 ఆగస్టులో స్టీల్‌ప్లాంట్ అధికారికంగా ప్రారంభమైంది.

నేడు అదే స్టీల్‌ప్లాంటును ప్రైవేటీకరిస్తుంటే అప్పటి తరహాగా ప్రజలలో విశాలతత్వం, సహకారతత్వం, సంఘీభావం కొరవడి, ప్రస్తుత ఉద్యమానికి తగినంత మద్దతు లభించడంలేదనీ, ప్రజలు ఏ సెక్షన్‌కు ఆ సెక్షన్‌గా, ఏ ప్రాంతానికి ఆ ప్రాంతం వారుగా విభజింపబడి వారిలో సంకుచిత ధోరణులు పెరిగాయనే ఆందోళన కొద్దిమందిలో కనిపిస్తున్నది. వారి ఆందోళనకు భౌతిక పునాది ఉన్నమాట కూడా వాస్తవమే. ప్రస్తుతం రాష్ట్రంలో రాయలసీమ, దక్షిణకోస్తా, ఉత్తరకోస్తా ప్రజలలో భౌగోళిక విభజనే కాకుండా మానసిక విభజన కూడా ఏర్పడి ఉంది. ఇటువంటి మానసిక విభజన ఆ మూడు ప్రాంతాలకే కాకుండా ఇంకా చిన్న చిన్న ప్రాంతాలకూ, వివిధ ప్రత్యేక సామాజిక సెక్షన్లకు విస్తరించి ఉంది. ప్రజలను ఇటువంటి సంకుచిత చట్రాల దిశగా పరిమితం చేయడంలో, 1990ల నుంచి రాష్ట్రంలోకి వ్యాపించిన పోస్టుమాడర్నిస్టు సిద్ధాంత ప్రభావం ఉంది. వాస్తవంగా ప్రాంతాలు, ప్రత్యేక సామాజిక సెక్షన్ల వంటి అస్తిత్వాలు, అస్తిత్వ చైతన్యాలు, వారి పోరాటాలు అంతకు ముందు కూడా ఎంతో కొంత ఉనికిలో ఉన్నవే. అయితే వాటిని సంకుచిత చట్రంలోకి, పార్లమెంటు రాజకీయాల భ్రమల్లోకి నెట్టింది పోస్టుమాడర్నిస్టు సిద్ధాంతమే. అలానే పీడితవర్గ ప్రజలను ఐక్యం కానియకుండా చేసిందీ, వారిని ప్రజాస్వామిక, సోషలిస్టు చైతన్యానికి దూరం చేసింది పోస్టుమాడర్నిజమే. అభివృద్ధి నిరోధక, ప్రతీఘాతుక రాజ్యంపై సామరస్య వైఖరిని కలిపించింది కూడా పోస్టుమాడర్నిస్టు సిద్ధాంతమే. దీనికి రివిజనిజం కూడా తోడైంది. అందుకే ఇది సిద్ధాంత సమస్య. ఈ సమస్య కూడా నేడు 'విశాఖ ఉక్కు పరిరక్షణా' ఉద్యమానికి ఒక సవాలుగానే ఉన్నది. ఈ సవాలును ఎదుర్కోవడానికి సిద్ధాంతరంగంలో కూడా పోరాటం అవసరమే. నేడు 'విశాఖ ఉక్కు సంరక్షణ' ఉద్యమంలో ముందు పీఠిన నిలిచే కార్మికవర్గం తమ వర్గసిద్ధాంతమైన మార్క్సిజంపైనా, దాని సూత్రాలపైన ఆధారపడి విశాల పీడిత ప్రజానీకాన్ని ఐక్యం చేసేందుకు తీవ్రమైన కృషి చేయడం చాలా అవసరం. అప్పుడే పోస్టుమాడర్నిస్టు బూర్జువావర్గ సిద్ధాంత ప్రభావం ప్రజలపై నుంచి క్రమంగా తొలిగి పీడిత ప్రజల ఐక్యత ఏర్పడటంతోపాటు, పోరాటం సమరశీలంగా పురోగమిస్తుంది.

ఇక చివరగా ఉద్యమం ఎదుర్కొనే తీవ్రమైన సవాలు ఫాసిజం. మోడీ ప్రభుత్వం అంతర్జాతీయ, దేశీయ కార్పొరేట్ సంస్థలకు ముఖ్యంగా అంబానీ, అదానీలకు దేశాన్ని ఒక సురక్షితమైన మార్కెట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నది. ఈ సురక్షితమైన మార్కెట్‌లో వారికెటువంటి అవరోధాలు వుండకూడదు కనుక, అందుకవసరమైన చట్టాలను రూపొందిస్తున్నది. ఇప్పటికే పెద్దనోట్ల రద్దు, జీ.ఎస్.టీ, మూడు సాగు చట్టాలు, 44 కార్మిక చట్టాలను మూడు కోడ్‌లుగా బదిలీ, బ్యాంకుల ప్రైవేటీకరణ, పీ.ఎస్.యూల

*(మిగతాది 5వ పేజీలో...)*

# ప్రజల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేసి, ప్రభుత్వ రంగాన్ని మూసి ప్రైవేటు రంగాన్ని తెరకెక్కించిన ప్రజా వ్యతిరేక బడ్జెట్

2021–22 బడ్జెట్ అంచనా 34,83,236 కోట్లు. ఈ బడ్జెట్ అంచనా 32,268 కోట్లు అదనంగా కనబడుతున్నా పెరిగిన ధరలతో పోల్చితే ఇది గతం కన్నా తక్కువ. ఇందులో 12 లక్షల కోట్లు అప్పులున్నాయి. వడ్డీ చెల్లింపులకు 8 లక్షల కోట్లు (1/4 వంతు రాబడి) పోతే మిగిలేది చాలా తక్కువ. 2014లో మోడీ ప్రభుత్వం పగ్గాలు పట్టే నాటికి మొత్తం అప్పు 52 లక్షల కోట్లు. 2020 మార్చి నాటికి 6 సంవత్సరాల కాలంలో అది రెండితలయ్యింది. 109 లక్షల కోట్లకు పెరిగింది. ఇలా ఇది కొనసాగి 2024 నాటికి 150 లక్షల కోట్లకు చేరుతుందని స్టాటిస్టా డాట్‌కమ్ అంచనా. అంటే అప్పుల భారతం విపరీతంగా పెరుగుతుందన్నమాట. నేడున్న భారత దేశ జనాభా (139 కోట్లు) కు 2021 నాటికి తలసరి అప్పు లెక్కగడితే 86 వేల రూపాయలు ఉన్నది. పుట్టే పిల్లలు ఈ అప్పుల భారంతోనే పుడతారు. ఇది మన పాలకులు భవిష్యత్తు తరాలకు అందిస్తున్న గొప్ప కానుక.

నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ పద్దులు చూస్తే ఆరోగ్య రంగం పేరుతో 2,23,846 కోట్లు కేటాయించినా అందులో కేవలం 71,269 కోట్లు మాత్రమే ఆరోగ్య రంగం ఖర్చులున్నాయి. మిగిలిన 1 లక్ష 50 వేల కోట్లు కేటాయింపులు వేరు వేరు అవసరాలకు సంబంధించినవి. గతం కన్నా తక్కువ బడ్జెట్‌తో కరోనా కష్ట కాలంలో ఆరోగ్య సేవలు ఎలా సాధ్యం? ఇది జిడిపిలో 0.3 శాతం మాత్రమే. 2017 బడ్జెట్ సందర్భంగా ఆరోగ్య రంగానికి 3 శాతం కేటాయించాలనే సూచనలు ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఆరోగ్య సంరక్షణలో ప్రపంచంలో మనం 145వ స్థానంలో ఉన్నాం.

మన దేశంలో వ్యవసాయ రంగానికి అన్ని విధాల ప్రాధాన్యత ఉంది. 60 శాతం జనాభా వ్యవసాయం పై ఆధారపడుతున్నారు. జిడిపిలో 15.4 శాతం వ్యవసాయ రంగం నుండే వస్తుంది. బడ్జెట్‌లో 4.3 శాతం నిధుల్ని మాత్రమే కేటాయించారు. గత బడ్జెట్ కన్నా 8.5 శాతం తగ్గించారు. పాలకులకు దేశంలో రైతాంగం పట్ల ఎంత శ్రద్ధ ఉన్నదో ఈ బడ్జెట్ అంచనాలే చెబుతున్నాయి. ఒక పక్కన నూతన వ్యవసాయ చట్టాలను తెచ్చి రైతాంగానికి ద్రోహం చేయడంతో పాటు బడ్జెట్‌లో ఆ రంగాన్ని నిర్లక్ష్యం చేయడం ద్వారా దేశంలో ప్రధాన భాగమైన వ్యవసాయాన్ని ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి నెట్టేసేందుకు పథకం సిద్ధం చేసారన్నది స్పష్టమవుతున్నది. వ్యవసాయాభివృద్ధికి ప్రాధ్యానతనివ్వని, రైతాంగాన్ని ఆత్మహత్యల నుండి బయట పడవేసేందుకు ఉపయోగపడని రైతు వ్యతిరేక బడ్జెట్ ఇది.

సంక్షేమ పథకాలకు గత బడ్జెట్‌లో 111 వేల కోట్లు కేటాయించి, దానిని ఇప్పుడు 75 వేల కోట్లుకు తగ్గించారు. పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టంకు కూడా 3.4 లక్షల కోట్ల నుండి 2 లక్షల కోట్లకు తగ్గించారు. రోజు రోజుకు పేదరికం పెరిగిపోతుంది. ప్రభుత్వం ప్రజల ఆహార భద్రత విషయంలో క్రమంగా దూరమవుతూ ఉంది. ఆయా రంగాలకు ప్రాధాన్యత పెంచాలన్న నిపుణుల సూచనలనుఅసలు లక్ష్యపెటడట్లలేదు. ప్రభుత్వ విధుల్లో ప్రజల అభివృద్ధి, సంక్షేమం ప్రధానమైనవి. అందులో విద్య, వైద్యం రెండు రంగాలు ముఖ్యమైనవి. విజ్ఞానం, ఆరోగ్యం ఉన్నప్పుడు సమాజం చైతన్యవంతంగా అభివృద్ధి చెందుతుంది. కరోనా కల్లోల కాలంలో దేశమంతా విద్య, వైద్య రంగాల విషయంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిచలేదు. ఇప్పుడు కూడా నిర్లక్ష్య ధోరణితో ఉంది. ఈ రంగాలను బలోపేతం చెయ్యాల్సినది పోయి బలహీనపరుస్తున్నారు. మానవ వనరులను కాపాడుకోవడం, వాటిని అభివృద్ధి చేసే లక్ష్యంతో ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోవాలి. కానీ ఈ బడ్జెట్ ప్రతిపాదనలు దానికి వ్యతిరేక దిశలో ప్రైవేటు శక్తులు బలపడే విధంగా ఉన్నాయి. విదేశీ విద్యా సంస్థలకు అధిక ప్రాధాన్యతనిస్తూ స్వదేశీ విద్య పట్ల నిర్లక్ష్యం చూపుతున్నారు.

హెూం–రక్షణ రంగాలు – 2014–15 నుండి చూస్తే ప్రతీ సంవత్సరం ఈ రంగానికి బడ్జెట్‌లో కేటాయింపులు పెరిగి రెండింతలయ్యాయి. జిడిపిలో 2014–15లో 2.29 లక్షల కోట్లు ఉండగా, 2020–21లో 4.78 లక్షల కోట్లుకు పెరిగింది. హెూంకు ఈ బడ్జెట్‌లో 11.48% అధికంగా కేటాయించారు. అందులో 2/3 వంతు కేంద్ర సాయుధ బలగాల కోసం కేటాయించారు.

సబ్సిడీలు తగ్గించిన బడ్జెట్ – పోలీస్, సైనిక బలగాల కోసం బడ్జెట్‌లో పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తూ ప్రజల కోసం ఇచ్చే సబ్సిడీలకు పెద్ద ఎత్తున కోత విధించడం చేస్తున్నారు. ఎరువుల సబ్సిడీ పై 1.30 లక్షల కోట్లు నుండి 0.80 లక్షల కోట్లకు (40%) తగ్గించారు. పిడిఎస్ పై 4.23 లక్షల కోట్లు – 2.43 లక్షల కోట్లకు (43%) తగ్గించారు. ఇందనాలపై 0.38 లక్షల కోట్లు – 0.13 లక్షల కోట్లకు (66%) తగ్గించారు. వంటగ్యాస్, కిరోసిన్ 6.00 లక్షల కోట్లు – 3.36 లక్షల కోట్లకు (45%) తగ్గించారు.

ఈ బడ్జెట్ కేటాయింపులు ప్రజలను నిర్లక్ష్యం చేయడాన్ని స్పష్టపరుస్తున్నాయి.

తీవ్ర ఆర్థిక సంక్షోభం, ఆపైన కరోనా మహమ్మారి విలయతాండవం చేస్తున్న ప్రస్తుత సంక్షోభిత పరిస్థితిలో కొత్త బడ్జెట్ నిరాశ, నిస్పృహలోకి నెట్టింది. అసత్యాలతో, అంకెల గారడీతో ఉన్న ఆ బడ్జెట్‌లో ఉపాధి కల్పన లేకపోగా సామాజిక సంక్షేమ రంగాల పట్ల నిర్లక్ష్య ధోరణి ఉంది. మరల మరల ప్రజలను బాదడం, సంపన్నులకు అధిక లాభాలు

చేకూర్చడం తప్ప కొత్తగా ఇందులో మరేమీ కానరావడం లేదు. అధిక ధరలు, నిరుద్యోగం, పేదరికం ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్నాయి. భారీగా పెరిగిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, వారి కోసం కల్పిస్తున్న సదుపాయాలు అన్నీ మన దేశ సంపదలను, సహజ వనరులను కొల్లగొట్టుకు పోయేందుకు తోడ్పడుతున్నాయి.

మన దేశంలో మన ప్రజలకు భూమి లేకుండా చేసి విదేశీ కంపెనీలకు తక్కువ ధరకు, లీజుకు వేల ఎకరాల భూములను ఉ దారంగా పంచిపెడుతున్నారు. మన దేశ ప్రజలు సాగునీరు, తాగునీరు కొరతతో అల్లాడుతుంటే వారికి మాత్రం ఉచితంగా నీటిని, విద్యుత్‌ను అందిస్తున్నారు. వారి రవాణా అవసరాల కోసమే రహదారులను విస్తరిస్తూ లక్షల కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని ఖర్చు చేస్తున్నారు. వీటన్నింటి కోసం ప్రజలపై పరోక్ష పన్నుల భారాన్ని పెంచుతున్నారు.

జాతి సంపదను తెగనమ్మి స్వయం పోషక ఆర్థిక వ్యవస్థ "ఆత్మ నిర్భర్ భారత్" అంటూ కార్పొరేట్ల సేవలో మన పాలకులు మునిగి తేలుతున్నారు. పేదలను కొట్టి దళారీలకు సేవ చేసే విధానాన్ని అనుసరిస్తూ, అసమానతలను పెంచుతున్న పాలకులే 'అందరి కోసం అందరి వికాసం' (సబ్‌కా సాత్, సబ్‌కీ వికాస్) అంటున్నారు.

దేశంలో అసమాన సంపద పంపకం వలన 100 కార్పొరేట్ల దగ్గర ఉన్న సంపద మన దేశ బడ్జెట్ కన్నా 4 రెట్లు ఎక్కువ. దేశ జనాభాలో 10 శాతం ఉన్న సంపన్నులకు జాతీయ ఆదాయంలో 66 శాతం, 30 శాతం మధ్యమ వర్గాలకు, 23 శాతం 60 శాతంగా ఉన్న పేద, సన్నకారు రైతాంగంకు, కేవలం 11 శాతం మాత్రమే సంపద పంపకం జరుగుతున్నది.

దేశ అభివృద్ధి రేటు గత 70 సంవత్సరాలలో లేనంత కనిష్టానికి తగ్గింది. ద్రవ్యలోటు దిగజారి 9.5 శాతంగా ఉంది. 15 లక్షల కోట్లు ద్రవ్యలోటు ఉన్నది. నిరుద్యోగం గతం కన్నా (45 సంవ్సరాల కన్నా) పెరిగింది. జి.డి.పి ఏడేళ్ళ నాటి కన్నా తక్కువకు (కనిష్టానికి) దిగలాగినా సంపన్నుల ఆస్థులు తగ్గలేదు. నిత్యావసర వస్తువుల ధరలు గరిష్టంగా పెరిగి కుటుంబంలోని అందరూ కూలీ పనులు చేసినా కుటుంబం ఆకలి, కనీస అవసరాలు తీరని పరిస్థితి నెలకొన్నది. ముఖ్యంగా ఆహార ధాన్యాల ద్రవ్యోల్బణం రెండింతలకు చేరి స్థిరంగా నిలబడి పోయింది.

దేశంలో ప్రజాస్వామ్యం అడుగంటినట్లే, మానవాభివృద్ధి కూడా అడుగుకు చేరుకుంటున్నది. ఈ బడ్జెట్ అంచనాల ప్రకారం ద్రవ్యలోటు తగ్గే పరిస్థితి లేదు. జీవన ప్రమాణాలు పెరగడం, ఉపాధి మార్గాలు విస్తరించడం రెండూ మాటల్లో తప్ప ఆచరణలో కానరావడం లేదు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి రంగాలకు కోతలున్నాయి. ప్రజల కొనుగోలు శక్తి పెరిగే మార్గాలు మూసుకు పోయాయి. ఇంక వృద్ధికి అవకాశం లేనే లేదు. సంపన్నుల ఆస్తులు ఎంత పెరిగినా వ్యక్తిగతంగా పెరగడమే తప్ప దేశ ప్రజలకు బరిగేదేమి లేదు. "వ్యక్తి గతం కన్నా సమిష్టి ప్రయోజనాలకే" అని ప్రభుత్వం మీడియా ద్వారా నమ్మబలకడంలో ఎంత నయవంచన ఉందో అర్థమవుతుంది.

ఆపద కాలంలో కూడా కార్పొరేట్ల కోసమే బడ్జెట్ ఉపయోగపడింది. దేశ ప్రయోజనాలకు భిన్నంగా, పూర్తి వ్యతిరేక దిశలో బడ్జెట్ ఉంది. ప్రధాన రంగాలు బలోపేతం కావడం లేదు సరికదా బలహీన పడుతున్నాయి. మానవ వనరుల అభివృద్ధి, ప్రజా సంక్షేమం వైపు పాలకుల దృష్టి లేదు. వినాశకరమైన బడ్జెట్‌ను పాలక మీడియా పునరుజ్జీవనానికి తోడ్పడే బడ్జెట్‌గా ఊదరగొడుతున్నారు.

స్థూల జాతీయోత్పత్తి 2019-20లో 1.8 శాతానికి పడిపోయింది. 2016-17 లో 8.3 శాతం, 2017-18 లో 7 శాతం, 2018-19 లో 6.1 శాతం, 2019-20 లో 4.2 శాతం. 2020-21 లో మైనస్ 7.7 కు పడిపోయింది. జిడిపి 146 లక్షల కోట్ల నుండి 134 కోట్లకు తగ్గింది.

అణు ఇంధన రంగం, అంతరిక్షం, రక్షణ, రవాణా, టెలికం, విద్యుత్, పెట్రోల్, బొగ్గు, బ్యాంకింగ్, భీమా, ఆర్థిక సేవలు మాత్రం ప్రభుత్వ నిర్వహణలో ఉంచుకుని మిగిలిన సమస్త జీవన రంగాలను ప్రైవేటుపరం చేసి దేశ ప్రజల బతుకుల్ని ప్రైవేటు వ్యక్తుల దయాదాక్షిణ్యాలకు వదిలి వేయాలని, దేశ సంపదలను సమూలంగా వారికి దోచిపెట్టాలని పాలకుల కుట్ర. అత్యధిక మెజారిటీతో గెలిపించిన తమ దేశ ప్రజలకు బిజెపి పాలకులు ఇస్తున్న ప్రతిఫలం ఇది. ఇది లూటీ, జూటా సర్కార్ అని బహిరంగంగా చాటుకుంటున్నది.

అయితే ఇప్పుడు సరికొత్తగా ఆ 4 రంగాలలో కూడా 60 నుండి 100 శాతం ప్రైవేటీకరణకు పూనుకుంటున్నారు. "ప్రభుత్వం వ్యాపారం చేయదు. కేవలం మానిటరింగ్ చేస్తుందని'' మోదీ, నిక్మలా సీతారామఃపార్లమెంట్ లోనే చెప్పారు.

ప్రభుత్వం 300 పైగా పబ్లిక్ సెక్టార్ యూనిట్లను "నీతి అయోగ్" ద్వారా అమ్మకానికి సిద్ధం చేసింది. అయితే ప్రైవేటీకరణ చేయడం కాకుంటే మూసి వేయడం అనే విధానాన్ని ఎంచుకున్నారు పాలకులు. అంతా ప్రైవేటుపరం చేసాక మన పాలకులు వారికి రక్షణ కల్పిస్తూ, రాజ్యాంగాన్ని, చట్టాలను ప్రైవేటు వ్యక్తులకు అనుగుణంగా మార్చుకుంటూ, వారికోసం ప్రజల్ని అణచి ఉంచడం చేస్తారు. అప్పుడు రాజ్యాంగం యొక్క అసలు స్వభావం "అణచివేత సాధనం" అందరికి సునాయాసంగా అర్థమయి తీరుతుంది. ఇక దాపరికాలుండవు. ప్రత్యేక భాష్యాలు, కుట్రలు ఏమీ ఉండవు. రైతాంగ పోరాటం బద్దలయ్యాక ఆ రైతులే అన్నట్లు "మోదీ ఎందుకు అంబానీ కూర్చుంటే సరిపోదా" సరిపోతుంది.

ప్రజా వ్యతిరేక కార్పొరేట్ అనుకూల బడ్జెట్‌ను వ్యతిరేకిద్దాం. ప్రజల్ని చైతన్యవంతం చేసి, ప్రజానుకూల, ప్రజా సంక్షేమ బడ్జెట్ రూపొందించే ప్రజా రాజ్యాన్ని నిర్మిద్దాం.

★

# తీవ్రమవుతున్న మౌలిక వైరుధ్యాలు - పెరుగుతున్న విప్లవానుకూలత

కరోనా–19 మహమ్మారికి ముందే ప్రపంచ ఆర్థికవ్యవస్థ తీవ్రమైన సంక్షోభ స్థితిలో ఉంది. అమెరికాలో వచ్చిన 2008 నాటి సంక్షోభం, యూరప్ దేశాలను, ప్రపంచ దేశాలను చుట్టు ముట్టి ప్రపంచ సంక్షోభ తీవ్రతను మరింతగా పెంచింది. అమెరికా (4.8 శాతం), చైనా (6.8 శాతం), జపాన్ (7.1 శాతం), యూరప్, జర్మనీ (2 శాతం), ఫ్రాన్స్ (5.8 శాతం), బ్రిటన్ (2 శాతం), ఇటలీ (4.7 శాతం), స్పెయిన్ (5.2 శాతం), మొత్తంగా యూరోపియన్ యూనియన్ (3.5 శాతం) చొప్పున తగ్గి స్థూల దేశీయోత్పత్తి వృద్ధిరేటు పడిపోయింది. ఉద్దీపన పథకాలు ఫలితాన్నివ్వలేదు. 170 దేశాల్లో ఈ సంవత్సరం తలసరి ఆదాయం వృద్ధిరేటు నెగెటివ్‌గానే ఉంటుందని ఐయమ్ఎఫ్ అంచనా వేసింది. ఆక్స్‌ఫామ్ ప్రకారం లాక్‌డౌన్ వలన శ్రమ జీవుల ఆదాయాలు 20 శాతంకు కుదించబడ్డాయి. ప్రపంచ వ్యాప్తంగా పేదరికం 43 కోట్ల నుండి 93 కోట్లకు పెరిగింది. ఆయా దేశాలలో ఉద్దీపన పథకాలు ప్రకటించినప్పటికీ అవి అన్నీ బడా కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి వెలుతున్నాయి. ఫలితంగా ప్రపంచంలో బిలియనీర్ల వద్ద అత్యధిక సంపద పోగుబడుతున్నది. ఎల్‌పిజి విధానాల కాలంలో శ్రమ శక్తి కొల్లగొట్టడం పెరిగే కొద్ది ప్రజల కొనుగోలు శక్తి పడిపోతూ అధికోత్పత్తి సంక్షోభంతో పాటు స్టాగ్ ఫ్లేషన్ కొనసాగుతున్నది. ఒక పక్కన ఉత్పత్తి శక్తులను ధ్వంసం చేస్తూ, మరో పక్కన అనుత్పాదక రంగంలో భారీగా ఖర్చు చేస్తున్నారు. దళారీ ప్రభుత్వాలు పునాదిలేని వినాశకర కుహనా అభివృద్ధినే నిజమైన అభివృద్ధిగా చూపిస్తున్నాయి. సామ్రాజ్యవాదులు వెనకబడిన దేశాల్లో కొనసాగే కార్మికవర్గ విప్లవోద్యమాలను, జాతీయ విముక్తి ఉద్యమాలను, పెట్టుబడిదారీ దేశల్లోని కార్మికవర్గ ప్రజాస్వామిక ఉద్యమాలను అత్యంత క్రూరంగా అణచివేస్తున్నారు. ఈ స్థితిలో అంతర్జాతీయంగా, దేశీయంగా మౌలిక వైరుధ్యాలు తీవ్రతరమవుతున్నాయి.

**1. సామ్రాజ్యవాదానికి, పీడిత జాతులకు, ప్రజలకు మధ్య వైరుధ్యం :**

1. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలకు చెందిన వెనుకబడిన దేశాలలో 3 దశాబ్దాల కాలంలో అమలు చేసిన ప్రపంచీకరణ విధానాల కారణంగా అక్కడి ప్రాకృతిక వనరులను, చౌకశక్తిని, మార్కెట్లను కొల్లగొట్టారు. 2. సామ్రాజ్యవాదులు అనుసరించిన స్వీయరక్షణ విధానాల వలన వెనుకబడిన దేశాల ఎగుమతులు సంకాలు పెరిగిన కారణంగా దిగుమతులు పెరిగిపోయి ఆంక్షలు తొలగించడంతో, స్థానిక ఉత్పత్తులపై నెగెటివ్ ప్రభావం పడింది. 3. అమెరికా, దాని మిత్ర దేశాలు కలిసి తమకు లొంగివుండని దేశాలపై దురాక్రమణ యుద్ధాలకు తలపడుతున్నారు. 4. దళారీ పాలకులు ఆయా దేశాలలోని ప్రభుత్వరంగ సంస్థలను సామ్రాజ్యవాదులకు తెగనమ్ముతున్నారు. దానితో ఆకలి, దరిద్రం, నిరుద్యోగం, అవినీతి, అధిక ధరలు, ఆత్మహత్యలు పెరగడంతో పాటు ఆందోళనలు కూడా పెరిగాయి. దాని వెన్నంటే ఫాసిస్టు చట్టాలు, నిర్బంధం వచ్చాయి. సామ్రాజ్యవాదానికి, దళారీ పాలకులకు వ్యతిరేకంగా 2019 నుండి చిలీ, లెబనాన్, ఈక్వెడార్, ఇండోనేషియా, ఇరాక్, పెరూ, హైతీ, ఈజిప్ట్, సిరియా, హాంకింగ్, కొలంబియా దేశాలలో ప్రజలు మిలిటెంట్‌గా పోరాడుతున్నారు. విప్లవ పార్టీ నాయకత్వంలో భారత్, ఫిలిప్పైన్స్, పెరూ, టర్కీలలో సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయ విముక్తి పోరాటాలు కొనసాగుతున్నాయి. ఈ ఉద్యమాలన్నీ రానున్న రోజుల్లో సంఘటితపడి పురోగమిస్తాయి.

**2. పెట్టుబడిదారీ దేశాలలో బూర్జువా వర్గానికి, కార్మిక వర్గానికి మధ్య వైరుధ్యం:**

1. సామ్రాజ్యవాద దేశాల్లో అనుసరిస్తున్న నయాఉదారవాద విధానాల వలన కార్మికవర్గం, దిగువ మధ్యతరగతి ప్రజలపై శ్రమ దోపిడీ అధికమయ్యింది. 2. ప్రజా సంక్షేమ పథకాలపై కోతలు విధించడం, ఉద్యోగాలపై కోతలు విధించడంతో నిరుద్యోగం పెరగడంతో పాటు జీవన భద్రత లేకుండా పోయింది. 3. పరోక్ష పన్నుల భారం పెరిగి నిత్యావసర వస్తువులు కొనుక్కోలేని పరిస్థితి వచ్చింది. ఈ సమస్యల సుగిగుండం నుండి బయటపడడంలో భాగంగానే ఫ్రాన్స్‌లో డీజిల్ కోసం యెల్లో వెస్ట్ ఉద్యమం, యూరప్ దేశాలన్నింటి కార్మికుల హక్కుల రక్షణ, కనీస వేతనాల కోసం డిమాండ్ చేస్తూ కార్మికుల పోరాటం, పోలండ్‌లో ఉపాధ్యాయుల సమస్యల కోసం పోరాటం, హంగేరిలో ఓవర్ టైం పనికి చెల్లింపుల కోసం పోరాడారు. కార్మికులతో పాటు అన్ని సెక్షన్ల ప్రజలు ముఖ్యంగా మధ్యతరగతి ఇందులో పాల్గొన్నారు. అమెరికాలో తెల్లజాతి జాత్యహంకార విధానాలకు వ్యతిరేకంగా బ్లాక్‌లైవ్స్ మాటర్ ఉద్యమం అమెరికాతో పాటు యూరప్‌నంతా కుదిపివేసింది.

పెట్టుబడిదారీ దేశాలన్నింటా సామాజిక సంక్షోభం బద్దలయ్యే అవకాశాలున్నాయి. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ పట్ల వ్యతిరేకత పెరుగుతున్నది. నూతనంగా కార్మికవర్గ పోరాట సంస్థలు, పార్టీలు,

మావోయిస్టు సామ్రాజ్యవాద వ్యతిరేక జాతుల పోరాటాలను, పెట్టుబడిదారీ దేశాలలోని కార్మికవర్గ పోరాటాలను సమైక్యం చేసే పరిస్థితుల్లో పరిపక్వమవుతున్నాయి.

**3. సామ్రాజ్యవాదుల మధ్య తీవ్రతరమవుతున్న వైరుధ్యం:**

సామ్రాజ్యవాద అమెరికా ఇక ఏకైక అగ్రరాజ్యం కాదు. ఈనాడున్న స్థితిని బహుధృవ ప్రపంచం అనడం సరిగా ఉంటుంది. ఎందుకంటే నిజానికి అమెరికా వ్యూహాత్మక క్షీణత 1970లోనే మొదలయ్యింది.

రెండవ ప్రపంచ యుద్ధం నుండి 75 సంవత్సరాలుగా అమెరికా ప్రపంచ వ్యాప్తంగా చేసిన యుద్ధాలపై 6 ట్రిలియన్ డాలర్లు ఖర్చు పెట్టింది. 2008 ఆర్థిక సంక్షోభం నుండి ఇంకా కోలుకోలేదు. అమెరికాకు దీటుగా చైనా, ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో ప్రపంచీకరణ స్వేచ్ఛా వాణిజ్యంగా పేరుతో అమెరికా మిత్ర దేశాలతో భాగస్వామ్య దేశాలతో పాటు వివిధ దేశాలతో ఒప్పందాలు చేసుకుంటున్నది. చైనాతో తలపడేందుకు జోజైడెన్ ప్రభుత్వం తన మిత్ర పక్షాలతో కూడిన వ్యవస్థపై ఆధారపడక తప్పని స్థితి ఏర్పడింది.

రానున్న రోజుల్లో ఇండో పసిఫిక్ రీజియన్‌లో అమెరికా, చైనాల మధ్య పోటీ, ఘర్షణలు తీవ్రం కానున్నాయి. అమెరికా ఇప్పటికే భారతదేశం, జపాన్, ఆస్ట్రేలియాలతో కలిసి క్వాడ్ (చతుర్ముఖ రక్షణ ఒప్పందం) పేరుతో ఒక సైనిక కూటమిని ఏర్పచింది. 2020 మే, అక్టోబర్ నెలల్లో బంగాళఖాతం, అరేబియా సముద్రాలలో మలబార్ ఎక్స్‌ప్రెస్ పేరుతో సైనిక విన్యాసాలు నిర్వహించింది.

వాణిజ్య, కరెన్సీ యుద్ధాలతో తీవ్రతరమైన అమెరికా-చైనాల మధ్య వైరుధ్యాలు ఇప్పుడు సైనిక రంగంలో కూడా విస్తరించాయి. చైనా, రష్యాలకు వ్యతిరేకంగా అమెరికా అనుసరిస్తున్న విధానాలు ఆదేశాల మధ్య పెరుగుతున్న సైనిక వైరాన్ని సూచిస్తున్నది. అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాల దూకుడును ధీటుగా ఎదుర్కొంటామని చైనా తన రక్షణ శ్వేత పత్రంలో హెచ్చరించింది. చైనా ఇప్పటికే తన సామ్రాజ్యవాద ఆర్థిక, దౌత్య, రాజకీయ ప్రయోజనాల కోసం సైన్యాన్ని ఆధునికరించడం, భారీగా ఖర్చు చేయడం, సైన్యాన్ని బలోపేతం చేయడం చేస్తుంది. చైనా పలు దేశాల ఆర్థిక వ్యవస్థలలోకి చొచ్చుకుని పోవడంతో పాటు వాటితో వ్యూహాత్మక ఒప్పందాలు చేసుకుంటున్నది. ప్రపంచ పునర్విభజన కోసం చైనా-అమెరికాల మధ్య పోటీ మరింతగా పెరిగింది.

అమెరికా అగ్రరాజ్యహోదాను కోల్పోయి, బహుధృవ ప్రపంచం ఉనికిలోకి వచ్చినప్పటికి అది ఇప్పటికీ ప్రపంచ ప్రజలకు, పీడిత జాతులకు నెం.1 శత్రువుగానే ఉంది. అమెరికా ఒక పెద్ద ఆర్థిక శక్తిగా ఉంటూ ప్రపంచ ఆర్థిక లావాదేవీల్లో 60 శాతాన్ని డాలర్ వ్యవస్థతో నియంత్రించగలుగుతుంది. యూరప్‌లో ఆదిపత్యం కోసం జర్మనీ, ఫ్రాన్స్‌ల మధ్య పోటీనడుస్తున్నది. బ్రిటన్‌కు ఆరెండింటితోను వైరుధ్యం కొనసాగుతున్నది.

వెనుకబడిన దేశాల వనరులు, చౌక శ్రమశక్తి, మార్కెట్ల కోసం సామ్రాజ్యవాద దేశాల మధ్య పోటీ, వైరుధ్యాలు ఉన్నప్పటికి, మరో వైపున ప్రపంచీకరణ విధానాలను వెనుకబడిన దేశాలపై రుద్ది అమలు చేయడంలో తోడు దొంగలుగా వాటి మధ్య కుమ్మక్కు కూడా ఉంది.

1976 నుండి కొనసాగుతున్న ప్రపంచ విప్లవోద్యమ వెనుకంజ (సెట్‌బ్యాక్) తర్వాత మరల ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు, ప్రపంచ కార్మిక విప్లవ వెల్లువ తలెత్తే అవకాశాలు కనబడుతున్నాయి. ఈ సదవకాశాన్ని కార్మిక వర్గ పార్టీలు వినియోగించుకొని ఎక్కడికక్కడ విప్లవాలు విజయవంతం చేయడానికి, ప్రపంచ సోషలిస్టు విప్లవం విజయవంతం చేయడానికి ప్రయత్నించాలి.

**భారత దేశంలో**

అంతర్జాతీయంగా సామ్రాజ్యవాద సంక్షోభం తీవ్రమై మౌలిక వైరుధ్యాలు పదునెక్కడంతో భారతదేశం కూడా తీవ్రంగా ప్రభావితం అవుతుంది. 3 దశాబ్దాల కాలం నుండి అమలవుతున్న (1991 నుండి) ప్రపంచీకరణ విధానాలను ఇప్పుడు మోడీ 2వ సారి అత్యధిక మెజారీటితో అధికారంలోకి వచ్చి వాటిని దూకుడుగా అమలు చేస్తున్నాడు. పీడిత వర్గాల, పీడిత సామాజిక సెక్షన్ల, పీడిత జాతుల ఆందోళనలను హిందూ ఫాసిస్టు బిజెపి ప్రభుత్వం పాశవికంగా అణచివేస్తున్నది. "న్యూ ఇండియా" పేరుతో 2022 నాటికి దేశాన్ని బ్రాహ్మణీయ హిందూత్వ ఫాసిస్టు రాజ్యంగా మార్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తుంద్ది

మోడీ పాలన కాలంలో దేశంలోఆర్థిక సంక్షోభం తీవ్రమై గత 2 సంవత్సరాలుగా అది గాఢమైంది. మౌలిక వైరుధ్యాలు పదునెక్కిన ఫలితంగా అన్నీ సెక్షన్ల ప్రజలు సంఘటతమై సమైక్య పోరాటాలకు సన్నద్ధమవుతున్నారు.

1991 నుండి సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలు అమలు జరుగుతున్నాయి. 2019లో 2వ సారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ పేరుతో 2022 నాటికి దేశాన్ని బ్రాహ్మణీయ హిందుత్వ రాజ్యంగా మార్చే ఎజెండాను దూకుడుగా అమలు చేస్తున్నాడు.

జమ్మూ-కశ్మీర్ రాష్ట్రాన్ని దిగ్బంధించి 2019 ఆగస్టు 5న 370, 35ఏ ఆర్టికల్స్‌ను రద్దు చేసింది. ప్రత్యేక హోదా కల్పించే అవకాశాలను రద్దు చేసింది. రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా (జమ్మూ-కశ్మీర్, లద్దాఖ్) విడగొట్టింది.

సిఎఎ పేరుతో అస్సోంలో లక్షలాది ముస్లింలను, బెంగాలీలను, రోహింగ్యాలను తీవ్ర అభద్రతా భావానికి గురిచేసింది. మత ప్రాతిపదికన పౌరసత్వం కల్పించేలా సీఏఏను రూపొందించింది. ఇది హిందువులు కాని వారి అస్థిత్వానికి సవాలుగా మారింది. దేశంలోని పేదలకు, దళితులకు, ఆదివాసులకు, మత మైనార్టీలకు పౌరసత్వాన్ని నిరాకరించే కుట్రతో ఎన్ఆర్సిని నరేంద్ర మోడీ ప్రభుత్వం రూపొందించింది.

ఉద్యమిస్తున్న వారిపై 'అర్బన్ నక్సల్స్' ముద్ర వేసి వారిని అణచివేస్తుంది. 2019 నవంబర్లో బాబ్రీమసీద్ కేసులో సుప్రీంకోర్టు అన్యాయమైన తీర్పుతో ఆగస్టు 5న రామ మందిర నిర్మాణానికి శంకు స్థాపన జరిగింది. సెప్టెంబర్ 30న సిబిఐ ఆ కేసులో సాక్ష్యాలు లేవని కేసును కొట్టి వేసింది.

2020, మే 12న 20 లక్షల కోట్ల రూపాయాల ఉద్దీపన పథకాలను ప్రకటించి దేశంలోని దళారీలకు పంచి పెట్టింది. ఇదంతా ఆత్మనిర్భర్ భారత్ పేరుతో చేసింది. 339 ప్రభుత్వ రంగ సంస్థలను తెగనమ్మి వేస్తున్నది. 30 శాతం ప్రజలకు జీవనోపాది కల్పించే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను నాశనం చేయడంతో అన్నీ సెక్షన్ల ప్రజలకు ఉపాది దెబ్బతిన్నది.

2020, సెప్టెంబర్లో మూడు వ్యవసాయ చట్టాలను తెచ్చి వ్యవసాయ రంగాన్ని దళారీలకు ఒప్పజెప్పింది. ఆహార భద్రత లేకుండా చేసింది. నూతన అటవీ ముసాయిదా సవరణ చట్టం 2019ని కేంద్రం తెచ్చింది. 11 కోట్ల ఆదివాసులను అడవుల నుండి పారదోలే కుట్ర ఇది. జాతీయ విద్యావిధానం పేరుతో నూతన విద్యావిధానాన్ని తెచ్చింది. విద్యను ప్రైవేటీకరించి, కాషాయీకరించడం వారి విధానంగా, హిందూ దేశం లక్ష్యంగా ఉంది. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి - 4 కార్మిక కోడ్స్ను రూపొందించింది. కార్మికులు పోరాడి సాధించకున్న హక్కులను కాలరాచి వేసింది. సామ్రాజ్యవాద దళారీలకు లాభాలు చేకూర్చే కుట్ర ఇది.

చైనా, పాకిస్థాన్లకు వ్యతిరేకంగా దేశభక్తిని, జాతీయోన్మాదాన్ని రెచ్చకొడుతున్నాయి పాలకవర్గాలు. బ్రాహ్మణీయ హిందూత్వ భావజాలం సామ్రాజ్యవాద విధానాలకు సేవ చేసే నయా భూస్వామ్య భావజాలమే. సామ్రాజ్యవాద కూటముల మధ్య వైరుధ్యం ఇక్కడ దళారీల నడుమ కూడా ప్రతిఫలిస్తుంది.

బ్రాహ్మణీయ హిందూత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా వివిధ రూపాల్లో పోరాడే, సమైక్యమయ్యే పరిస్థితి పరిపక్వమయ్యింది. వేతనాల బకాయిలు చెల్లింపు, వేతనాల పెంపు, పని భద్రత తదితర జీవన్మరణ సమస్యల కోసం కార్మిక వర్గం మిలిటెంట్గా పోరాడుతున్నది. రైతాంగం పెద్ద ఎత్తున పోరాడుతున్నది. అన్ని సెక్షన్ల ప్రజలు ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారు. అంతర్జాతీయంగా, దేశీయంగా విప్లవానుకూలత పరిస్థితి పెంపొందుతున్నది. ఈ ప్రజా పోరాటాలను విప్లవ వెల్లువగా అభివృద్ధి చేద్దాం. భారత విప్లవోద్యమాన్ని పురోగమింప చేద్దాం.

విప్లవాల యుగం మనది - విప్లవిస్తే జయం మనది. ★

---

*(21వ పేజీ తరువాయి....)*

కేబినెట్ విస్తరణలాగానూ, అధికార వంపకాల్లో స్వల్ప మార్పుచేర్పుల్లాగానూ అభివర్ణిస్తున్నది. సూకీకి విస్తృతాధికారాలేమీ లేవు కానీ, చైనా పెట్టుబడుల నుంచి బర్మాను కాపాడుకొనేందుకు ప్రయత్నించడంతో ఆమె పట్ల చైనా పాలకులకు ఆగ్రహం కలిగింది. మరోపక్క భారత్తో కలసి హైవే, పోర్టు, ప్రత్యేక ఆర్థిక మండలి ఇత్యాదివి సంకల్పించడం కూడా చైనాకు కంటగింపు అయ్యాయి.

విదేశీ పెట్టుబడుల్లోనూ, వాణిజ్యంలో మూడోవంతు చైనాదే బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ (బిఆర్ఐ)లో అంతర్భాగంగా ఉన్న చైనా-మయన్మార్ ఎకనామిక్ కారిడార్ (సిఎంఇసి)లో అనేక భారీ ప్రాజెక్టులు చైనా చేపట్టింది. బర్మా మొత్తం రుణభారంలో దాదాపు సగం ఇవే.

మయన్మార్ ప్రభుత్వం చైనా ఆర్థిక సహకారంపై చాలా ఆధారపడి ఉంది. చైనా దృష్టిలో భౌగోళికంగా తను చేపట్టే బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టులో కీలకపాత్ర పోషిస్తోంది. మయన్మార్లోని అరకాన్ రాకైన్ రాష్ట్రంలో చైనా భారీగా పెట్టుబడులు పెట్టింది. రాకైన్ రాష్ట్రంలో బర్మాను పాలించిన ఒకప్పటి జనరల్ థాన్ష్వే పేరున చాలా మొత్తంలో గ్యాసు నిక్షేపాలున్నాయి. వాటిపై చైనా కన్నేసింది. దీనికి తోడు ముస్లిం రోహింగ్యాలు నివసిస్తున్న రాకైన్ రాష్ట్ర సముద్ర తీర ప్రాంతంలో చమురు, హైడ్రో కార్బన్స్ నిక్షేపాలున్నాయి. మయన్మార్ సైనికాధినేత చైనాలో పర్యటించి రాగానే ఈ సైనిక కుట్ర జరగడం కూడా పలు అనుమానాలకు తావిస్తున్నది.

ఇంతగా పాశవిక హింసాకాండ జరుగుతున్నప్పటికి మన దేశ పాలకులు సైనిక దినోత్సవ వేడుకల్లో పాల్గొనడం వారి ఫాసిస్టు అనుకూల వైఖరిని చెబుతుంది. మన దేశానికి మయన్మార్తో 1600 కిలోమీటర్ల సరిహద్దు ఉంది. ఈశాన్య రాష్ట్రాలైన మిజోరాం, మణిపూర్, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్ ఆ పొడవునే ఉన్నాయి. ఇప్పటికే వేలాది మంది ఈ రాష్ట్రాలలోకి ప్రవేశించారు. మయన్మార్ ప్రజలు భయంతో వలసలు వెళ్తున్నారు.

మయన్మార్ ప్రజల ప్రజాస్వామిక ఉద్యమానికి మద్దతునిద్దాం. మయన్మార్లో సైనిక పాలనను అంతంమొందించి అక్కడి ప్రజలు ప్రజా రాజ్యాధికారాన్ని సాధించే వరకు అన్ని రకాల సహకారాన్ని అందిద్దాం. మయన్మార్లో జాతుల ఉద్యమాలు, ప్రజాస్వామిక ఉద్యమాలు సమన్వయంతో నడిచి విజయం సాధించాలి. ★

# భారతదేశ ఫెడరల్ స్వభావాన్ని దెబ్బతీస్తూ రాష్ట్రాల అధికారాలన్నీ కూల్చివేసే యన్‌సిటీ ఆఫ్ ఢిల్లీ బిల్లు ను వ్యతిరేకించాలి

2021, మార్చి 15న కేంద్ర సహాయ మంత్రి లోక్‌సభలో 'ది గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ కాపిటల్ టెర్రిటరీ ఆఫ్ ఢిల్లీ యాక్ట్-1991' లోని 21, 24, 33, 44 సెక్షన్లకు సవరణలు ప్రవేశపెట్టాడు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ననుసరించి ఈ సవరణలను చేసినట్లు సభలో మంత్రి చెప్పాడు.

ఇందులో 1. ఢిల్లీ శాసనసభ ఆమోదించే చట్టాలలో 'ప్రభుత్వం' అంటే లెఫ్ట్ గవర్నర్ (యల్‌జి) అని నూతన బిల్లులో పేర్కొన్నది. ఆ ప్రకారం సెక్షన్ 23లో సబ్ సెక్షన్లు చేర్చాలి. 2. ఢిల్లీ అసెంబ్లీకి చట్టాలు చేసే అధికారం ఉన్నప్పటికి, ఆ అంశాలలో కూడా లెఫ్టినెంట్ గవర్నర్ తన విచక్షణాధికారులను వినియోగించవచ్చును. మంత్రి మండలి తీసుకునే ఏ నిర్ణయమైన 'యల్‌జి' కి తన అభిప్రాయం తెలిపే హక్కును కల్పించాలి. ఇది ఖచ్చితంగా ఆయన ఇష్టానికి వదలడమే.

1991 నాటి చట్టం ప్రకారం శాంతి భద్రతలు, పోలీసులు, భూమి వ్యవహారాలు కేంద్ర హోంశాఖ పరిధిలో ఉంటాయి. మిగిలినవి అన్నీ ఢిల్లీ శాసనసభ పరిధిలోకే వస్తాయి. ఈ కొత్త బిల్లు ప్రకారం ఢిల్లీ శాసనసభ పరిధిలోకి రాని వాటిని యల్‌జికి అధికారాలు కల్పిస్తూ సెక్షన్-24లో అదనపు నిబంధనలు చేర్చాలి. అంటే శాసనసభ అధికారాలను కుదించేందుకు ప్రయత్నం ఇది.

లెఫ్టినెంట్ గవర్నర్ కార్యనిర్వహణాధికారి కాబట్టి రోజు వారీ కార్యకలాపాలు తెలియాలని, పారదర్శకత కోసమే బిల్లు తెచ్చామని ఎంత నమ్మబలికినా ఆచరణలో జరిగేది యల్‌జి అధికారాలు పెంచి, అవదులు లేని అధికారాలు కేంద్రం చలాయించడానికే ఇది అని అర్థం అవుతున్నది.

కోర్టులు ఇచ్చిన తీర్పుల కనుగుణంగానే ఈ బిల్లు రూపొందించామని కేంద్రప్రభుత్వం అంటున్నది. కాని సర్వోన్నత న్యాయస్థానం 2019లో ఇచ్చిన తీర్పుకు ఇది పూర్తిగా వ్యతిరేకం అని విపక్షాలు అంటున్నాయి.

2019లో సుప్రీంకోర్టు 'ప్రభుత్వమే అన్ని నిర్ణయాలు చేయాలి. ఆ నిర్ణయాల కాపీ మాత్రం యల్‌జికి పంపాలి. అంతే తప్ప ఫైల్స్ అన్నింటిని పంపనవసరం లేదని స్పష్టంగా ఆ తీర్పులో పేర్కొన్నది. ఆ తీర్పునే ఉల్టా చేసి బిల్లులో కేంద్ర పాలకులు మార్చారు.

2014 నుండి కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వంను నడుపుతున్న బిజెపిని ఢిల్లీ ప్రజలు అసెంబ్లీలో చిత్తుగా ఓడించారు. యల్‌జి అధికారాల పేరుతో అనేక ప్రజా సమస్యలలో ఎదుర్కొన్న ఇబ్బందులు, కోర్టు వ్యాజ్యాలలో నలిగిన విషయాలు ప్రజలకు తెలుసు. ఎన్నో సార్లు ధర్నాలు, నిరసనలు, వివిధ రూపాల్లో ఆందోళనలు జరిగిన సందర్భాలున్నాయి.

అసెంబ్లీ ఎన్నికల సందర్భంలో బిజెపి చేసిన వాగ్ధానాల్లో ముఖ్యమైనది 'ఢిల్లీకి పూర్తి స్థాయి రాష్ట్ర హోదా కల్పించడం' కానీ రెండు సార్లు అధికారంలో ఉన్నా ఆ పని చేయలేదు సరికదా దానికి పూర్తి వ్యతిరేకంగా ఉన్న అధికారాలు కూడా లాక్కొని అసెంబ్లీని మున్సిపాల్టీ స్థాయికి దిగజార్చే కుట్ర చేస్తున్నది. ఢిల్లీ పాలకుల పట్ల తీవ్ర ద్వేషంతో ఢిల్లీ ప్రజలను అవమానిస్తూ , పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి, భారత గణతంత్ర రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా రాష్ట్రాల అధికారాలను కొల్లగొడుతున్నది.

ఢిల్లీ ప్రజలను మోసం చేస్తూ , ఓడినా గాని పరోక్షంగానైనా ఢిల్లీని తన చెప్పు చేతుల్లో నడపడానికే యల్‌జికి అన్నింట అంతిమ నిర్ణయ అధికారాన్ని ఇస్తూ బిల్లును తెచ్చింది. పార్లమెంటులో విపక్షాలు వ్యతిరేకిస్తున్నా, సెలక్షన్ కమిటీకి పంపాలని డిమాండ్ చేసినా వినకుండా బిజెపి ఏకపక్షంగా ఈ బిల్లుకు మార్చి 22న ఆమోదం తెలిపింది, గెలిపించుకున్నది.

ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని నామమాత్రం చేసి, ప్రతి ఎగ్జిక్యూటివ్ నిర్ణయాన్ని అది ఎటువంటిదైన యల్‌జి అనుమతి పొందాలి అనడమంటే ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు జరగడం, ప్రభుత్వం ఏర్పడడం బూటకం తప్ప మరొకటి కాదు.

రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని హరించివేయడం, కీలుబొమ్మలతో, అనుకూలమైన సంకీర్ణాలతో అధికారాన్ని చలాయించడం, రాష్ట్రాలలో ఎన్నికైన ప్రభుత్వాలను పిరాయింపులు, కుట్ర పద్ధతుల్లో పడగొట్టి ఆ రాష్ట్రాలు అన్నింటిని తమ హస్తగతం చేసుకుంటుంది కేంద్ర ప్రభుత్వం. కేంద్రంలోను, అన్ని రాష్ట్రాలలోను తమకు ఎదురు లేకుండా చేసుకుని దేశంలో ఫాసిస్టు హిందూ రాజ్యాన్ని నిర్మించేందుకు, భవిష్యత్తులో ఎన్నికలు లేని విధంగా నిరంకుశంగా పాలించేందుకు అవసరమైన రాజ్యాంగ సవరణలు చేస్తున్నది బిజెపి. అందుకు అనుగుణంగా అన్ని రంగాలను విద్య, వైద్యంలతో సహా ప్రైవేటుపరం చేస్తున్నది. పబ్లిక్ సెక్టార్‌ను తెగనమ్మి ప్రజల సంపదను ప్రైవేటు వ్యక్తులకు, కార్పొరేట్ శక్తులకు అప్పజెపుతుంది. ఒక విధ్వంసక రాజ్యాన్ని, వినాశకర పాలనను మనపై మోపుతున్నది. అందులో భాగంగా ఈ యన్‌సిటి బిల్లును లోక్‌సభలో ఆమోదింపజేసింది.

బిజెపి ఒక్క కశ్మీర్ మిలిటెంట్లనో, మావోయిస్టులనో, మేధావులనో మాత్రమే కాదు ప్రతిపక్ష పార్టీలను కూడా ఏ ఒక్కరినీవదలకుండా దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నది.

ఢిల్లీలో ప్రజాస్వామ్యాన్ని కూల్చి లెఫ్టినెంట్ గవర్నర్ పాలనను స్థిరీకరించే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ నిరంకుశ విధానాలను అన్ని రాజకీయ పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. భారత దేశం అతిపెద్ద ప్రజాస్వామిక దేశం అని, భారత్ ఒక సమాఖ్య రాజ్యమని (ఫెడరల్ రిప్లబిక్ అని) గొప్పలు చెప్పుకునే పాలకులు దానికి భిన్నంగా వ్యవహరించడం ఇక్కడ సర్వసాధారణ విషయం.

1991లో రాజ్యాంగాన్ని సవరించి ఢిల్లీ పాలన విషయంలో ప్రత్యేక నిబంధనలను సమకూర్చేందుకు అధికరణ 239ఎఎ ను పొందుపరిచారు. ''ఢిల్లీ ఒక కేంద్ర పాలిత ప్రాంతంగా కొనసాగుతుంది. ఒక శాసన సభ ఏర్పాటవుతుంది. సామాన్య మానవునికి సంక్షేమాన్ని సమకూర్చేందుకు సంబంధించి తగు అధికారాలతో మంత్రి మండలి ఆ శాసనసభకు బాధ్యత వహిస్తుందని ఆ అధికరణం పేర్కొన్నది. ఆ అధికరణాన్ని అమలు పరిచేందుకే గవర్నమెంటు ఆఫ్ ది నేషనల్ టెర్రిటరీ ఆక్ట్-1991ని తెచ్చారు.

ఆ అధికరణం 239ఎ లోని "సహాయ, సలహాల"ను మంత్రి మండలి సహాయ సలహాలకు లెఫ్టినెంట్ గవర్నర్ కట్టుబడి ఉండాలని అర్థం చేసుకోవాలి అని సుప్రీంకోర్టు గతంలో స్పష్టంగా చెప్పింది. ఇప్పుడు ప్రభుత్వం అంటే లెఫ్టినెంట్ గవర్నరే అని స్పష్టంగా నిర్దేశించండం అంటే ఆ చట్టాన్ని ఈ బిల్లు సవరిస్తున్నదన్నమాట.

కాశ్మీర్‌లో జరిగిన అప్రజాస్వామిక దాడిని భారత జాతీయవాదం పేరుతో సమర్థించిన వాళ్ళు, పరోక్షంగా మద్దతునిచ్చిన వాళ్ళు ఇప్పుడు ఢిల్లీ విషయంలో ఏ జాతీయవాదం ముసుగు కింద దాక్కోగలరు?

ఇక్కడ పార్లమెంట్‌కు విలువ లేదు. ప్రతిపక్షాలను గుర్తించరు. ఏకపక్షంగా, నిరంకుశంగా పాలించే వారికి మంత్రి మండలి, పార్లమెంట్, ప్రజాస్వామిక ప్రక్రియ ఏవీ అవసరం లేదు. రాజ్యాంగం మీద వారికి ఏమాత్రం గౌరవం లేదు. అయితే దానిలో మార్పులు చేయకుండా ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేయడం సాధ్యం కాదు. అత్యధిక మెజారిటీతో అధికారంలోకి వచ్చాక వాటన్నింటిని తుంగలో తొక్కి తమదైన ఎజెండాను నిరంకుశంగా అమలు చేస్తున్నారు.

ఈ బిల్లు చట్టంగా మారకముందే ప్రజా ఉద్యమ నిర్మాణం జరగాలి. సమైక్య పోరాటం జరగాలి.

★

---

*(36 పేజీ తరువాయి....)*

తీవ్రమైన నిర్బంధ పరిస్థితుల్లో సాధ్యమవడం లేదు. ప్రజల సహకారంతో ప్రతి ఆర్‌పిసి లెవల్లో గ్రామంలో ప్రాథమిక పాఠశాలను నడపడానికి కూడా వీలుకానీ నిర్బంధ పరిస్థితులు నెలకొల్పుతూ దోపిడి ప్రభుత్వాలు తమ వర్గ స్వభావాన్ని చాటుకుంటున్నాయి. గ్రామ స్కూళ్లపై, గ్రామాలపై కక్ష గట్టి దాడులు చేస్తున్న దోపిడి రాజ్యం తమ శత్రువని విద్యార్థులు అనుభవం నుండి గ్రహిస్తున్నారు.

ముగింపు:

మార్కెట్-మను విధానాలను అనుసరించడం ద్వారా విద్యారంగాన్ని ప్రపంచీకరణకు, వ్యాపారీకరణకు లోను చేసి, మన దేశాన్ని బానిసత్వంలోకి తీసుకొనిపోవాలని చేస్తున్న ఈ దేశ పాలకవర్గాలను కూలదోయకుండా, దోపిడి ఉత్పత్తి సంబంధాలను మార్చకుండా విద్యారంగంలో మార్పులు తేవడం అసాధ్యం. సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక ప్రజా పోరాటాలకు భయపడి వారి ఆకాంక్షలను రాజ్యాంగంలో పొందుపరిచినప్పటి నుండి ఏనాడు అమలు చేయకుండా ప్రజలను మోసపుచ్చిన ఈ పాలకవర్గాలు నేడు రాజ్యాంగంలో నామమాత్రంగా ఉన్న ప్రజాహితమైన వాటిని కూడా తొలగిస్తున్నారు. ప్రజల ప్రాథమిక హక్కుగా విద్యను గుర్తించే విషయంలో కూడా ఇదే జరిగింది. 'విద్య అమ్మకానికి కాదు, ప్రజల హక్కు, కార్పొరేట్, ప్రైవేట్ సంస్థలను విద్యారంగంలో అనుమతించకుండా ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి, సుసంపన్నం చేయాలి, విశ్వజనీనం చేయాలి, కెజి నుండి పిజి వరకు పూర్తిగా ఉచితమైన, మాతృభాషలో నడిచే ఆవాస ప్రాంత పాఠశాలల మీద ఆధారపడిన కామన్ స్కూల్ విద్యా విధానం వుండాలి. వేల సంవత్సరాలుగా విద్యకు దూరం చేయబడిన దళిత, ఆదివాసీ, ఇతర వెనుకబడిన తరగతులకు చెందిన వారికి అవసరమైనంత నిర్దిష్ట కాల వ్యవధి వరకు విద్యాలయాల్లో రిజర్వేషన్లు కొనసాగించాలి. కులం, వర్గం, లింగ బేధభావం, మతం, భాష, ప్రాంతం, అంగవైకల్యం వంటి వివక్షతలు లేని విద్యావిధానం వుండాలి. శ్రామిక ప్రజల జీవితాల సర్వతోముఖాభివృద్ధికి ఉపయోగపడేలా వైద్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి జరిగేలా ఉన్నత చదువులను, శాస్త్రీయ ప్రయోగాలను ప్రభుత్వ నియంత్రణలో నిర్వహించాలి. మొదలైన డిమాండ్లతో ఎక్కడిక్కడ ఉద్యమాలను నిర్మించాలి. విద్యను, ప్రజాస్వామ్యాన్ని, ప్రజల సార్వభౌమత్వాన్ని రక్షించడం కొరకు దేశవ్యాప్త ఐక్య ఉద్యమాలను నిర్మిస్తూనే నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం అన్ని పీడిత వర్గాల, తరగతుల, సమూహాల ప్రజలను సన్నద్ధం చేయాలి. ★

# నయా ఉదారవాద-మనువాద-ఫాసిస్టు శక్తుల ప్రయోజనాలను నెరవేర్చే ప్రగతి వ్యతిరేక, తిరోగమన నూతన విద్యా విధానం

కరోనా కల్లోల కష్ట కాలంలో నరేంద్రమోడీ ప్రభుత్వం జాతీయ ప్రాముఖ్యత గల ప్రాథమిక విద్య మొదలుకొని విశ్వవిద్యాలయ స్థాయి వరకు ఉద్దేశించిన నూతన విద్యావిధానాన్ని జులై 29న ఆమోదించింది. ఈ విద్యా విధానం భారతీయ సంస్కృతి పునాదులపై విశ్వస్థాయి మహాజ్ఞాన శక్తిగా దేశాన్ని 2040 వరకు పునర్నిర్మించేందుకు ఉద్దేశించిందని మోడీ ప్రభుత్వం పైకి ప్రకటించినప్పటికి దాని అసలు ఉద్దేశం ఒక పక్క సామ్రాజ్యవాదుల లాభార్జన కొరకు దేశ విద్యారంగాన్ని తాకట్టుపెట్టడమే కాకుండా భారతదేశాన్ని హిందూ రాష్ట్రంగా మార్చేందుకనుగుణంగా విద్యారంగాన్ని కాషాయికరించడం. విద్య కార్పొరేటీకరణ, విద్య కాషాయికరణ, విద్యా కేంద్రీకరణ అనే మూడు ఎజెండాలతో కూడి ఉన్న ఈ నూతన విద్యా విధానం అనేది నూతన బ్రాహ్మణీయ వర్గాన్ని సృష్టించడంపై కేంద్రీకరిస్తున్నది. నూతన విద్యావిధానం పేరుతో విద్యారంగంలో తేవాలనుకుంటున్న మార్పుల గురించి అందరి నుంచి సూచనలు ఆహ్వానిస్తున్నట్లు నటించిన మోడీ ప్రభుత్వం ప్రగతిశీలమైన, ప్రజానుకూలమైన ఏ సూచనలను లెక్కచేయలేదన్నది ఈ విధాన పత్రాన్ని చూస్తే అర్థమవుతుంది.

ఈ విద్యా విధానం బ్రాహ్మణీయ మనువాది కుల పితృస్వామ్య వ్యవస్థను బలోపేతం చేసింది. దేశంలోని 85% మంది పిల్లలను, యువతను విద్యారంగం నుండి దూరం చేసి వెలివేయడానికి ఈ విద్యా విధానం రూపొందించబడింది. ఇందులో దళితులు, గిరిజనులు, ఇతర వెనుకబడిన తరగతులకు చెందిన వారు, ముస్లింలు వున్నారు. ఈ అన్ని సమూహాల్లోనూ పురుషుల కంటే స్త్రీలు, వికలాంగులు మరింత ఎక్కువగా దూరం చేయబడి వెలివేయబడ్డారు. ఈ విద్యా విధానం రాజ్యాంగ నియమాలను, విలువలను ఉల్లంఘించే విధంగా ఉంది. స్వాతంత్రోద్యమంలో ముందుకు వచ్చిన సామ్రాజ్యవాద వ్యతిరేక, కుల వ్యతిరేక ఆకాంక్షలను తుడిచిపెట్టే విధంగా వుంది. ఇది విద్యార్థి, ఉపాధ్యాయ, పేద ప్రజలకు వ్యతిరేకమైనది. ప్రస్తుత నయా ఉదారవాద దశలో అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి బ్రాహ్మణీయ మనువాది అంతరాల కుల వ్యవస్థకు మధ్య నగ్నమైన కుమ్మక్కు ఇంకా బలపడింది. విద్యను వెలివేతకు సాధనంగా మార్చుకోవడం జరిగింది. ద్రవ్య పెట్టుబడికి కావలసిన తక్కువ వేతనాలు మాత్రమే లభించే నైపుణ్యాలలో శిక్షణ ఇచ్చేదిగా విద్యను దిగజార్చి వేయడం జరిగింది.

విద్య కాషాయికరణ ద్వారా హిందూ రాష్ట్రాన్ని నిర్మించాలనుకునే ఆర్ఎస్ఎస్ ఎజెండాకు అనుగుణమైనదే నూతన విద్యా విధానం-2020

విద్యా వ్యవస్థలో తేవాల్సిన మార్పుల గురించి, సిలబస్ గురించి సంఘ్ పరివార్ తన రాజకీయ, తాత్విక, సామాజిక ఎజెండా ప్రచారానికి, విస్తరణకు పాఠశాలల్ని ఒక సాధనంగా భావిస్తుంది. దానికి అనుగుణంగానే దేశ వ్యాప్తంగా వేలాది నర్సరి, ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాలలను ఆర్ఎస్ఎస్ నేతృత్వంలోని విద్యాభారతి నిర్వహిస్తున్నది. ఈ నూతన విద్యా విధానంలో మతపరమైన విద్యను, సంప్రదాయాలను బోధించడానికి మత సంస్థలను అనుమతి ఇస్తామని అంటున్న దాని అర్థం ఆర్ఎస్ఎస్ నిర్వహిస్తున్న ఈ విద్యాసంస్థలన్నిటికి సాధికారత కల్పించడమే కాక దేశంలో ప్రతి మూలకు విస్తరింపచేసే కుట్ర దాగి ఉన్నది.

ఆర్ఎస్ఎస్‌కు అనుబంధంగా వున్న భారతీయ ఇతిహాస సమితి మత ప్రాతిపదికపై జిల్లాల చరిత్రను రాస్తున్నది. భారతీయ దృక్పథంతో దైవత్వాన్ని సాధించటం కోసమే చరిత్రను రాయాలన్నది వీరి దృక్పథం. ఇప్పటి వరకు సంఘ్‌పరివార్ విద్యాసంస్థలో ఈ రకంలో వక్రీకరించి అబద్ధాలతో కూడిన చరిత్రను హిందూ సంప్రదాయాల పేరుతో నేర్పుతున్న అంధవిశ్వాసాలను, పితృస్వామ్య విషయాలను, కుల, మత, జాతి విద్వేషాలను రెచ్చగొట్టే అబద్ధాల అశాస్త్రీయ విషయాలనే దేశ వ్యాప్తంగా ప్రభుత్వ స్కూల్లో సిలబస్‌గా తయారు చేయడం కోసం ఎన్ఇపి సాధికారతనిస్తున్నది.

సంఘ్ పరివార్ దృక్పథానికి అనుగుణంగానే జాతీయ విద్యా విధాన పత్రం ప్రాచీన వారసత్వాన్ని గొప్పగా కొనియాడింది. సంస్కృత సాహిత్యంలో, గ్రంథాలలో ఆధునిక పరిజ్ఞానం మొత్తం వుందని చెప్పుకొచ్చింది. వాటిని చూసే అమెరికా నాసా, ఇతర సంస్థలు పరిశోధనల్లో ముందున్నాయని గొప్పలతో పాటు చివరకు కంప్యూటర్ లాంగ్వేజెస్‌ను కూడా రాస్తున్నాయనే అభిప్రాయాలను కలిగిస్తున్నారు. మన ప్రాచీన విద్య 'స్వయం విముక్తి' లక్ష్యంగా సాగిందనీ, భారతీయుల తాత్విక పునాది అంతా అందులోనే వుందని పేర్కొంది. ప్రాచీన గురుకుల సంప్రదాయాలను పద్ధతులను చాలా గొప్పగా చిత్రించింది. విద్యా వ్యవస్థ వాటికి అనుగుణంగా వుండాలని చెపుతున్నది. ఆ విధంగా ఈ జాతీయ విద్యావిధాన పత్రం వేదాలలోని, పుక్కిటి పురాణాలలోని కల్పిత గాథలను శాశ్వత సత్యాలుగా ప్రచారం చేసే 'హిందూత్వ' భావజాలాన్ని నెత్తికెత్తుకున్నది.

ఎన్ఇపి ప్రధాన లక్షణం సాంస్కృతిక ఆధిపత్యం, అది ఫాసిజానికి భూమికగా ఉంటుంది. విద్యా మతతత్వీకరణ కార్మికవర్గంలో మతపరమైన విభజనను తీసుకొని వస్తుంది. ప్రభుత్వానికి, నయా ఉదారవాదానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలను నీరుగార్చి వేస్తుంది. హేతురాహిత్యాన్ని అంధ విశ్వాసాలను, అశాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంచి పోషిస్తుంది. దేశంలో హిందూ రాష్ట్రాన్ని నిర్మించాలనే పథకానికి అవన్నీ అనుకూలమైన విషయాలు. అదే విధంగా విద్యా మతతాత్వీకరణ విద్యా లక్ష్యాన్ని మలుపుతిప్పే ఒక శక్తివంతమైన సాధనంగా ఉపయోగపడుతున్నది. విద్యా ప్రైవేటీకరణకు, విద్యా వ్యాపారీకరణకు వ్యతిరేకంగా ప్రజలు చేస్తున్న ఆందోళనలను నీరుగార్చి వేయడానికి, పక్కదారి పట్టించడానికి విద్యా లక్ష్యాన్ని మలుపు తిప్పే ఎజెండాగా ఉపయోగపడుతుండగా, కెజి నుండి పిజి వరకున్న విద్యారంగాన్ని దేశీయ, అంతర్జాతీయ కార్పొరేట్ పెట్టబడులకు తెలివిగా అప్పగిస్తున్నారు. విద్యను మార్కెట్‌కు అప్పగించడానికి విద్యా మతతాత్వీకరణ యొక్క మలుపుతిప్పే ఎజెండా ప్రభుత్వానికి స్వేచ్ఛను ఇస్తుంది. పెట్టుబడిదారీ, భూస్వామ్య దోపిడీ పీడనలను ఎల్లకాలం కొనసాగించడానికి వీలుగా ఎలాంటి ప్రతిఘటనా లేని పరిస్థితులను నెలకొల్పడం లక్ష్యంగా నూతన విద్యా విధానం తయారు చేయబడింది.

పీడిత కులాలు, వర్గాలకు చెందిన వారికి ఉన్నత విద్యను దూరం చేసి, వారిని సాంప్రదాయ కులవృత్తులు చేసుకునే వైపు నెడుతున్న నూతన విద్యా విధానం:

పదవ తరగతి వరకు పరీక్షలు ఉండకూడదని 2010లో తెచ్చిన విద్యాహక్కు చట్టంలో పేర్కొన్నారు. కానీ ఇప్పటి నూతన విద్యా విధానంలో దానికి భిన్నంగా 3,5,8 తరగతులకు పరీక్షలు డిటెన్షన్ విధానం నిర్వహించనున్నారు. దీనివల్ల వెనుకబడిన వర్గాల పిల్లలు డ్రాప్ అవుట్ పెరుగుతుంది. వీళ్లను బాలకార్మికులుగా మార్చివేస్తున్నది. చిన్న పిల్లలైనా కుటుంబ ఆధారిత వృత్తులలో పిల్లలు పనిచేస్తుంటే, ఆ పనుల్లో పిల్లలను పెడితే సవరించిన బాలకార్మిక చట్టం ప్రకారం అది నేరం కాదు అని అనడం ద్వారా వారిని బాలకార్మికులుగా మారడానికి ప్రభుత్వమే దారులు వేస్తున్నది. 6వ తరగతి నుండి వృత్తి విద్యా కోర్సులను ప్రవేశపెట్టడం, 10వ తరగతి తర్వాత బయటకు వెళ్లిన వారు తిరిగి వచ్చి ఒకేషనల్ లేదా 11,12 తరగతుల్లో ఇతర సబ్జెక్టులను చదవవచ్చు అని అనడం ద్వారా వీటిని సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిన సమూహాల విద్యార్థులు కొనసాగించే పరిస్థితి కల్పిస్తున్నారు. అంటే చాలా మంది తమ కుల వృత్తుల వైపు వెళ్లేలా చేసి కుల వ్యవస్థ పునాదులను పటిష్ట పరిచే విధంగానే విద్యావ్యవస్థ వుండేలా ఈ పత్రం రూపొందించబడింది. డ్రాప్ అవుట్లను తగ్గించడం కాకుండా ఎన్ఇపి వాటికి సాధికారత కల్పిస్తున్నది. నిజానికి ఏ ఒక్క విద్యార్థి, విద్యార్థిని ఫెయిల్ అవరు. విద్యా వ్యవస్థ వారిని ఫెయిల్ చేస్తుంది. ఏ ఒక్క విద్యార్థి, విద్యార్థిని డ్రాప్అవుట్ అవరు. విద్యా వ్యవస్థనే డ్రాప్అవుట్ చేస్తున్నది.

సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్, రీసెర్చి, స్కాలర్ షిప్, అపాయింట్ మెంట్ వగైరా సదుపాయాలను ఇది నిరాకరిస్తున్నది. ప్రతిభ సాకుతో అవకాశాలు నిరాకరించబడుతున్నాయి. పాఠశాలల ఏకీకరణ, రేషనలైజేషన్ పేరుతో ఇప్పటికే గ్రామీణ ప్రాంతాలలోని లక్షలాది పాఠశాలలను మూసివేశారు. సెకండరీ పాఠశాలకు 5 నుండి 10 కిలో మీటర్ల పరిధిలో ఉన్న అంగన్వాడీలతో సహా అన్ని కింది స్థాయి బడులను జత చేసి స్కూల్ కాంప్లెక్స్‌గా ఏర్పాటు చేయడం వల్ల ఆడపిల్లల డ్రాప్అవుట్ల శాతం విపరీతంగా పెరుగుతుంది. దూరంగా ఉన్న ఈ స్కూళ్లకు ప్రయాణిచండంలో ఆడపిల్లలకు ముఖ్యంగా దళిత, ఆదివాసీ ఆడపిల్లలకు ఏ రక్షణా ఉండదు. రాజ్యాంగంలోని సమానత్వం, సామాజిక న్యాయం అనే విలువలకు భిన్నంగా విద్య ఒక అంతరాల వ్యవస్థగా, వివక్షాపూరితమైనదిగా మారిపోయింది.

జ్ఞాన సముపార్జన కోసం విద్య అని కాకుండా ఉద్యోగం కొరకు నిపుణతలను పెంచుకోవడంగా విద్యా లక్ష్యాన్ని పరిమితం చేసి అతి తక్కువ వేతనాలతో పనిచేసే నిమ్నస్థాయి శ్రామికశక్తిని తయారు చేసే లక్ష్యంతో తయారైన నూతన విద్యావిధానం:

సరళీకరించబడిన విద్య 'నైపుణ్యం' పేరుతో విద్యను జ్ఞానం నుండి వేరు చేస్తుంది. ఉపాధి మార్కెట్లో అమ్మకానికి పెట్టబడిన సేవలకు అవసరమైన నైపుణ్యాలను పొందడమే విద్య అనేది నయా ఉదారవాద భావన. దీనికి అనుగుణంగానే ఎన్ఇపిలోని ముఖ్యమైన విషయం నైపుణ్యాలను పెంచడంగా ఉంది. అండర్ గ్రాడ్యుయేట్ విద్యను అమెరికా తరహాలో నాలుగేండ్లకు పెంచి వాటిలో ప్రవేశాలకు కేంద్రమే కామన్ ఎంట్రెన్స్‌ను నిర్వహించాలని నిర్ణయించారు. తీవ్రమైన ఆర్థిక, సామాజిక అసమానతలున్న మన దేశంలో ఈ విధానం పనికిరాదనీ, దీన్ని ముందు ప్రతిపాదించినపుడు కూడా తీవ్ర వ్యతిరేకత వచ్చింది కానీ దాన్ని లెక్కలోకి తీసుకోవడం లేదు. ఎందుకంటే ప్రపంచ మార్కెట్ ప్రయోజనాలను పరిరక్షించి, పెంచే మేధోపర వనరును తయారు చేయడమే విద్యా లక్ష్యంగా మార్చివేసిన సామ్రాజ్యవాదులకు కావల్సింది యాంత్రికమైన నిపుణులతో కూడిన చౌక శ్రామికశక్తి. అందుకే సామాజిక న్యాయం వంటి వాటిని లెక్కలోకి తీసుకోకుండా ఒకే రకమైన పరీక్షలను నిర్వహించి తనకవసమైన నిపుణలను ఎంచుకోవడమే దాని అవసరం. ఈ ఏరివేతలో ఉన్నత చదువులకు దూరం చేయబడే దళితులు, ఆదివాసీలు, మహిళలు, ఇతర వెనుకబడిన కులాల, వర్గాల వాళ్లంతా చవక

కూలీలుగా, శ్రామికులుగా 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంలోనికి తోసివేయబడతారు. ముప్పయేళ్ల ప్రపంచీకరణ ఉద్యోగరహిత అభివృద్ధికి దారి తీసింది. ఉద్యోగాలు పెరగలేదు. విద్యాలక్ష్యాన్ని ఉద్యోగంగాకుదించేసారు. నూతన విద్యా విధానం విద్యలో నైపుణ్యాలను ప్రతిపాదించడం లేదు. నైపుణ్యాలను విద్యలో సంలీనం చేయడం లేదు. కాని విద్యను నైపుణ్యాలతో స్థానభ్రంశం చేస్తున్నారు.

ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం పేరుతో దేశ, విదేశీ పెట్టుబడిదారులకు విద్యారంగాన్ని అప్పజెపుతున్న నూతన విద్యా విధానం:

రాజ్యాంగం ద్వారా గ్యారంటీ చేయబడి, ప్రభుత్వ నిధులతో నడవాల్సిన విద్యారంగాన్ని ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ చేసి దేశ, విదేశీ పెట్టుబడిదారుల లాభార్జన కోసం అర్పించిన మూడు దశాబ్దాల అనుభవాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు ఒకే రకమైన నిబంధనలు వర్తింపజేస్తామనడం ద్వారా ప్రభుత్వం విద్యను మరుగున పడేసి ప్రైవేట్, కార్పొరేట్‌తో పాటుగా విదేశీ విద్యకు పెద్దపీట వేసే ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో భాగంగా ప్రభుత్వ విద్యాసంస్థలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే విధానం చేపట్టారు. ప్రైవేట్ విద్యారంగంలో ఫీజుల నిర్ణయాధికారం వారికే కల్పిస్తున్నది. ప్రపంచంలోని వంద అగ్రశ్రేణి విదేశీ విశ్వవిద్యాలయాలకు మన దేశంలో క్యాంపస్ లు నెలకొల్పేందుకు అవకాశాలు సృష్టించి మన సంపదను విదేశాలకు సులభంగా చేరవేసే ఏర్పాటు చేస్తున్నారు. అదుపులేని విద్యా కార్పోరేటీకరణ ఈ విద్యావిధానం యొక్క సారాంశంగా వుంది.

ప్రమాదకరమైన విద్యా కేంద్రీకరణ:

విద్యను ప్రపంచ మార్కెట్‌కు అప్పగించే విధంగా ప్రపంచబ్యాంకు, ప్రపంచ వాణిజ్య సంస్థ, గ్యాట్స్ ఎజెండాను ముందుకు తీసుకొని పోవడం కొరకు మార్కెట్ అవసరాలను తీర్చే విధంగా ఉన్నత విద్యా రంగాన్ని అదుపు చేసే కేంద్రీకృత వ్యవస్థ ఉండాలన్నది కార్పొరేట్ రంగం యొక్క డిమాండ్. దేశ, విదేశీ కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం, హిందూ రాష్ట్ర నిర్మాణంకై దేశంలో మెజారిటీని 'హిందూత్వ' విధానాలకు, సంస్కృతికి అనుగుణంగా మార్చడం కొరకు, ఈ రెండింటికీ విద్యా కేంద్రీకరణ అవసరం. అందుకే భారత రాజ్యాంగంలోరాసిన ఫెడరల్ స్ఫూర్తికి భిన్నంగా ప్రాథమిక, సెకండరీ, ఉన్నత విద్యకు సంబంధించిన సిలబస్ తయారీలో, స్కూళ్లు, కాలేజీలు, యూనివర్సిటీల నిర్వహణలో, పరీక్షల నిర్వహణలో, టీచర్ల శిక్షణలో, ఫీజుల విధానంలో అన్నింటిని కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో ఉండే విధంగా విద్యావ్యవస్థ నిర్వహణ పద్ధతిలో మార్పులు చేస్తున్నారు. యుజిసి, ఎన్‌సిఓఆర్‌టి, ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ లాంటి సంస్థలను రద్దు చేసి ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా ద్వారా అధికార కేంద్రీకరణ చేసి రాజకీయ ఆధిపత్యానికి దారులేసుకుంటున్నారు. పునాది నుండి పరిశోధన వరకు నియంత్రించడానికి కొత్తగా దాదాపు పది కేంద్ర సంస్థలు ఏర్పాటు కాబోతున్నాయి. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో మెలిగే బ్యురోక్రటిక్ సంస్థలు. ఈ చర్యలన్ని విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని సమూలంగా సమాధి చేసేవే. స్వతంత్రంగా విద్యావేత్తలతో వుండాల్సిన రాష్ట్రీయ శిక్షా ఆయోగ్‌కు ప్రధాన మంత్రి అధ్యక్షులు కావడం అంటే విద్యా వ్యవస్థలో సంఘ్ పరివార్ ఎజెండాను, సామ్రాజ్యవాదుల ఎజెండాను పకడ్బందీగా అమలు చేయడం కొరకు మాత్రమే.

కాషాయికరించబడిన సామ్రాజ్యవాద అనుకూల విద్యావిధానం వల్ల పెంపొందే భావజాలం, పతన విలువలు:

సామ్రాజ్యవాద శకంలో అరాచకమైన ఉత్పత్తి, పంపిణీ, అంతులేని లాభాపేక్ష, మార్కెట్ల ఆక్రమణ కోసం పెరిగిన పోటీ విధ్వంసక విలువల్ని, విష సంస్కృతిని పెంచి పోషిస్తున్నది. సమాజం యొక్క ప్రగతిశీల అభివృద్ధి కోసం, నిర్మాణం కోసం ఉపయోగపడాల్సిన విద్యను ప్రజలందరికీ అందించాల్సిన బాధ్యత నుండి ప్రభుత్వాలు పక్కకు తప్పుకొని వాటిని ప్రైవేటీకరణ చేయడంతో విద్యా వ్యాపారం వికృత రూపం దాల్చింది. ఈ నూతన విద్యా విధానపత్రం ఒక పక్క విద్యలో భూస్వామ్య హిందూత్వ విలువల్ని పెంచడానికి ప్రాధాన్యతనిస్తుంటే ఇంకో పక్క పూర్తి వ్యాపార విలువలను ప్రోత్సహిస్తున్నది. కార్పొరేట్ సంస్కృతి విస్తరిస్తూ విద్యార్థుల ప్రజాస్వామిక వ్యక్తిత్వ నిర్మాణ ప్రక్రియ దెబ్బతింటున్నది. వ్యాపార సంస్కృతి వల్ల సామాజిక స్పృహ, సమిష్టితత్వం, సమాజ నిర్మాణం కొరకు, ప్రగతి కొరకు విద్య అనే విలువల స్థానంలో వ్యక్తిగతమైన లాభం కోసమే విద్యగా, వ్యాపార విలువలే గొప్పవిగా చిత్రీకరించబడుతున్నాయి. జాతి, కుల, లింగ వివక్షత లేని సమానత్వం, లౌకిక భావన వంటి విలువల స్థానంలో పురుషపెత్తనం, ద్వేషం, మతతత్వం, అసహిష్ణత, అధికారం–బలప్రయోగం, కులోన్మాదం, జాతీయోన్మాదం వంటి అప్రజాస్వామిక, భూస్వామ్య విలువలు ఒక సెక్షన్ విద్యార్థులో పెరుగుతున్నాయి. విద్యా వ్యవస్థలో మతాన్ని మిళితం చేయడం ద్వారా రాజకీయ దృక్పథాన్ని సైతం ప్రజాస్వామిక పంథా నుండి ఫాసిస్టు పంథాకి మళ్ళిస్తున్నారు. పతనమైన విలువల వల్ల విద్యాలయాల్లో సైతం దళితులు, ఆదివాసీలు, ముస్లింలు, బడుగు బలహీన వర్గాల వాళ్లు, వీరిలో మహిళలు మరింతగా వేధింపులకు, అత్యాచారాలకు, దాడులకు గురవడం పెరుగుతున్నది.

ఈ నూతన విద్యావిధానంలో మొత్తం మీద 'లొంగి వుండడం' అనే బానిస స్వభావాన్ని విద్యార్థులకు నేర్పించడమనేదే అంతర్లీన

సూత్రంగా ఉంది. సంపన్న వర్గాలకు చెందిన విద్యార్థులేమో ఉన్నత చదువులు చదివి ఉన్నత పదవులు పొంది అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆదేశాలకు లొంగి ఉంటూ వ్యవహరిస్తారు. అటువంటి అవకాశాలేవీ అందుబాటులోకి రాని వెనుకబడిన సామాజిక, ఆర్థిక తరగతుల విద్యార్థులంతా వ్యవస్థకు లొంగివుండే శ్రామిక వర్గంలో చేరుతారు. ఇదే నూతన విద్యా విధాన రూపకర్తల అసలు లక్ష్యం.

ప్రత్యామ్నాయం:

విద్య ద్వారా పొందే జ్ఞానం సమాజాన్ని పరివర్తన చెందించేదిగా, దోపిడీ పీడనల నుండి విముక్తి చెందించేదిగా ఉండాలి. మత విశ్వాసాలపై, అంధవిశ్వాసాలపై ఆధారపడే చదువులు కాకుండా తర్కబుద్ధిని, సృజనాత్మక, హేతుబద్ధ, విమర్శనాత్మక ఆలోచనలను, చారిత్రతక స్పృహను పెంచేదిగా చదువు ఉండాలి. కార్యకారణ సంబంధాలను అర్థం చేసుకునే శాస్త్రీయ విద్యా విధానంగా వుండాలి. నిరంతరం చలనంలో ఉన్న పదార్థాన్ని (ప్రకృతి, మానవసమాజం) ఉన్నదున్నట్టుగా అర్థం చేసుకునే గతితార్కిక భౌతికవాద దృష్టిని పెంపొందించేదిగా, శ్రమను, శ్రమజీవులను గౌరవించేదిగా విద్య ఉండాలి. ఉత్పత్తితో విద్యను జోడించాలి. పితృస్వామ్య, భూస్వామ్య, మార్కెట్ భావజాలాలను వ్యతిరేకించే విలువలతో కూడిన విద్యను నేర్పించాలి. ప్రజలందరికీ ప్రజాస్వామ్యం, ఎటువంటి వివక్షతలకు తావులేని సమానత్వం, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు వుండే నూతన ప్రజాస్వామిక దేశంగా, సోషలిస్టు దేశంగా భారతదేశాన్ని నిర్మించే లక్ష్యం కోసం విద్య ఉపయోగపడాలి. ప్రాథమిక దశలోనే ఉన్నప్పటికి దండకారణ్యంలోని విప్లవ జనతన సర్కార్ల ద్వారా నడుస్తున్న పాఠశాలలు ఈ దిశలో నడుస్తూ ప్రత్యామ్నాయ విద్యావిధానికి మార్గం చూపిస్తున్నాయి.

క్రాంతికారీ జనతన సర్కార్‌ల నాయకత్వంలో పాఠశాల విద్య: దండకారణ్యంలో బీజప్రాయంలో వికసిస్తున్న విప్లవ ప్రభుత్వాలు గత ఇరవై యేండ్లుగా పంచాయతి స్థాయిలోనూ, ఏరియా స్థాయిలోనూ ప్రాథమిక పాఠశాలలను, ఆశ్రమ పాఠశాలలను నిర్వహిస్తూ ఉచితంగా విద్యనందిస్తున్నాయి. వీటిలో 1 నుండి 5వ తరగతి వరకు బోధిస్తున్నారు. శత్రువు చేస్తున్న దాడుల్లో ఈ స్కూల్లు ఎన్నో సార్లు దెబ్బతిన్నాయి. కానీ తమ పిల్లలు తప్పక చదువుకోవాలన్న ప్రజల కోరిక, పిల్లల పట్టుదలతో నిత్యం దాడుల నడుమ కూడా సంవత్సరంలో 4 లేదా 5 నెలలైనా వీటిని నడిపేలా జనతన సర్కార్లు కృషి చేస్తున్నాయి. విప్లవ జనతన సర్కార్ పరిధిలోని గ్రామాల్లోని పిల్లలందరూ చదువుకునేందుకు అవసరమైనన్ని స్కూళ్లను ఏర్పాటు చేయలేకపోవడానికి శత్రు నిర్బంధం ముఖ్యమైన కారణం. శత్రు నిర్బధం వల్ల పిల్లలను పంపడానికి సిద్ధపడని కొన్ని చోట్ల తాత్కాలికంగా మూతపడ్డవి కూడా ఉన్నాయి.

ఈ పాఠశాలల నిర్వహణ మరియు బోధన దోపిడి ప్రభుత్వ పాఠశాలలకు పూర్తి భిన్నంగా జరుగుతుంది. విద్యార్థి కేంద్రంగా బోధన జరుగుతుంది. టీచర్లకు, విద్యార్థులకు మధ్య ప్రజాస్వామిక సంబంధాలు ఉండడం వల్ల విద్యార్థులు స్వేచ్ఛగా, సంతోషంగా చదువు నేర్చుకుంటున్నారు. టీచర్లు వేతనం కొరకు పని చేయడం కాకుండా సామాజిక స్పృహతో, సేవా దృక్పథంతో, చైతన్యంతో పిల్లల పట్ల ప్రేమ పూర్వకంగా, బాధ్యతగా మెలగుతూ పని చేస్తున్నారు. అందుకే నిర్బంధం వల్ల పాఠశాలల్లో సౌకర్యాల లేమి వున్నప్పటికీ (బోధనోపకరణాలు, సిలబస్ పుస్తకాలు) అవి ఉత్తేజకరమైన వాతావరణంలో నడుస్తున్నాయి. రోజువారీ పాఠశాల నిర్వహణలో విద్యార్థులు తమ వయసుకనుగుణంగా అప్పజెప్పిన పనులను చేస్తూ, రోజువారీ సమీక్షలలో తమ తప్పొప్పులను సరిచేసుకుంటూ చదువుకుంటున్నారు. కోతలు, నూర్పిళ్ళ సమయంలో వ్యవసాయ కార్యకలాపాలలో పాల్గొంటున్నారు.

శాస్త్రీయ విద్యావిధానం వెలుగులో ఈ పాఠశాలల్లో మాతృభాషలో తయారు చేసిన సిలబస్ పుస్తకాలనే బోధిస్తున్నారు. ఇక్కడి ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక జీవనానికి సంబంధించిన విషయాలను జోడిస్తూ భాష, గణిత్, సామాజిక శాస్త్రంలోని పాఠాలను బోధిస్తుండగా, హిందీభాషను 3వ తరగతి నుండి నేర్పడం జరుగుతున్నది. అంధవిశ్వాసాలు, మూఢనమ్మకాలు, స్త్రీలను చిన్నచూపు చూసే పితృస్వామ్య ధోరణులు, కుల భేదభావాలు తప్పని తెలియజేసే విషయాలతో కూడిన పాఠాలు, స్వార్థ బుద్ధిని విడిచి ప్రజలకోసం పనిచేయడమే గొప్ప విలువని తెలియజేసే పాఠాలనుండి, కథల నుండి సరైన సామాజిక విలువలను గ్రహిస్తున్నారు. పిల్లలందరు చదువుకోగలరు, అందరికి చదువు వచ్చేలా చెప్పడం టీచర్ల బాధ్యత అనే అవగాహనతో రకరకాల బోధనోపకరణాలను సృజనాత్మకంగా ఉపయోగించి నేర్పించడంపై టీచర్లకు సంవత్సరానికొకసారి ట్రైనింగ్ ఇస్తున్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి గురించి ఎప్పటికప్పుడు మూల్యాంకనం చేస్తూ వెనకపడ్డ విద్యార్థులపై మరింత కేంద్రీకరించి అభివృద్ధి చేస్తున్నారు.

జల్, జంగల్, జమీన్, ఇజ్జత్ మరియు అధికారం కోసం తమ కుటుంబాలు, ప్రజలు మావోయిస్టు పార్టీ నేతృత్వంలో పోరాటం చేస్తున్న వాతావరణంలో పుట్టి పెరుగుతున్న ఈ పిల్లల ఎటువంటి వివక్షతలు లేని, దోపిడి లేని సమ సమాజం కోసం ప్రాణాలర్పిస్తున్న ప్రజాయుద్ధ వీరుల గురించి తెలుసుకుంటూ, విప్లవ పాటలు పాడుతూ, సమాజం కోసం, ప్రజల కోసం పనిచేయడమే సరైన విషయమని గ్రహిస్తున్నారు. ఈ పాఠశాలలను 8వ తరగతి వరకు నిర్వహించాలన్న డిమాండ్ వస్తున్నప్పటికీ

***(మిగతాది 32వ పేజీలో...)***

# అంతర్జాతీయ శ్రామిక మహిళా దినపు 111 ఏళ్ళ వారసత్వాన్ని సమరశీలంగా కొనసాగిద్దాం!

## స్త్రీ విముక్తి పోరాటాలను బలోపేతం చేద్దాం!

## సామ్రాజ్యవాదానికి, బ్రాహ్మణీయ హిదూత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడుదాం!

1857, మార్చి 8న న్యూయార్క్ నగరంలోని బట్టల, జౌళి కర్మాగారాల్లో పనిచేసే మహిళా కార్మికులు నిరసన చేపట్టారు. పరిస్థితుల మెరుగుదలనూ, 10 గంటల పని దినాన్ని, సమాన హక్కులనూ, శ్రమకు తగిన వేతనాలనూ డిమాండ్ చేస్తూ వీరు కవాతు చేశారు. ఈ నిరసనకారులపై పోలీసులు దాడులు చేసి నిరసనను అణచివేశారు. అయితే అణచివేత పోరాటాలను శాశ్వతంగా రూపుమాపలేదనే సత్యాన్ని ఆవిష్కరిస్తూ ఈ మహిళలు రెండేళ్ల తర్వాత ఇదే నెలలో తమ మొదటి లేబర్ యూనియన్‌ను స్థాపించుకున్నారు. ఆ తర్వాతి సంవత్సరాల్లోనూ మార్చి 8న నిరసన ప్రదర్శనలు చేపడుతూనే ఉన్నారు.

51 సంవత్సరాల తర్వాత 1908, మార్చి 8న న్యూయర్క్‌లోని నిడిల్స్ తయారు (కుట్టుపని) చేసే మహిళా కార్మికులు తొలి మార్చి 8 పోరాటాన్ని గౌరవిస్తూ కవాతు చేశారు. మహిళలకు ఓటు హక్కు కావాలనీ, శ్రమను అతి చౌకగా దోచుకునే స్వెట్‌షాపులనూ, బాలకార్మిక వ్యవస్థనూ అంతం చేయాలనీ డిమాండ్ చేస్తూ వీరి కవాతు సాగింది. దీన్ని కొనసాగిస్తూ ఇదే సంవత్సరం వివిధ కుట్టు పని కర్మాగారాల్లో మహిళా కార్మికులు విధులను బహిష్కరించడం, సమ్మెలు చేయడం ప్రారంభించారు. పని గంటల తగ్గింపునూ, మెరుగైన వేతనం, ఓటింగ్ హక్కులను డిమాండ్ చేస్తూ ఈ సందర్భంగా 15 వేల మంది మహిళలతో ఒక భారీ ప్రదర్శన జరిగింది.

ఈ పోరాటాల పరంపర ఇలాగే కొనసాగుతూ 1909, నవంబర్ 22న 'అప్‌రైజింగ్ ఆఫ్ ట్వెంటీ థౌజండ్' (20వేల మంది తిరుగుబాటు) ప్రారంభమైంది. దీర్ఘకాలికమైన, కష్టతరమైన పోరాటాలను మహిళలు చేయలేరనే వాదనలను పటాపంచలు చేస్తూ ఈ సమ్మె కొనసాగింది. 13 వారాల పాటు, గడ్డకట్టించే చలిలో 16 నుంచి 25 సంవత్సరాల మధ్య వయసు యువతులు ప్రతిరోజు పికెటింగ్ చేశారు. ప్రతి రోజూ పోలీసుల లాఠీల దెబ్బలు తిన్నారు. అరెస్టులనూ, జైలు శిక్షలనూ ఎదుర్కొన్నారు.

అమెరికన్ మహిళా కార్మికులు చేసిన ఈ పోరాటాల పరంపర ప్రపంచ చిత్రపటంపై బలమైన ప్రభావాన్ని వేసింది. విదేశాల్లోని విప్లవ ప్రజానీకం, ఉద్యమకారులు సైతం ఎంతో ఉత్తేజాన్ని పొందారు. కామ్రేడ్ క్లారా జెట్కిన్‌ను సైతం ఈ పోరాటాలు గొప్పగా ఉత్తేజపరచాయి. ఈ నేపథ్యంలోనే ఆమె ప్రతి సంవత్సరం ఒక నిర్దిష్టమైన రోజున ప్రపంచవ్యాప్తంగా మహిళలు తమ డిమాండ్ల కోసం వత్తిడి తెచ్చేందుకు కేంద్రీకరించడం కోసం అంతర్జాతీయ మహిళా దినాన్ని స్థాపించాలని భావించింది. దాని కోసం ఒక ప్రణాళికను తయారు చేసి, 1910లో కోపెన్‌హేగెన్‌లో జరిగిన సోషలిస్టు మహిళా అంతర్జాతీయ మహాసభలో ప్రవేశపెట్టింది. ఆమె ప్రతిపాదన ఆ మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆ తర్వాత జరిగిన సాధారణ అంతర్జాతీయ సోషలిస్టు కాంగ్రెస్‌లో



డికె-దక్షిణ్ బస్తర్ జేగుర్‌గొండ ఏరియాలో మార్చి 8 సభ

ఈ సంవత్సరం మహిళా దినోత్సవాన్ని బ్రహ్మణీయ హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగాను, మహిళా రాజకీయ ఖైదీల విడుదలను డిమాండ్ చేస్తూ దండకారణ్య వ్యాప్తంగాను, తెలంగాణ, ఎఓబీ ప్రాంతాలలోను మార్చి 8 సభలు విజయవంతమయ్యాయి. జనతన సర్కార్ల ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలకు వందల సంఖ్యలోను, కొన్ని చోట్ల వేల సంఖ్యలోను మహిళలు పాల్గొన్నారు.

దీనిని మళ్లీ ఏకగ్రీవంగా ఆమోదించారు. అంతర్జాతీయ మహిళా దినాన్ని స్థాపించాలని ఓటు వేసిన వారిలో రష్యన్ విప్లవనేత కామ్రేడ్ లెనిన్ కూడా ఉన్నారు.

అంతర్జాతీయ లక్షణాన్ని కలిగి ఉండి, మహిళల హక్కుల ఉద్యమాన్ని గౌరవించేందుకూ, మహిళలకు విశ్వవ్యాప్త ఓటుహక్కును సాధించేలా సహాయం చేసేందుకూ స్థాపించబడిన ఈ అంతర్జాతీయ మహిళా దినం అమెరికా మహిళా కార్మికులు చేసిన పోరాటాన్ని స్మరించుకుంటుంది. ప్రపంచవ్యాప్తంగా మహిళా శ్రామికులను గౌరవిస్తుంది.




సామ్రాజ్యవాద పెట్టుబడి ప్రవాహంతో దేశంలో పేదరికం, నిరుద్యోగం నానాటికీ పెరిగిపోతున్నాయి. దేశంలో బ్రాహ్మణీయ హిందూత్వ ఫాసిస్టు దళారీ పాలకవర్గాల సామ్రాజ్యవాద అనుకూల విధానాలతో ప్రజలపై ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక దాడి నూతన రూపాలు తీసుకుంటున్నది. మనిషి మనిషిలా ఆలోచించలేని, జీవించలేని పరిస్థితులు సృష్టించడం దోపిడీ వర్గాలకు అవసరం. మహిళలపై అత్యాచారాలను ఈ నేపథ్యంలో చూసినప్పుడే సరైన అవగాహనకు రాగలుగుతాం.

దేశంలో బ్రాహ్మణీయ హిందూత్వ ఫాసిజం బలపడుతున్న కొద్దీ ఫాసిస్టు వ్యతిరేక ఉద్యమం, దాంతో పాటుగా మహిళా ఉద్యమ అవసరం పెరుగుతున్నాయి. పీడిత వర్గాల ప్రజలపై ఆర్థిక దోపిడీ పీడనలు పెరిగి ఆ వర్గాల మహిళలపై భారం మరింత పెరిగింది. ప్రత్యేక ఆర్థిక మండళ్లలో మహిళా శ్రామికుల సంఖ్య పెరుగుతుండడం చూస్తున్నాం. అసంఘటిత రంగంలోనూ మహిళా శ్రామికుల సంఖ్య పెరుగుతున్నది. ప్రభుత్వాల వివిధ పథకాలలో మహిళల శ్రమే కాకుండా వారి కొద్ది ఆదాయం కూడా దోపిడీ వర్గాల పెట్టుబడి సంచయనానికే ఉపయోగపడుతున్నది. మహిళలు విశాల ప్రపంచంలోకి రావడం ఒక ముందడుగే అయినప్పటికీ అంతకంటే వారి శ్రమ దోపిడీ వారికి కలిగిస్తున్న కష్టం, నష్టం ఎక్కువ. ఈ శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా పోరాడడంలో, అందుకోసం సామ్రాజ్యవాదానికి, దళారీ నిరంకుశ పెట్టుబడికి, భూస్వామ్యానికీ వ్యతిరేకంగా పోరాడడంలో, వాటిని అంతం చేసే విముక్తి మార్గంలో ప్రజలను, మహిళలనూ నడిపించడంలో మహిళా ఉద్యమం ప్రముఖంగా ఉండాలి.

దేశంలో సమస్యలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. పోరాడకుంటే బతకలేని పరిస్థితి దాపురించటంతో ఎక్కడిక్కడ అన్ని సెక్షన్ల ప్రజలు, అన్ని రంగాల ప్రజలు పాలకవర్గ దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాలు చేపడుతున్నారు. పోరాడుతున్న ప్రజలను, దానికి నేతృత్వం వహిస్తున్న పార్టీ కార్యకర్తలను బూటకపు ఎదురుకాల్పుల్లో హత్యలు గావిస్తున్నారు. ప్రజలు తమ నాయకుల విడుదల కోసం పోరాడుతున్నారు. డికె ఎస్‌జెడ్‌సి కార్యదర్శి వర్గ సభ్యురాలు కామ్రేడ్ నర్మదక్క ను అరెస్టు చేసి 80కి పైగా తప్పుడు కేసులు పెట్టి మహారాష్ట్ర జైల్లో నిర్బందించారు. భద్రాద్రి కొత్తగూడెం-తూర్పుగోదావరి డివిజన్ కమిటీ సభ్యురాలు కామ్రేడ్ సుజాత అనారోగ్యంతో హాస్పటల్‌లో ఉన్నప్పుడు పోలీసులు అరెస్టు చేసి తెలంగాణలో 40కి పైగా కేసులు పెట్టి, ఆ తర్వాత ఛత్తీస్‌గఢ్ కేసులు కూడా పెట్టి జగదల్పూర్ జైళ్ళో నిర్భంధించారు. నర్మదక్క, సుజాత లాంటి అక్కలు కాన్సర్ లాంటి అనారోగ్య సమస్యలతో కటకటాల మధ్య ఎన్నో బాధలను ఎదురుకుంటూ పోరాడుతున్నారు. మహిళల హక్కుల కోసం మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా, పితృస్వామ్య హింసకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. దేశంలో జరుగుతున్న ప్రజా ఉద్యమాలలో మహిళల భాగస్వామ్యం పెరిగింది. విప్లవోద్యమం చూపిస్తున్న ప్రజాయుద్ధ మార్గంలో విప్లవ మహిళా ఉద్యమాన్ని మరింత బలంగా నిర్మిస్తూ, పురోగమింపచేద్దాం. ★

జార్ఖండ్ రిపోర్టు–

# కేంద్ర ప్రభుత్వం నెలకొల్పుతున్న కొత్త సి.ఆర్.పి.ఎఫ్. క్యాంపులకు వ్యతిరేకంగా ఆదివాసీ సంతాల్ ప్రజల నిరసన

*(జార్ఖండ్‌రాష్ట్రంలోని గిరిడి జిల్లాలో కేంద్ర ప్రభుత్వం నెలకొల్పుతున్న కొత్త సి.ఆర్.పి.ఎఫ్. క్యాంపులకు వ్యతిరేకంగా నిరసన తెలియజేస్తున్న ఆదివాసీ సంతాల్ గ్రామస్థులపై జరుగుతున్న దాడులు, అణచివేతలకు సంబంధించి సి.డి.ఆర్.ఓ. 2021 మార్చి 5,6,7వ తేదిలలో జరిపిన నిజనిర్ధారణ రిపోర్టు)*

2021 మార్చి 5,6 తేదీల్లో, సీ.డి.ఆర్.ఓ, హెచ్.ఆర్.ఎల్.ఎన్. మానవ హక్కుల నిజనిర్ధారణ బృందం గిరిడీ జిల్లాలోని మధుబన్, డుమ్రీ, పిర్తాండ్ అనే మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రాంతాలకు వెళ్ళి, అక్కడ కొత్తగా కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్న పారా మిలిటరీ క్యాంప్‌లకు వ్యతిరేకంగా జరుగుతున్న భారీ ప్రజా నిరసనకు సంబంధించి గ్రామస్థులను కలిసి పూర్తి సమాచారాన్ని సేకరించింది.

గిరిడీ జిల్లాలో అనేక సీ.ఆర్.పీ.ఎఫ్. శిబిరాలు నిర్మాణమవుతున్నాయనీ, వాటిని గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారనీ దేశంలోని ప్రధాన వార్తా పత్రికలలో 2020 డిసెంబర్, 2021 జనవరిలలో వార్తలు వచ్చాయనే విషయం తెలిసిందే. ఈ విషయంపై గ్రామస్థులు, ప్రభుత్వానికి మధ్య చాలా ఘర్షణలు జరిగాయి. చాలా మందిపై ఎఫ్.ఐ.ఆర్.లు పెట్టారు, అరెస్టులు కూడా జరిగాయి.

ఈ ప్రదేశంలో నివసించేవారు ప్రధానంగా ఆదివాసీలు, ఈ ప్రాంతంలో అధిక అటవీప్రాంతం, కొండలతో పాటు, ఆహార, ఖనిజ సంపద పుష్కలంగా ఉంది. స్థానిక ప్రజలకు ఉన్న అటవీ, భూ హక్కులను, గ్రామసభ హక్కును కూడా ప్రభుత్వం మొదటి నుండి పట్టించుకోలేదు. ఈ రోజు వరకు, అటవీ హక్కుల చట్టం 2006 ప్రకారం వ్యక్తిగత, సాముదాయిక హక్కు పత్రాలు ఇవ్వలేదు. అనే విషయాలు విచారణ క్రమంలో తెలిసాయి.

నక్సలైట్‌లకు వ్యతిరేకంగా పోలీసులు, సిఆర్‌పిఎఫ్ ఈ ప్రాంతంలో చేపట్టిన ప్రచారం వల్ల, ఇప్పటికే ప్రజలు ఆర్థిక, సాంస్కృతిక, సామాజిక సమస్యలను ఎదుర్కొంటున్నారు. భవిష్యత్‌లో ఏ విధమైన అణచివేతను నడుపుతోందో తమకు తెలియదని, ఈ కారణంగా తాము, రాబోయే తరం నిరంతరం భయంతో జీవితాన్ని గడపవలసి ఉంటుందని ఇక్కడి ప్రజలు అంటున్నారు.

చింగియాపహరి, టెస్ఫులి, బారియార్పూర్, జీత్పూర్, భన్పురా, కరిపహరి, బెల్థాన్, తరాతాండ్ ప్రాంతాలలోని మొత్తం 16 గ్రామాల నుండి మహిళలు, పిల్లలతో సహా గ్రామస్తుల నుండి నిజనిర్ధారణ బృందం సేకరించిన సమాచారంలో ఈ క్రింది విషయాలు తెలిసాయి.

1. **అత్యాచారం–టెస్‌పులి** ప్రాంతంలో భద్రతా దళాలు ఒక అత్యాచారం చేశారు.

2. లైంగిక వేధింపులు–భన్పురాలో 7 మంది మైనర్ బాలికలను భద్రతా దళాలు లైంగిక వేధింపులకు గురిచేశాయి.

3. బూటకపు ఎన్‌కౌంటర్–డోల్‌కట్టాలో జరిపిన ఒక బూటకపు ఎన్‌కౌంటర్‌లో ఒక కార్మికుడిని హత్య చేసారు.

4. కస్టడీలో మరణం– పిర్తాండ్ పోలీస్ స్టేషన్‌లో ఝుర్వా గ్రామ నివాసిని పోలీసు కస్టడీలో హత్య చేశారు. ఈ వ్యక్తికి పిర్జాండ్ పోలీస్ స్టేషన్ ప్రక్కనే హోటల్ ఉందని, పోలీస్ స్టేషన్, భద్రత సిబ్బందికి అక్కడే ప్రతిరోజూ టీ, అల్పాహారం తయారవుతుందని తెలిసింది.

5. కస్టడీలో చిత్రహింస–తార్‌టాండ్ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని గిరిడీలోని ఎస్పీ బంగ్లాలో అమానుషంగా కొట్టారు. కరీఫారి గ్రామానికి చెందిన మన్‌రేగా కార్మికుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని దారుణంగా కొట్టారు. అతని మొబైల్, బైక్, బ్యాంక్ పాస్‌బుక్, 15 మంది ఎంఎన్‌ఆర్‌ఇజిఎ సిబ్బంది జీతం జాబితాను పోలీసులు లాక్కున్నారు. ఈ సంఘటన కారణంగా, 15 మంది ఎంఎన్‌ఆర్‌ఇజిఎ కార్మికులకు ఇప్పటి వరకు 2 వారాల జీతం అందలేదు.

6. మహిళలు, పిల్లలు, అమాయక గ్రామస్తులను కొట్టిన ఘటనలు దాదాపు అన్ని గ్రామాల్లో జరిగాయి. కొంత మంది గ్రామస్తుల ఇళ్ళను కూడా కూలగొట్టేశారు. అప్పుడప్పుడు భద్రతా దళాలు రాత్రి, పగలూ కూడా దాడి చేశాయి. ఇళ్ల నుంచి డబ్బు, నగలు దోచుకెళ్లిన సంఘటనలు కూడా ఉన్నాయి. తరచుగా ఇళ్లలో ఉంచిన, పంట, ధాన్యాలు వుంచిన గాదెలను కూడా దాడుల సమయంలో నాశనం చేశారు. ఈ రకమైన దాడులలో మహిళా పోలీసులు ఉండరు, దాదాపు ప్రతి దాడిలోనూ మహిళలను

**కడియమెట్ట ఘటన లో మార్చి 22న పీఎల్‌జీఏ మందు పాతర పేల్చి డిఆర్‌జీ బలగాలకు చెందిన ఐదుగురిని హతమార్చి, 14 మందిని గాయపరిచింది.**

గత 4 నెలల కాలంలో 3 దశలలో వేలాదిమంది ప్రజలు రోడ్ల మీదకు వచ్చి పోలీసు క్యాంపులను ఎత్తివేయాలని, కూంబింగ్ ఆపరేషన్లు ఆపాలని, ప్రజలపై వివిధ రూపాలలో జరుగుతున్న పాశవిక దమనకాండకు నిరసనగా ప్రదర్శనలు జేసారు. అయినా ఫలితం లేకుండా పోవడంతో పీఎల్‌జీఏ బలగాలు మార్చి 22న కూంబింగ్‌కు వెళ్ళి హెడ్‌క్వార్టర్‌కు తిరిగివస్తున్న బలగాలు ప్రయాణిస్తున్న బస్సును రిమోట్ సహాయంతో ఐఏడి ని పేల్చడంతో ఐదుగురు డిఆర్‌జీ పోలీసులు అక్కడికక్కడే చనిపోయారు. 14మంది గాయపడ్డారు. 90 మంది ఈ కూంబింగ్ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. ఇది ఈ ఏడాది పీఎల్‌జీఏ చేసిన మొదటి పెద్ద ఘటన. గత ఏడాది మార్చి 21న సుక్మా జిల్లాలో మినప దగ్గర జరిగిన ఎన్‌కౌంటర్లో 17 మంది డీఆర్‌జీ పోలీసులను పీఎల్‌జీఏ చంపిన విషయం తెలిసిందే.

వేదింపులకు గురి చేస్తారు, అసభ్యంగా ప్రవర్తిస్తారు.

ఉపా, సిఎల్ఎ చట్టాలను ఈ ప్రాంతాలలో దుర్వినియోగం చేశారు. అమాయక గ్రామస్తులపై అణచివేతను ప్రయోగించి భయ వాతావరణాన్ని సృష్టించారు. పియర్టాండ్ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జి వెంటనే ఉపా కింద తప్పుడు కేసు పెట్టి జైలుకు పంపాడనే దిగ్భ్రాంతి కలిగించే కేసు కూడా ఒకటి ఉంది. ప్రస్తుతం ఈ వ్యక్తి బెయిల్‌పై ఉన్నారు.

భద్రతా దళాలు చేస్తున్న ఈ నిరంతర హింసను దృష్టిలో ఉంచుకునే సిఆర్‌పిఎఫ్ శిబిరాన్ని అన్ని వర్గాల వారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిసింది. తమ దబ్బుతోనే ప్రభుత్వం తమపై దారుణాలు, దోపిడీలు చేస్తోందని వారు అంటున్నారు.

సిఆర్‌పిఎఫ్ క్యాంపు వద్దని, ఆసుపత్రి, పాఠశాల, ఉపాధి, అభివృద్ధి కావాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. తమ ప్రార్థనా స్థలం, స్మశానం, మైదానాల్లో బలవంతంగా సిఆర్‌పిఎఫ్ క్యాంపుని నిర్మించిందని గ్రామస్తులు తెలిపారు. ఐదవ షెడ్యూల్ ప్రాంతం అయినప్పటికీ, క్యాంపు ఏర్పాటు చేయడానికి గ్రామసభ నుండి అనుమతి తీసుకోలేదు.

బాధితులకు ఎలాంటి చట్టపరమైన, న్యాయ సేవలు అందవు. అక్కడి అడవుల్లో నివసించే గ్రామస్తులకు కట్టెలు కొట్టడం లేదా పండ్లు, పువ్వులు కోసుకోవడం లేదా చిన్న జంతువులను వేటాడటం వంటి అటవీ హక్కులన్నింటినీ నిరాకరించారు.

ఈ కేసులే కాకుండా, మధుబన్‌లోని కూలీల సమస్యలు కూడా ముందుకొచ్చాయి. అంతకు ముందు తమకు యూనియన్ ఉండేదని, ప్రజలందరికీ ఉచిత చికిత్స అందించడానికి యూనియన్ ఆసుపత్రులను నడిపేదనీ, కార్మిక హక్కులు పరిరక్షించబడేవి అని, కానీ ఆ యూనియన్‌పై తప్పుడు ఆరోపణలు చేసి నిషేధించారని కార్మికులు అంటున్నారు. నేడు, అన్ని చోట్ల కూలీలకు తక్కువ వేతనాలు ఇవ్వడం గురించి చర్చ జరుగుతోంది. ఈ సమస్యకు సంబంధించి ఒక ధర్మశాల కార్మికులు 21 మంది ధర్నాకు కూర్చున్నారు. ఈ కార్మికులను వారి ఉద్యోగాల నుండి తీసేస్తున్నారు. వీరికి ఎలాంటి సామాజిక భద్రత లేదు.

గిరిడికి చెందిన ఒక సాంస్కృతిక సంఘం 'జార్ఖండి ఎవన్' కూడా నిషేధానికి గురైంది. ఈ సంస్థ తన పాటలు, నాటకాల ద్వారా వరకట్న వ్యవస్థ, మంత్రగత్తె వ్యవస్థ, మూఢనమ్మకం, విద్య మొదలైన వాటిపై ప్రజలకు అవగాహన కల్పించేది. నేడు, చాలా మంది సాంస్కృతిక కార్యకర్తలపై కేసులు పెట్టారు, అనేక మందిని అరెస్టు చేశారు.

ఈ విషయాలన్నీ దృష్టిలో ఉంచుకుని, నిజనిర్ధారణ బృందం ఈ క్రింది డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచుతుంది.

1. అమాయక గ్రామస్తులపై నమోదు చేసిన తప్పుడు కేసులన్నింటినీ ఎత్తివేసి, వారందరినీ వెంటనే బేషరతుగా విడుదల చేయాలి. 2. అదుపులోకి తీసుకున్న వారిపై జరుపుతున్న హింసను వెంటనే ఆపాలి. కస్టోడియల్ మరణాన్ని సుప్రీంకోర్టు, జాతీయ మానవ హక్కుల కమీషన్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఒక స్వతంత్ర ఏజెన్సీతో దర్యాప్తు చేయించాలి. 3. ఐక్యరాజ్యసమితిలో ప్రభుత్వం ఆమోదించిన సామాజిక అభివృద్ధిని పూర్తి చేయడం ద్వారా ఇక్కడి సముదాయపు అభివృద్ధి పనులు పూర్తి చేయాలి. 4. అటవీ హక్కుల చట్టం ప్రకారం, అడవుల్లో నివసించే ప్రజలకు అడవిపై సాముదాయిక హక్కులను ప్రభుత్వం వెంటనే ఇవ్వాలి. 5. ఐదవ షెడ్యూల్ ప్రాంతాలలో, గ్రామసభ అనుమతి లేకుండా ఎటువంటి పని చేయకూడదు, పెసా చట్టంలో ఇచ్చిన నిబంధనలను ప్రభుత్వం పాటించాలి. 6. బాధితులందరికీ ఉచిత న్యాయ సేవ అందించాలి. 7. న్యాయమూర్తి డి.కె బసు సూచనలను ఖచ్చితంగా పాటించాలి. ★

## డిసెంబర్ 26, 2020న

# ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టు పార్టీ 52వ వార్షికోత్సవం

ఫిలిప్పైన్స్‌లోని గెరిల్లా ఫ్రంట్లలోనూ, కమ్యూనిటీలలో పార్టీ 52వ వార్షికోత్సవ సభలను ఎంతో ఉత్సాహభరితంగా డిసెంబర్ 26, 2020న జరుపుకున్నారు. ప్రభుత్వ బలగాల ఫాసిస్టు దాడుల నడుమనే ప్రజలు, కార్యకర్తలు హాజరై గతంలో పార్టీ సాధించిన విజయాలను, విప్లవోద్యమం గడించిన అనుభవాలను మరొక్క సారి మననం చేసుకుని, దాని నుండి పొందిన స్ఫూర్తితో మరింత పురోగమించాలని అనుకున్నారు.

ఇల్లోకో, కోర్డిలెరా ప్రాంతం, దక్షిణ తగలాగ్ ప్రాంతం, దక్షిణ మిండనావో ప్రాంతం, ఉత్తర, తూర్పు మిండనాలో ప్రాంతాలలో ఈ సభలు జరిగినట్లు తెలుస్తున్నది. దక్షిణ మిండనావో ప్రాంతంలో ఈ సభలతో పాటు, పార్టీ ప్రాథమిక రాజకీయ కోర్సుకు సంబంధించిన సభలు కూడా జరిగాయి. ఇవి యన్‌పిఎ క్యాంపులో జరిగాయి.

ఉత్తర-మధ్య మిండనావో ప్రాంతంలో విప్లవ శక్తులు శత్రు పాశవిక దాడులను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. పార్టీ తన శక్తులను కూడగట్టుకుని రానున్న సంవత్సరంలో శత్రువును గట్టిదెబ్బ తీయాలని తయారుగా ఉన్నది. 2020లో యన్‌పిఎ శత్రువు మీద 92 సైనిక చర్యలు చేసింది. ఫిలిప్పైన్ సైన్యాలు, పారామిలిటరీ బలగాలు ఈ ప్రాంతంలో మైనింగ్ కంపెనీల మరియు ప్లాంటేషన్ ప్రయోజనాలను నెరవేర్చే కిరాయి మూకల పని చేస్తున్నాయి.

ఈ ప్రాంతంలో విప్లవ శక్తులు భూస్వాములకు వ్యతిరేకంగా, ప్రభుత్వ ఏజెన్సీలకు వ్యతిరేకంగా పెద్ద అభియాన్‌లను చేపట్టి వారి కార్యకలాపాలను స్థంబింపజేశారు. ఈ పోరాటాల ద్వారా శ్రామికజనం తమ కూలీరేట్లను, ఇతర డిమాండ్లను సాధించుకున్నారు. వీటి ద్వారా వారు తాము పండించిన పంటల రేట్లను కూడా పెంచుతున్నారు. కమ్యూనిటీలలో ప్రజలు ప్రభుత్వ ఫాసిస్టు దమనకాండను ఎదిరించి నిలబడినారు. ప్రభుత్వ సాయుధ బలగాల బాంబింగ్ దాడులలో 18 మంది ఎర్రయోధులు అమరులయ్యారు. సాయుధ ఘర్షణలలో 9 మంది ఎర్ర యోధులు అమరులయ్యారు. రీజనల్ కమిటీ ఈ ఎర్రయోధులందరికీ వినమ్రంగా జోహార్లు అర్పించింది.

ఉత్తర-తూర్పు మిండనావో ప్రాంతంలో విప్లవోద్యమం 2020లో ప్రభుత్వ పాశవిక దమనకాండను ఎదిరించి నిలబడింది. ప్రభుత్వ సాయుధ బలగాల సమూల నిర్మూలన దాడులను యన్‌పిఎ సమర్థవంతంగా ఎదుర్కోవడంలో చొరవను చూపించింది. ఎర్రయోధులు ప్రభుత్వ బలగాల నుండి ఒక ప్లటూన్‌కు సరిపడే ఆయుధాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ కిరాయి బలగాల మీద 98 మిలిటరీ చర్యలను చేసింది. ఒక కంపెనీ కిరాయి బలగాలను నిర్మూలించింది.

పనాయ్: ఈ ప్రాంతంలో విప్లవ నిర్మాణాలలో ప్రజల సభ్యత్వం పెరిగిందని రీజినల్ పార్టీ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. విప్లవ సైన్యం వ్యవసాయక విప్లవ కార్యక్రమాలలో భాగంగా కొన్ని సంస్కరణల అమలుకు క్యాంపెయిన్ల ద్వారా ప్రచారం చేసారు. ఖాళీగా ఉన్న భూములను ప్రజలు సాగు చేసుకునే హక్కు గురించి, శాంతి గురించి, ప్రజల ప్రయోజనాల కోసం పెద్ద ఎత్తున ప్రజా ఆందోళన చేపట్టాలని ప్రచారం చేసారు.

నేగ్రాస్ ప్రాంతంలో ఉద్యమం అన్ని విషయాలలో పురోగమించింది. విప్లవోద్యమం సిద్ధాంతపరం గానూ, రాజకీయం గానూ, నిర్మాణపరం గానూ అభివృద్ధిని సాధించిందని రీజినల్ పార్టీ కమిటీ తెలియజేసింది. ప్రభుత్వ పాశవికత దమనకాండ ఒకవైపు, కోవిడ్-19 సమస్య మరోక వైపు ఉన్నప్పటికీ ఈ విషయాలలో అభివృద్ధిని సాధించింది. రీజినల్ స్థాయిలో గత 25 సంవత్సరాల అనుభవాన్ని సిద్ధాంత పరంగా పార్టీ బ్యాచీలలో చర్చించి మదింపు చేశారు. మధ్య నేగ్రాస్ ప్రాంతంలో 2020లో 200 మంది పార్టీ సభ్యులు ప్రాథమిక, మాధ్యమిక పార్టీ రాజకీయ కోర్సులను పూర్తి చేసారు. రీజినల్ పార్టీ క్యాడర్లు పై స్థాయి కోర్సులను అధ్యయనం చేయగల స్థితికి చేరుకున్నారు. ఈ ప్రాంతంలో నిర్వహించిన విద్యా సమ్మేళనం తీర్మానాల వెలుగులో విద్యా క్యాంపెయిన్‌ను నిర్వహించారు.

నిర్మాణ రంగంలో, ప్రజాసంఘాలు తమ తమ సంఘాల సమావేశాలు, కాన్ఫరెన్సులు నిర్వహించుకొని, నాయకత్వాన్ని ఎన్నుకొనే స్థితికి చేరుకున్నాయి. రైతు సంఘాలను, మహిళా, యువజన సంఘాలను కొత్తగా నిర్మాణం చేసారు. ప్రజా సంఘాల సభ్యత్వం 10% నుండి 15% వరకు పెరిగింది. ప్రజా పునాది 5% నుండి 10% వరకు పెరిగింది.

రైతాంగం, భూస్వామ్య వ్యతిరేక రాజకీయ పోరాటాలతో పెద్ద ఎత్తున రైతాంగ వ్యవసాయ విప్లవ క్యాంపెయిన్‌లలో పాల్గొన్నారు. పార్టీ పెద్ద ఎత్తున కరప్రతాల ద్వారా కొవిడ్-19 గురించి ప్రజల్లో ప్రచారం చేసింది. ప్రజలకు వైద్యం చేసింది. సెంట్రల్ ప్రాంతంలో

2000 మందికి వైద్యం చేసింది. 2020లో ఈ ప్రాంతంలో ప్రభుత్వ సాయుధ బలగాల మీద 30 మిలిటరీ ఎత్తుగడల దాడులను నిర్వహించి, కొన్ని చర్యలను నిర్వహించి 75 మంది కిరాయి మూకాలను నిర్మూలించింది.

## ఒక ప్రభుత్వ కిరాయి సైనికుడు ఆయుధాలతో సహా యన్‌పిఎకి లొంగిపోయాడు.

ఫిలిప్పైన్స్ ప్రభుత్వ కిరాయి సైనిక బలగాలలోని ఒక సైనికుడు ఒక అధికారిని చంపి ఆయుధాలతో సహా యన్‌పిఎకి లొంగిపోయాడు. ప్రభుత్వ బలగాలలోని 46వ ఐబి అధికారిని ఆ సైనికుడు తన వద్దనున్న ఆయుధంతో హతమార్చి, 2020 సెప్టెంబర్‌లో బరాంగ్వే, బొగొ పినాబాగద ప్రాంతంలో యన్‌పిఎకి లొంగిపోయాడు. ఈ ఘటనకు ముందు ఆ సైనికుడు ఈ ప్రాంతంలో పెట్రోలింగ్‌కు పోవడానికి నిరాకరించాడు. యన్‌పిఎ దాడుల భయంతో అలా చేసాడు. తన పై అధికారులు తనను వేధించడాన్ని తట్టుకోలేక హతమార్చాడు. తన వద్ద ఉన్న ఆర్4 రైఫిల్‌ను, ఫిస్టల్‌ను యన్‌పిఎకు ఒప్పగించి శరణు కోరాడు. 2 వారాల తర్వాత పెలాను మడదావత్ మనాంగ్ ఏరియాలలోని గ్రామాల నుండి, పట్టణల నుండి 46వ, 13వ ఐబిలకు చెందిన ప్రభుత్వ కిరాయి సైనిక బలగాలు ఆ ప్రాంతాన్ని ఖాళీ చేసి వెళ్ళి పోయాయి.

నెగ్రోస్ ఒరియంటల్ ప్రాంతంలో డిసెంబర్ 24, 2020న యన్‌పిఎతో జరిగిన సాయుధ ఘర్షణలో 11వ ఐబికి చెందిన లెఫ్టినెంట్ సైనికుడు చావగా మరో ఇద్దరు గాయపడ్డారు. దీనిలో ఇద్దరు యన్‌పిఎ కేడర్ కూడా అమరులయ్యారు.

తూర్పు సాయర్ ప్రాంతంలో యన్‌పిఎ మిలిటరీ ట్రైనింగ్ నిర్వహించింది.

2020 అక్టోబర్ నెలలో ప్రభుత్వ సాయుధ బలగాల ఆపరేషన్స్ మధ్యనే తూర్పు సాయర్ ప్రాంతంలో యన్‌పిఎకి చెందిన ఒక ప్లటూన్ బేసిక్ మిలిటరీ రాజకీయ కోర్సును (బిపియమ్‌సి) నిర్వహించింది. రీటూల్డ్ కమ్యూనిటీ సపోర్ట్ (ఆర్‌సిఎస్‌పి) అనే పేరుతో మిలటరీ ఆ ప్రాంతమంతా ఆపరేషన్స్ చేపట్టినప్పటికి ఎర్రయోధులు 12 రోజులు మిటిటరీ శిక్షణను విజయవంతం చేసారు.

డిటార్టే ప్రభుత్వ సాయుధ బలగాల దాడులను తిప్పి కొట్టే విధంగా మిలటరీ టెక్నిక్‌లను శిక్షణా కార్యక్రమంలో ఇచ్చారు. స్థానిక ప్రజా సంఘాలు ఈ ట్రైనింగ్ కార్యక్రమానికి సంబంధించిన భద్రతా ఏర్పాట్లను, అన్నీ రకాల సరఫరాలను చూసారు.

శిక్షణా కార్యక్రమం ముగింపులో, శిక్షణ పొందిన విద్యార్థులు ప్రభుత్వ దాడులను తిప్పికొట్టగలమనే విశ్వాసాన్ని వ్యక్తం చేసారు. శిక్షణ పూర్తయిన వెంటనే ఒక యూనిట్ ఆర్‌సిఎస్‌పి ఆపరేషన్స్‌ను ఎదుర్కోవడానికి వెళ్ళింది. ★

---

### ఉత్తర గడ్చిరోలి అమరులకు జోహార్లు

2021 మార్చి 29న మహారాష్ట్రలో గడ్చిరోలి జిల్లా కోర్చి ప్రాంతంలో సి-60 పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్‌లో డికె ఎస్‌జెడ్‌సీ సభ్యుడు కామ్రేడ్ భాస్కర్‌తో పాటు ఐదుగురిని హత్య చేశారు.

అమరులైన కామ్రేడ్స్ వివరాలు–

రావ్‌జీ హిచ్చామి (రుషి, భాస్కర్, పవన్), 46 సంవత్సరాలు . దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు, ఉత్తర్ గడ్చిరోలి డివిజనల్ కమిటీ కార్యదర్శి. జారవెండి పిఎస్ పరిధిలోని జెవేలి గ్రామం.

బుదయ్ సింగ్ నేతామ్ (సుఖ్‌దేవ్, రాజు), 32 సంవత్సరాలు. టిప్రాగాఢ్ ఏరియా కమిటీ సభ్యుడు, టిప్రాగాఢ్ దళం డిప్యూటీ కమాండర్. సావర్‌గావ్ పిఎస్ పరిధిలోని మర్కేగావ్.

యోగిత పద్ద (అస్మిత), 22 సంవత్సరాలు. భాస్కర్ గార్డు, పార్టీ సభ్యురాలు. కటేజరి పిఎస్ పరిధిలోని గొర్రెకస గ్రామం.

పునిత గావుడే (కమల, సుజాత), 28 సంవత్సరాలు. పార్టీ సభ్యురాలు, పిఎల్ 15లో పని చేసింది. అహేరి ఏరియా కప్పెవంచ గ్రామం.

ముయా కుంజాం (అమర్), 30 సంవత్సరాలు. పార్టీ సభ్యుడు. కసమ్‌సూర్ ఎల్‌ఓఎస్. దక్షిణ్ బస్తర్ డివిజన్ జేగురుగొండ ఏరియా.

ఈ బూటకపు ఎన్‌కౌంటర్‌కు నిరసనగా పశ్చిమ సబ్ జోనల్ (బ్యూరో) కమిటీ ఎప్రిల్ 12న బంద్ పాటించాలని ఒక ప్రకటన విడుదల చేసింది.

**ఉత్తర్ గడ్చిరోలి అమరులకు వినమ్రంగా జోహార్లు చెబుదాం. వారి ఆశయ సాధనకు పునరంకితమవుదాం!**

# డీకే ఉత్తర సబ్‌జోనల్ కమాండ్ సభ్యుడు, ఉత్తర బస్తర్ డివిజన్ కమాండర్ ఇన్‌చీఫ్ కామ్రేడ్ వెడద మన్నీ (వత్తే), సోమ్‌జీ కి జోహార్లు!

2021 ఫిబ్రవరి 18న ఉదయం 6 గంటల 40 నిమిషాలకు ప్రమాదవశాత్తు కుక్కర్ బాంబు పేలిన దుర్ఘటనలో కామ్రేడ్ సోమ్‌జీ అమరుడయ్యాడు.

ఉత్తర బస్తర్ డివిజన్ ప్రతాప్‌పూర్ ఏరియా-కాంకేర్ జిల్లా కొయిలీబెడ బ్లాక్-కందాడి పంచాయితీ ఆల్‌దండి గ్రామంలో 1985లో వెడద మన్నీ పుట్టాడు. మధ్యతరగతి కుంటుంబంలో పుట్టిన మన్నీకి వత్తే అని మరో పేరు ఉంది. ఆ కుంటుంబంలో తనే మొదటి సంతానం. క్రిష్టియన్ మిషనరీ స్కూల్‌లో ఆరోవ తరగతి వరకు చదువుకున్నాడు. ప్రతాప్‌పూర్ ఏరియా గ్రామాల్లో విప్లవోద్యమ కార్యకలాపాల ప్రభావంతో మన్నీ చిన్నతనం నుండే ఉత్సాహంగా కార్యక్రమాలలో పాల్గొనేవాడు. బాలల సంఘంలో పనిచేసి క్రమంగా మిలీషియా చర్యలలో చురుగ్గా పాల్గొన్నాడు.



2005లో దళంలోకి భర్తీ అయిన మన్నీ 2 సంవత్సరాల పాటు విద్యార్థి రంగంలో ఆర్గనైజర్‌గా పని చేసాడు. విద్యార్థులను కూడగట్టి అనేక పోరాటాలు చేయడంతో పాటు విద్యార్థులలో విప్లవ రాజకీయాలను ప్రచారం చేసాడు.

పార్టీ అవసరాల రీత్యా తన పేరును సహదేవ్‌గా మార్చుకుని కొరియర్‌గా పని చేసాడు. ఏరియా కమిటీ సభ్యుడుగా తనకిచ్చిన బాధ్యతను క్రమశిక్షణతో నిర్వహించాడు. కామ్రేడ్ సహదేవ్ తిరిగి ఏరియాలోకి వచ్చి తన పేరు సోమ్‌జీగా మార్చుకుని దళాల్లో పని చేసాడు. 2012లో డివిసిలోకి ప్రమోట్ అయిన సోమ్‌జీ ఉత్తర బస్తర్ డివిజన్‌లో 2013 నుండి కమాండర్ ఇన్ చీఫ్‌గా ఉంటూ, తను అమరుడయ్యే వరకు సుదీర్ఘకాలం అదే బాధ్యతలను నిర్వహిస్తూ వచ్చాడు. ఒక సంవత్సర కాలం 5వ కంపెనీలో సీవైపీసీ సభ్యుడుగా కూడా పని చేసాడు. మిలటరీ ప్రధాన బలగాలలోనే ఉండి పనిచేయడానికి, నేర్చుకోవడానికి ప్రయత్నించాడు. ఇచ్చిన బాధ్యతలు నెరవేరుస్తూ అందరి విశ్వాసాన్ని పొందాడు.

కామ్రేడ్ సోమ్‌జీ అనేక మిలటరీ చర్యలలో పాల్గొన్నాడు. ప్రజా వ్యతిరేకులపై పార్టీ నిర్ణయించిన చర్యలను అమలు చేయడంలో ముందుండే వాడు. పోలీస్ బ్యాచ్‌లపై చేసిన ఆంబుష్‌లలో, దాడులలో అనేక సార్లు పాల్గొన్నాడు. కొన్ని చర్యలలో కమాండర్ స్థాయిలో నాయకత్వం అందించాడు. కేశకల్ ఏరియాలోని తేవడాలో, ప్రతాప్‌పూర్ ఏరియాలోని మహల్లా-1,2,3 చర్యలలోను మిలిటెంట్‌గా బలగాలను నడిపించి ఆచర్యలు విజయవంతం కావడంలో విశేషంగా కృషి చేసాడు. కఠిన పరిస్థితుల్లో కూడా టీసీఓసీలకు నాయకత్వం అందించాడు. నాయకత్వం రక్షణకు ప్రాధాన్యతనిచ్చి చురుకుగా బలగాలను కదిలించేవాడు.

కామ్రేడ్ సోమ్‌జీకి వాలీబాల్ ఆటలో మంచి ప్రావీణ్యం ఉంది. గోండీ భాషను మాడియా యాసలో మాట్లాడే సోమ్‌జీ ఉరావ్, హిందీ, ఛత్తీస్‌గఢీ భాషలు నేర్చుకున్నాడు. అందరితో మంచిగా కలిసిపోయే స్వభావం గల సోమ్‌జీని అందరూ ప్రేమించుతారు. మిమర్శ చేసిన వాళ్ళతో వెంటనే కలిసిపోయే సోమ్‌జీ, ఉన్న దానిని ఉన్నట్లుగా మాట్లాడడం వలన అందరికి అభిమానం ఉంటుంది. ప్రజలతో కలిసి పోవడం, వారి నుండి నేర్చుకోవడంతో ఆర్గనైజేషనలు సమర్థలు పెరిగాయి. చదవడం ద్వారా, వినడం ద్వారా గ్రహించిన విషయాలను మంచిగా విశ్లేషించి చెపుతాడు. పూర్తి విశ్వాసాన్ని కలిగి పని చేస్తాడు. దశాబ్దానికి పైగా ఉత్తర బస్తర్ ఉద్యమంలో భాగస్వామిగా ఉన్న సోమ్‌జీ అక్కడే పుట్టి పెరిగిన నాయకుడు, యోధుడు. సోమ్‌జీ తన పనిలో భాగంగా విశాల ప్రజానీకంతో మంచి సంబంధాలు కొనసాగించాడు. ఇటీవల గార్ప లాంటి చోట్ల పోలీసు క్యాంపులకు వ్యతిరేకంగా ప్రదర్శనలు జరిగాయి. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పోలీసులను లక్ష్యంగా చేసుకుని బూబీట్రాప్ పెడుతున్న క్రమంలో 8 కేజీల కుక్కర్ బాంబు ప్రమాదవశాత్తు పేలడంతో కామ్రేడ్ సోమ్‌జీ దేహం అనేక ముక్కలైంది. ఈ దుర్ఘటన మన అజాగ్రత్తల పట్ల ఒక హెచ్చరికగాను, గుణపాఠంగాను ఉండాలి. ఈ ఘటనలో ఒక కామ్రేడ్ గాయపడ్డాడు.

కామ్రేడ్ సోమ్‌జీ అమరత్వాన్ని తెలియజేస్తూ వెంటనే పార్టీ ప్రకటన విడుదల చేసింది. జిల్లాలోను, జోన్‌లోను అనేక ప్రాంతాలలో కేడర్, ప్రజలు కామ్రేడ్ సోమ్‌జీకి జోహార్లు చెబుతూ సంస్మరణ సభలు జరిపారు.

**జోహార్ కామ్రేడ్ సోమ్‌జీ!**

## పత్రికా ప్రకటన

# విప్లవోద్యమ పురోభివృద్ధిని కాంక్షించిన విప్లవ మిత్రురాలు

# కామ్రేడ్ కాకరాల సూర్యకాంతం గారికి విప్లవ జోహార్లు



కామ్రేడ్ కాకరాల సూర్యకాంతం గారు (82) మార్చి18న గురువారం కొండపూర్ లోని సి.ఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో గుండె సంబంధిత అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారని, ఆమె కోరిక మేరకు కండ్లను ఎల్వి ప్రసాద్ కంటి ఆస్పత్రికి, భౌతిక కాయాన్ని ఉస్మానియా మెడికల్ కాలేజీకీ అందజేశారని పత్రికల ద్వారా తెలిసింది.

శ్రీమతి సూర్యకాంతం గారికి చిన్నతనంలోనే కాకరాల వీర వెంకట సత్యన్నారాయణ గారితో వివాహమయ్యింది. గరికపాటి రాజారావు శిష్యుడుగా కమ్యూనిస్టు భావాలతో ఉన్న కాకరాల సినీరంగంలో సీనియర్ కళాకారుడు. విరసం, జెఎన్ఎమ్‌ల ద్వారా విప్లవ రాజకీయాలతో సన్నిహితంగా ఉండేవారు.

కాకరాల గారి సహచర్యంలో కమ్యూనిస్టు విలువలు తెలుసుకున్న సూర్యకాంతంగారు విప్లవ రాజకీయాలతో సన్నిహితమై పిల్లలను విలువలతో పెంచారు. వాళ్ళు పెద్ద వాళ్ళయి విప్లవ మార్గాన పని చేయాలనుకున్నప్పుడు తల్లితండ్రులు ఇద్దరూ ప్రోత్సాహించారు.

శ్రీకాకుళ పోరాట కాలం నుండి విప్లవకారులకు వివిధ రూపాలలో సహకరించడంతో పాటు, బహిరంగ కార్యకలాపాలకు హాజరవుతూ తమ నిబద్ధతను కాపాడుకుంటూ వచ్చారు. తమ దగ్గర పిల్లలు లేకపోయినా అందరిని తమ పిల్లలుగానే భావించి ఆదరించారు. విప్లవోద్యమంలో వారికి అటువంటి పిల్లలు అనేక మంది ఉన్నారు. వృద్ధాప్యంతో, అనారోగ్యంతో వారే ఇద్దరికి సహకరించారు.

**అమ్మ గురించి ఇద్దరు అమ్మాయిలు –**

"అమ్మ గురించి, అమ్మ ప్రేమ గురించి ఎంత చెప్పినా తక్కువే. ప్రపంచంలో అమ్మ మీద అమ్మ ప్రేమ మీద ఎంతో సాహిత్యం, ఎన్నో భాషల్లో హృద్యంగా, ఆర్ద్రంగా వచ్చినా గానీ, అవి అసంపూర్ణమే. సృష్టిలో మాతృత్వం అనేది ఎంతో అపురూపమైనది. సహజమైనది. స్వచ్ఛమైనది. తీయనైనది. భూమి పై జన్మించిన ప్రతి శిశువు వెనక అమ్మ పడ్డ ప్రసవ వేదన వుంది. కడుపులో బిడ్డ రూపం దిద్దుకునే క్షణం నుంచీ, తల్లి ఆలోచనలు, ఆచరణ అంతా రూపం దిద్దుకోని ఆ శిశువు కోసమే. ప్రాణాలకి తెగించి పురుటి నెప్పులు భరించి శిశువుకి ప్రాణం పోసిన తల్లి పుట్టిన నెత్తుటికందుని చూసి తన బాధని మరచి, మురిసి ముద్దులాడుతుంది. ఆ పిల్లల ఆట, పాట, నవ్వు, ఏడుపు, నడక, పరుగు అన్నీ తల్లికి అపురూపమే. అద్భుతమే. పిల్లలకి దెబ్బ తగిలితే అమ్మకి నెప్పి పెడుతుంది. ప్రతిక్షణం పిల్లలే తన ప్రాణంగా చూసుకుని పెంచి, పెద్ద చేసిన అమ్మ గురించి ఏం రాయగలను. ఎంత చెప్పినా అది తక్కువే.

మా చిన్నప్పుడు శ్రీకాకుళ ఉద్యమం జరుగుతున్న సమయంలో జైలు బ్రేక్ చేసి మా ఇంట్లో ఆశ్రయం పొందిన నలుగురు కామ్రేడ్స్ ప్రభావం అమ్మ మీద బాగా పడింది. గరికిపాటి రాజారావు గారి దగ్గర వున్నప్పుడు అందిన కమ్యూనిస్టు పార్టీ రాజకీయాలు, శ్రీకాకుళ ఉద్యమ కార్యకర్తల ప్రభావం యివన్నీ అమ్మకి విశాల ప్రపంచాన్ని చూపాయి. స్వతహాగా అమ్మది ఎదుటి వారిని ప్రేమించే తత్వం. ఎదుటివాళ్ల కష్టాలకి స్పందించి సహకరించే తత్వం. ఆ స్వభావానికి ఈ రాజకీయాలు మరింత పరిమళాన్ని అద్దాయి.

ఎటువంటి ప్రతిఫలాన్ని ఆశించకుండా, నిస్వార్థంగా ఉద్యమంలోకి తమ పిల్లల్ని పంపిస్తూ, ఊపిరి ఉన్నంతవరకూ ఉద్యమాన్ని విడవకండని సందేశాలు యిస్తూ, ఆదేశిస్తున్న తల్లుల ఔన్నత్యాన్ని వర్ణించటం ఎవరి తరం?"

కుటుంబ బాధ్యతలతో, విప్లవ కార్యకలాపాలతో సహకారాన్ని అందిస్తూ ఆమె కాకరాలతో పాటు తనవంతు బాధ్యతను శ్రద్ధగా నిర్వహించి అందరి ప్రేమకు దగ్గరయ్యారు. ఎన్ని కష్టాలు ఎదురైనా 6 దశాబ్దాలకు పైగా విప్లవోద్యమ పురోభివృద్ధినే కాంక్షించిన విప్లవ మిత్రురాలుకు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) వినమ్రంగా జోహార్లర్పిస్తుంది.

**కామ్రేడ్ సూర్యకాంతం గారు కోరుకున్న నూతన సమాజం కోసం చివరి క్షణం వరకు పోరాడుదామని ప్రతిన బూనుదాం.కామ్రేడ్ కాకరాల గారికి, బంధు మిత్రులకు సహానుభూతిని తెలియజేస్తుంది.**

**విప్లవాభినందనలతో,**

**అభయ్ (అధికార ప్రతినిధి),**

***తేదీ: 22 మార్చ్, 2021.*** **సీ.సీ, సీ.పీ.ఐ(మావోయిస్టు).**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ

*పత్రికా ప్రకటన*

***తేది : 20-4-2021***

**ఏప్రిల్ 19 ఉదయం 3 గంటల ప్రాంతంలో బొత్తలంక-పాలగూడెం గ్రామ పరిసరాలలో**

**"డ్రోన్‌ల ద్వారా ప్రభుత్వం చేసిన బాంబు దాడుల"ను ఖండించండి!**

**దండకారణ్య భూభాగం మీద ఆకాశం నుండి దాడులు చేయడంతో ఫాసిస్టు మోడీ, అమిత్‌షా అండ్ కంపెనీ మరింత టెర్రరిస్టులుగా, మరింత దేశ ద్రోహులుగా, నంబర్ 1 సామ్రాజ్యవాద ఏజెంట్లుగా ప్రజల ముందు బహిర్గతమయ్యారు!**

**ఆదివాసీ ప్రాంతాల మీద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో చేసిన ఈ దాడులను విశాల ప్రజానీకం ఖండించి, ప్రతిఘటించాలి!!**

***ప్రియమైన ప్రజలారా, ప్రజాస్వామికవాదులారా!***

ఏప్రిల్ 19 ఉదయం 3 గంటలకు, బీజాపూర్ జిల్లాలోని, పామెడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గల బొత్తలంక-పాలగూడెం గ్రామ పరిసరాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో డ్రోన్‌ల ద్వారా ఆకాశం నుండి బాంబు దాడులు చేసారు.

ఈ దేశ చరిత్రలో ప్రజాఉద్యమాల మీద, జనావాసాల మీద జరిగిన మొదటి డ్రోన్ దాడి ఇది. దేశ చరిత్రలో ఇది ఒక కాలాదివస్ (బ్లాక్‌డే).

'సమాధాన్-ప్రహార్' దాడుల పథకంలో భాగంగా ఏప్రిల్ 3వ తేదీన భారీ స్థాయిలో మారణకాండ చేయడానికి వచ్చిన భద్రతా బలగాల మీద మా పీ.ఎల్.జీ.ఏ చేసిన ప్రతిఘటనలో పోలీసులు మరణించడం అనేది మోడీ, అమిత్‌షాలు, ఇతర క్రూర పోలీసు అధికారులు జీర్ణించుకోలేకపోతున్నారు. "మావోయిస్టులు చావడం, పారిపోవడం తప్ప వేరే మార్గంలేదు" అన్న కులదీప్‌సింగ్ మాటల అర్థం ఏమిటి? అది కార్యాచరణలో డ్రోన్ దాడులుగా అర్థమవుతున్నది. ఆకాశం నుండి బాంబు దాడులు చేసి, దెబ్బతిన్న పోలీసుల మనోస్థైర్యాన్ని పెంచాలనుకోవడం వారి క్రూరమైన ఫాసిజానికీ, రాజకీయ దివాలాకోరుతనానికీ, టెర్రరిజానికి నిదర్శనం.

డ్రోన్లు, హెలికాప్టర్లు నిరంతరం ఆకాశంలో తిరగడాన్ని ప్రమాదంగా శంకించిన ప్రజలు, ప్రజా గెరిల్లాలు అప్రమత్తమై తప్పుకోవడం వలన ప్రమాదం నుండి బయటపడ్డారు. దీంతో అడవి జంతువులు, పక్షులు, ప్రకృతి వినాశనం జరిగింది. (బాంబులు వేసిన స్థలాల ఫోటోలను జత చేస్తున్నాము).

దెబ్బతిన్న పోలీసుల మనోస్థైర్యాన్ని నిలబెట్టాలనీ, దేశీ, విదేశీ కార్పొరేట్ శక్తులకు విశ్వాసాన్ని కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆకాశం నుండి బాంబు దాడులు చేసి, భారీస్థాయి మారణకాండకు పథకరచన చేసారు. సామ్రాజ్యవాద సంస్థలకూ, అదానీ, అంబానీ వంటి దేశద్రోహులకు ఆదివాసీ ప్రాంతంలోని భూములనూ, నీటి వనరులనూ, అడవులలోని ఖనిజసంపదను కట్టబెట్టి వారికి మరింత లాభాలు చేకూర్చేందుకే ఆకాశం నుండి బాంబులు వేసే భారీ మారణకాండలకు పాల్పడుతున్నారు. ఈ విధంగా ప్రజలమీద, శత్రుదేశంపై చేసేటటువంటి దాడిని చేసి, ఈ ప్రాంతం నుండి ప్రజలను ఖాళీ చేయించి విదేశీ కంపెనీలకు ఈ ప్రాంతాన్ని అప్పగించాలనే దుష్టతలంపు ఈ ఘటన ద్వారా స్పష్టం అవుతోంది. దీంతో మోడీ, అమిత్‌షాలు మరింత టెర్రరిస్టులుగా, నంబర్1 దేశద్రోహులుగా, నంబర్1 సామ్రాజ్యవాద ఏజెంట్లుగా ప్రజలముందు బహిర్గతమయ్యారు.

మనదేశంతో సహా ప్రపంచమంతా కరోనావ్యాధితో సమమతమవుతోంది. మరణాల సంఖ్యలో మోడీ ప్రభుత్వం ప్రపంచంలో రెండవస్థానంలో నిలిచింది. సామ్రాజ్యవాదుల లాభాలకోసం సృష్టించిన 'కోవిడ్‌వ్యాధి'ని అరికట్టడంలో అన్ని ప్రభుత్వాలు విఫలమయ్యాయి. మోడీ ప్రభుత్వం మరింత ఘోరంగా విఫలమయ్యింది. కోవ్యాక్సిన్ గురించి మోడీ ప్రభుత్వం ఎంత ప్రచార ఆర్భాటం చేసినా, ప్రజలకు విశ్వాసం కుదరటం లేదు. ఇటువంటి పరిస్థితులలో అంటే ప్రజలు తీవ్రమైన కరోనా విషాదంలో ఉన్నప్పుడు నరహంతకులైన నరేంద్రమోడీ, అమిత్‌షాలు ఆదివాసీ ప్రజానీకాన్నీ, వారికి నాయకత్వం వహిస్తున్న మావోయిస్టు పార్టీనీ, పీ.ఎల్.జీ.ఏను సమూలంగా నిర్మూలన చేయాలని మారణకాండ పథకాలకు రూపకల్పన చేస్తున్నారు. 'ఏప్రిల్ 19 ఉదయం రాత్రి జరిగిన ఆకాశదాడి' ఈ టెర్రరిస్టు పథకంలో భాగమే.

ఫాసిస్టు ప్రభుత్వాలు ఎన్ని కుతంత్రాలు, ఎన్ని దాడులు, ఎన్ని మారణకాండలు చేసినా దండకారణ్య ఆదివాసీ ప్రజాఉద్యమం టెర్రరిస్టు మోడీ, అమిత్‌షాలకు ఒక సవాల్‌గా నిలిచింది. దండకారణ్య-బస్తర్‌ను ఒక శత్రుదేశంగానూ, ఇక్కడి ప్రజలను శత్రుదేశ ప్రజలుగా మోడీ, అమిత్‌లు భావించారు. దానికోసం ఒక భారీ యుద్ధాన్ని ప్రజలమీద చేయాలనీ, అందులో భాగంగా భారీ పోలీసు క్యాంపుల నిర్మాణమూ, కేంద్రబలగాల మోహరింపు, అమెరికా మిలటరీ మ్యానువల్ ప్రకారం భూమి నుండీ, ఆకాశం నుండి దాడి ఇలా ఒకదాని తర్వాత ఒకటి దాడులు చేయాలని పథకరచన చేసారు.

అమెరికా ప్రపంచవ్యాపితంగా ప్రజలపై చేస్తున్న డ్రోన్ దాడుల వలన వేలాది మంది చనిపోతున్నారు. మోడీ ప్రభుత్వం అమెరికా, ఇజ్రాయిల్ నుండి అత్యాధునిక డ్రోన్‌లను కొంటున్నది. వాటితో ప్రజాపోరాటాలు జరుగుతున్న జనావాసాలపైన డ్రోన్ దాడులకు నాంది పలుకుతున్నది.

'జల్, జంగల్, జమీన్, ఇజ్జత్, అధికారం కోసం పోరాడుతున్న ఆదివాసీల, మూలవాసుల ప్రాణాలనూ, వారి ప్రాంతాన్నీ, అటవీ సంపదనూ, ఖనిజసంపదనూ, పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రజలందరి బాధ్యత.

ఆకాశం నుండి ప్రారంభించిన యుద్ధం ప్రజలకు తీవ్ర ప్రాణహాని చేస్తుంది. డ్రోన్ బాంబు దాడులను వెంటనే ఆపివేయాలనీ, ప్రహార్ ఆపరేషన్‌లనూ, పోలీసుక్యాంపుల నిర్మాణాన్ని ఆపివేయాలనీ, కేంద్ర బలగాలను ఆదివాసీ ప్రాంతాల నుండి ఉపసంహరించాలనీ, స్థానిక ఆదివాసీ యువతీ, యువకులతో నిర్మాణం చేస్తున్న డీ.ఆర్.జీ, బస్తర్ బెటాలియన్ లాంటి హంతకమూకలను రద్దు చేయాలనీ, 'లోన్‌వరాట్' పేరుతో ప్రజలను బలవంతంగా లొంగదీసుకునే పథకాలను రద్దు చేయాలని ప్రజలందరూ ముక్తకంఠంతో ఖండించి ఉద్యమించాలి.

బస్తర్ సంభాగ్‌లోని ప్రజాప్రతినిధులు ఈ దాడులకు వ్యతిరేకమా? అనుకూలమా? అనేది స్పష్టం చేయాలి.

దేశవ్యాపితంగా ఆదివాసీ ప్రజలనుండి ఎన్నికైన ప్రజా ప్రతినిధులు, మంత్రులు, వివిధ పార్టీలలో ఉన్నవారందరూ ఈ టెర్రరిస్టు దాడులను వ్యతిరేకించాలి. ఆదివాసీల అస్థిత్వాన్ని కాపాడటానికి ముందుకు రావాలి.

అన్ని పార్లమెంటరీ పార్టీలు ఈ దాడులను ఖండించి ఫాసిస్టుపాలనకు వ్యతిరేకంగా నిలబడాలి.

దేశాన్ని రక్షించుకోవాలంటే దేశద్రోహులైన నరేంద్రమోడీ, అమిత్‌షాల ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా పోరాడాలి.

ప్రజలపై ఫాసిస్టులు చేస్తున్న ఈ అన్యాయమైన యుద్ధానికి వ్యతిరేకంగా ఏప్రిల్ 26నాడు జరపతలపెట్టిన 'భారత్‌బంద్' గురించి విదితమే.

ముఖ్యంగా ఆదివాసీ సంఘాలు, పార్టీలు, ఆదివాసీ మిత్రులు, ప్రజాస్వామిక సంఘాలు, సంస్థలు, పౌరహక్కుల సంస్థలు, కార్మికులు, రైతాంగం, విద్యార్థులు, మేధావులు, దళితులు –విశాల ప్రజానీకం ప్రహార్ దాడులకూ, డ్రోన్ దాడులకు వ్యతిరేకంగా ఉద్యమించాలి.

ప్రభుత్వం డ్రోన్లతో ప్రజలపై బాంబింగ్ చేస్తూ, ఆ విషయాన్ని బయట ప్రపంచానికి తెలియకుండా జాగ్రత్తపడుతుంది. ప్రభుత్వం కుట్రపూరితంగా అమలు చేస్తున్న ఈ అప్రకటిత యుద్ధాన్ని ఖండించండి.

**విప్లవాభివందనాలతో,**

**అధికార ప్రతినిధి,**

Vikalp

**(వికల్ప్)**

**దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ,**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు).**

**డ్రోన్ వేసిన బాంబులకు సంబంధించిన చిత్రాలు**



**బాంబులలోని వివిధ భాగాలు,**



**బాంబు పడిన ప్రదేశం**

సంస్మరణ

## కామ్రేడ్ ఉప్పు కృష్ణకు జోహార్లు

అమరుల బంధుమిత్రుల సంఘం వ్యవస్థాపక సభ్యుడు ఉప్పు కృష్ణ మార్చ్ 7న గుండె పోటుతో మరణించారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లికి చెందిన 'అఖిల భారత ప్రజా ప్రతిఘటన వేదిక'లో రాష్ట్ర స్థాయి నాయకుడుగా పనిచేశారు. ఉప్పు కృష్ణకు ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు. కొడుకు కామ్రేడ్ సంజీవ్ పీపుల్స్ వార్ పార్టీలో పనిచేస్తూ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు. కొడుకు చనిపోయిన కొంత కాలానికి పెద్ద కూతురు కామ్రేడ్ ప్రమీల (నాగమణి) కూడా ఎన్‌కౌంటర్‌లో మరణించారు. అమరుల రక్తసంబంధీకులతో కమిటీ ఏర్పాటు చేసి కన్వీనర్ బాధ్యతలు స్వీకరించారు. అనేక గ్రామాలు తిరిగారు. శవాల స్వాధీనానికి వెళ్ళేవారు. ప్రకాశంలో మార్కాపుర్ హాస్పిటల్లో మావోయిస్టు శవాన్ని తెచ్చుకోవడానికి అతని తల్లిదండ్రులతో పాటు వెళ్లిన కృష్ణపై పోలీసులు దాడిచేసి రెండు చేతులు విరగొట్టి చిత్రహింసలకు గురి చేశారు.

కామ్రేడ్ ఉప్పు కృష్ణ విప్లవ ఆశయాన్ని కొనసాగిద్దాం. కామ్రేడ్ ఉప్పు కృష్ణకు 'క్రాంతి పత్రిక వినమ్రంగా జోహార్లు అర్పిస్తుంది.

*(48వ పేజీ తరువాయి....)*

విద్యార్థుల యేడాది జీవితం వ్యర్థమైంది. మన దేశంలో ఆకస్మికంగా ప్రకటించిన కరోనా లాక్‌డౌన్‌లతో జీవికను కోల్పోయిన 12 కోట్లకు పైగా వలస కూలీల, శ్రమజీవుల బతుకులు దుర్భరమయ్యాయి. మోడీ ప్రభుత్వం విధించిన జీఎస్‌టీతో దెబ్బతిన్న చిన్నపాటి వ్యాపారాలు, పరిశ్రమలు (యం.యస్.యం.ఈ) కరోనా కాలంలో మరింత దెబ్బతినిపోవడంతో వారంతా జీఎస్‌టీకి వ్యతిరేకంగా రోడ్డున పడుతున్నారు. దేశంలోని పబ్లిక్ సెక్టార్‌ను ప్రైవేటుపరం చేయడానికి వ్యతిరేకంగా రక్షణ, బ్యాంకింగ్, రైల్వే, సింగరేణి తదితర అనేక రంగాల కార్మికులు సమ్మెలకు దిగుతున్నారు. కరోనా పేరుతో కార్మికుల జీవితాలను అస్తవ్యస్తం చేస్తూ, వారిని అధిక పని భారానికి లోనుచేస్తూ రోజుకు 12 గంటల పని దినాన్ని అమలు చేస్తున్నారు. ఆ దోపిడీ విధానాల అంతానికై పోరాడడమే ఈనాటి ప్రజా ఉద్యమాల తక్షణ కర్తవ్యంగా స్పష్టం చేస్తున్నది.

మన దేశంలోని ప్రత్యేక పీడిత ప్రజా సముదాయాలకు చెందిన దళితులు, ఆదివాసులు, మత మైనార్టీలు, మహిళలు దేశ పాలకులైన బ్రహ్మణీయ హిందుత్వ శక్తుల ఆటవిక విధానాలకు మునుపెన్నటికన్నా ఎక్కువగా బలవుతున్నారు. భారత రాజ్యాంగంలో భారత పౌరులకు హామీ ఇచ్చిన పౌర ప్రజాస్వామిక హక్కులు రోజు రోజుకు హరించి వేయబడుతున్నాయి. ఈ వినాశకర విధానాలకు గోరీ కట్టాలనీ సమస్త ప్రజా సముదాయాలకు మా పార్టీ పిలుపునిస్తున్నది.

మా పార్టీ పైన పేర్కొన్న దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా ఐదు దశాబ్దాలకు పైగా పోరాడుతున్నది. ఆ పోరాటాలకు నక్సల్బరీ ఒక ఆరంభం అయితే, నక్సలైట్లు దాని వారసులు. 1970ల నాటి ఆపరేషన్ స్టీపుల్‌ఛేజ్ నుండి 2020 ఆపరేషన్ ప్రహార్ వరకు భారత భద్రతా బలగాల చేపట్టిన వందలాది స్వల్పకాల, దీర్ఘకాల అణచివేత కెంపెయిన్‌లను ఎదుర్కొంటూ భారత విప్లవోద్యమం పురోగమిస్తున్నది. అందుకే దశాబ్దంన్నర క్రితమే భారత ప్రభుత్వం వామపక్ష ఉగ్రవాదం దేశ అంతరంగ భద్రతకు పెను ప్రమాదం అని ప్రకటించింది. అప్పటి నుండి ఒకటి తరువాత మరో భారీ నిర్మూలనా కేంపెయిన్లను కోట్లాది రూపాయల ప్రజా నిధులతో రూపొందిస్తూ భారత భద్రతా బలగాలు అమలు చేస్తున్నవి. భారత విప్లవోద్యమాన్ని ఈ దేశంలోని పీడిత ప్రజలు, మహిళలు, కార్మిక, రైతాంగ, విద్యార్థి, మేధావీ, ఉపాధ్యాయ, ఉద్యోగ శక్తులు తమ కంటికి రెప్పలా కాపాడుకుంటూ బలోపేతం చేస్తున్న ఫలితమే నేటి మన భారత విప్లవోద్యమం. భారత విప్లవోద్యమానికి దేశంలోని పీడిత జాతుల ఉద్యమాలు అత్యంత విశ్వసనీయమైన మిత్ర శక్తులుగా నిలిచాయి. వారంతా లేకుండా భారత విప్లవోద్యమమే లేదు. భారత విప్లవోద్యమం లేకుండా వారు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలకు పరిష్కారమే ఉండదు. కాబట్టి వారంతా గతంకన్నా మరింత ధృడంగా, సమైక్యంగా, విస్తృంగా, విశ్వాసంగా భారత విప్లవోద్యమాన్ని కాపాడుకోవడానికి నడుం బిగించాలనీ 1 ఎప్రిల్ నుండి 25 ఎప్రిల్ వరకు ప్రజా సమస్యలపై ఉద్యమించాలనీ, ఎప్రిల్ 26 నాడు భారత్ బంద్ పాటించాలనీ మా పార్టీ కేంద్ర కమిటీ పిలుపునిస్తున్నది.

నోట్ : అత్యవసర సేవలకు బంద్ మినహాయింపు ఉంటుంది.

**విప్లవాభినందనలతో,**

**(అభయ్)**

**అధికార ప్రతినిధి, కేంద్రకమిటీ,**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు).**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ

**పత్రికా ప్రకటన**

## ప్రహార్ దాడులను ఓడిద్దాం, భారత విప్లవోద్యమాన్ని కాపాడుకుందాం!

## విప్లవ ప్రచార, ప్రజా ఉద్యమాల మాసంగా 2021 ఏప్రిల్‌ను పాటిద్దాం!

## ఏప్రిల్ 26 భారత్ బంద్ జయప్రదం చేయండి!

## ప్రజా ఉద్యమాల వెల్లువలే ప్రహార్ ఓటమికి తిరుగులేని ఆయుధాలు!

*ప్రియమైన ప్రజలారా!*

భారత దోపిడీ పాలక వర్గాల భద్రతా బలగాలు 2020 ప్రారంభం నుండి దండకారణ్యంలో కొనసాగిస్తున్న ప్రహార్ దాడులు ఎప్పటికప్పుడు ముమ్మరమవుతున్నాయి. భద్రతా బలగాల ప్రహార్ దాడులను విశాల దండకారణ్య ప్రజా ఉద్యమాలు ధృడంగా ప్రతిఘటిస్తున్నాయి. పీఎల్‌జీఏ గెరిల్లాలు క్రియాశీల ఆత్మరక్షణా చర్యలను కొనసాగిస్తున్నారు. దానితో ఐదు రాష్ట్రాల అత్యున్నత పోలీసు అధికారులు, గత ఇరవై ఏళ్లుగా ఆ రాష్ట్రాలలో కొనసాగుతున్న అర్ధ సైనిక బలగాల ఉన్నతాధికారులు 2020 అక్టోబర్‌లో జాతీయ భద్రతా సలహాదారు కే. విజయకుమార్ ఆధ్వర్యంలో తెలంగాణలో సమావేశమై నవంబర్ నుండి 2021 జూన్ వరకు 8 మాసాలు నిర్ణయాత్మక దాడుల కేంపెయిన్ కొనసాగించాలని నిర్ణయించారు. ఫలితంగా, వేలాది అదనపు బలగాలను తరలిస్తున్నారు. దండకారణ్య గగనతలంపై పగలురాత్రులు మానవ రహిత విమానాలు (డ్రోన్లు), హెలీక్యాప్టర్లు యుద్ధ చర్యలకు లాజిస్టిక్స్ సమకూరుస్తున్నాయి. స్థానిక పోలీసుల ముసుగులో భారత సైనికులు గాలింపు చర్యలలో, సైనిక ఆపరేషన్‌లలో పాల్గొంటుండడంతో యావత్ దండకారణ్యాన్ని దేశ సరిహద్దులలోని ఓ రణభూమిలాగ మార్చారు. దీనికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా 1 ఎప్రిల్ నుండి 25 ఎప్రిల్ వరకు విప్లవ ప్రచార ఆందోళనలను కొనసాగించాల్సిందిగా ఎప్రిల్ 26 భారత్ బంద్ పాటించాల్సిందిగా మా పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ పిలుపునిస్తోంది.

మన దేశంతో సహ ప్రపంచమంతా గత యేణ్ణర్ధంగా ప్రాణాంతక కరోనా మహమ్మారీతో సతమతమవుతోంది. ప్రపంచంలోని కరోనా పీడితులలో, మరణాలలో అమెరికా తదుపరి మన దేశవే రెండవ స్థానంలో నిలిచింది. సామ్రాజ్యవాదులు తమ లాభాల వేటలో భాగంగా సృష్టించిన కొవిడ్-19 వ్యాప్తిని అరికట్టడంలో ఘోరంగా విఫలమవుతున్న మన దేశ పాలకులు యేడాది కాలంగా లాక్‌డౌన్‌లతో, కోవ్యాక్సిన్ ప్రచార ఆర్భాటంతో ప్రజల ప్రాణాలు తోడేస్తున్నారు. రెండవ రౌండు కరోనా విజృంభణతో దేశమంతా కొట్టుమిట్టాడుతుంటే, ఢిల్లీలోని నార్త్ బ్లాక్ మాత్రం మావోయిస్టు విప్లవోద్యమ సమూల నిర్మూలనకు వేగిరపడుతోంది. దేశ జనాభాలోని 60 శాతం ప్రజలకు జీవనాధారమైన వ్యవసాయాన్ని దెబ్బతీసే నూతన వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని లక్షలాది అన్నదాతలు ఢిల్లీలో ఆందోళనలు కొనసాగిస్తుంటే వారితో చర్చలు సైతం నిలిపివేసి, ఐదు రాష్ట్రాల విధాన సభల ఎన్నికలలో తలమునకలైన మోడీ అండ్ పార్టీ దండకారణ్య అడవులలోని ప్రజలపై యుద్ధానికి సిద్ధపడింది. మన దేశంలోని దోపిడీ పాలకుల, వారి అత్యున్నత పోలీసు అధికారుల ప్రజా హంతక వైఖరిని మా పార్టీ ఖండిస్తోంది.

మన దేశం అనేక సమస్యలతో సతమతమవుతున్నది. పెట్రోల్, డిజిల్ ధరల పెరుగుదలతో సాధారణ ప్రజల జీవితం అతలాకుతలం అవుతోంది. ఆన్‌లైన్ విద్యకు నోచుకొని 80 శాతం

*(మిగతాది 47వ పేజీలో...)*